మేడారం సాక్షి ఫోకస్

- వివరాలు 8,9లో▸

మహా జాతర.. పనుల పాతర

- పనులకు పదిరోజులే డెడ్‌లైన్..
- నత్తనడకన సాగుతున్న మరుగుదొడ్ల వర్క్స్
- జాడలేని తాగునీటి పైపులైన్ పనులు
- వైద్య సేవలు అంతంతమాత్రమే

- ఎస్‌ఎస్ తాడ్వాయి



సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ



సాక్షి 24|7

జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం
5-1-2018

తరలి వచ్చి.. మొక్కులు తీర్చి..

సమ్మక్క-సారలమ్మ మహాజాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ మేడారంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. తల్లులను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. జంపన్నవాగులో స్నానాలు చేసి వనదేవతలకు పసుపు, కుంకుమ, బంగారం, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. చెట్ల కింద వంటావార్పుతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.

ఈసారైనా..!

గత ఏడాది గులాబీ నాయకులకే అందిన సబ్సిడీ ట్రాక్టర్లు

- ఈ ఏడాది జిల్లాకు రూ.9 కోట్లు నిధుల కేటాయింపు
- అర్హులైన లబ్ధిదారుల ఎంపికపై అనుమానాలు
- వ్యవసాయ యాంత్రీకరణ కోసం రైతుల ఎదురుచూపులు

భూపాలపల్లి రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకం గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలకు వరంగా మారింది. ఎంపికైన జాబితాలో మొత్తం ఆ పార్టీకి చెందినవారే ఉండడంతో అర్హులైన సామాన్య రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది 2016–17 ఆర్థిక సంవత్సరంలో ఈ పథకం కింద జిల్లాకు రూ.6.26 కోట్లు మంజూరు కాగా ఈ నిధులతో 108 ట్రాక్టర్లతోపాటు యంత్రాలు, తైవాన్ స్ప్రేయర్లు, టార్పెన్లు అందజేశారు. 2017–18 ఆర్థిక సంవత్సరానికి కేటాయించిన రూ.9 కోట్ల నిధులతో సబ్సిడీ ట్రాక్టర్లను అందజేసేందుకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.

రూ.6 లక్షల సబ్సిడీతో

- మిగతా 2లో▸



ఒకే లక్ష్యం.. ఆలోచన.. సర్వీస్

- రాష్ట్రం అంతటా ఒకే పోలీసింగ్
- పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం కలిగించాలి
- పోలీస్ శాఖలో ఇక నుంచి నెలవారీ పదోన్నతులు
- డీజీపీ మహేందర్‌రెడ్డి వెల్లడి
- 'అర్బన్'లో తొలిసారిగా పర్యటించిన పోలీస్ బాస్
- కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం
- అధికారులతో సమీక్ష సమావేశం

వరంగల్ క్రైం : ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే లక్ష్యం.. ఒకే ఆలోచన.. ఒకే సర్వీస్ విధానంలో పోలీసులు సేవలందించాలని డీజీపీ మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలు మన దగ్గరకు వచ్చినా.. మనం వాళ్ల దగ్గరకు పోయినా.. వారి అవసరాలను గుర్తుంచుకుని ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒకే లక్ష్యం అంటే రాష్ట్రం అంతటా ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థ.. ఒకే ఆలోచన అంటే ధనిక, పేద, ఆడ, మగ తేడా లేకుండా.. ఒకే సర్వీస్ అంటే ఏ పోలీస్ అధికారి ఉన్నా బాధితులకు సత్వర న్యాయం అందించడమని వివరించారు. డీజీపీ మహేందర్‌రెడ్డి గురువారం తొలిసారిగా వరంగల్ అర్బన్ జిల్లాకు వచ్చారు. హెలికాప్టర్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో దిగారు. ఆయనకు వరంగల్ కలెక్టర్ అమ్రపాలి, పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు, డీసీపీలు పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి డీజీపీ

- మిగతా 2లో▸

చలి కాగి.. బైక్ నడిపి

- చల్లగరిగెలో పర్యటించిన శాసనసభాపతి మధుసూదనాచారి
- ప్రజలతో చలిమంటల వద్ద ముచ్చట్లు
- వీధుల్లో అభివృద్ధి పనుల పరిశీలన

చిట్యాల(భూపాలపల్లి): చిట్యాల మండలంలోని చల్లగరిగె గ్రామంలో బుధవారం రాత్రి ప్రగతి నిద్ర చేసిన శాసనసభ స్పీకర్ మధుసూదనాచారి గురువారం తెల్లవారుజామున గ్రామస్తులతో ఉత్సాహంగా గడిపారు. రాత్రి స్థానిక యాదవ కమ్యూనిటీ హాల్‌లో నిద్రించిన ఆయన తెల్లవారుజామున గ్రామస్తులతో ముచ్చటిస్తూ చలి మంటలు కాగారు. అనంతరం వేప పుల్ల నోట్లో వేసుకొని బైక్‌పై

- మిగతా 2లో▸



చల్లగరిగె గ్రామంలో వృద్ధులతో మాట్లాడుతూ చలిమంట కాగుతున్న స్పీకర్

'డబుల్' ఇళ్ల కేటాయింపుల్లో అక్రమాలు


సమావేశంలో మాట్లాడుతున్న అప్పం కిషన్

టేకుమట్ల: డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులో టీఆర్ఎస్ నాయకులు డబుల్ గేమ్ ఆడుతున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అప్పం కిషన్ ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇండ్ల కేటాయింపులో నాయకులు అక్రమాలకు పాల్పడుతూ ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో కుల, మత, పార్టీలకతీతంగా జిల్లాకు 42లక్షల ఇండ్లను కేటాయించారని కొనియాడారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

అనంతరం వివిధ పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీ లో 30మంది యువకులు చేరారు. వారిలో వైనాల యశ్వంత్, బూర్గుల రాజ్‌కుమార్, వెంకటేశ్, అజ్మల్, యాదగిరి, ప్రసాద్, నాగరాజు, సంపత్ తదితరులున్నారు. జిల్లా నాయకులు జన్నె రమేష్, పసుల రత్నాకర్, అల్లె అర్జున్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

చలి తీవ్రతతో వృద్ధుడి మృతి

మహముత్తారం: మండలంలోని యామన్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని నిమ్మగూడెం తండాకు చెందిన నూనావత్ తోక్లానాయక్(80) గురువారం మృతిచెందాడు. గత రెండు రోజుల నుంచి మండలంలో ఈదురుగాలులతో కూడిన చలి ఎక్కువైంది. చలి తీవ్రతను తట్టుకోలేక తోక్లా నాయక్ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు.

చలి కాగి.. బైక్ నడిపి..

▶మొదటిపేజీ తరువాయి

తిరుగుతూ గ్రామాన్ని, పంట పొలాలను పరిశీలిస్తూ స్థానికులను ఆశ్చర్య పరిచారు. చల్లగరిగె గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని స్పీకర్ సిరికొండ మధుసూదనచారి హామీ ఇచ్చారు. మండలంలోని చల్లగరిగె గ్రామంలోని యాదవ కమ్యూనిటీహాల్‌లో బుధవారం రాత్రి స్పీకర్ ప్రగతి నిద్ర చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కమ్యూనిటీహాల్ వద్ద గ్రామస్తులతో చలిమంటలు కాగారు. వాడల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, చెరువు పనులను ప్రజలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీరన్నగుడి నిర్మాణానికి రూ.5 లక్షలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించ డంతోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అదనంగా మరో 25 డబుల్‌బెడ్ రూం ఇల్లు మంజూరు చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిపక్ష నాయకుల తప్పుడు ప్రచారాన్ని నమ్మకూడదన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు కలలు కంటున్న బంగారు తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ కుంభం రవిందర్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ కర్రె అశోక్‌రెడ్డి, సర్పంచ్ నోముల మమత, ఎంపీటీసీ సభ్యురాలు బాలగోని శోభ, ఉపసర్పంచ్ అశోక్, యాదవ సొసైటీ చైర్మన్ సంగ సమ్మయ్య, నాయకులు నాగరాజు, రాజయ్య, రమేష్, మల్లయ్య, గణపతి, రవీందర్ కార్యకర్తలు పాల్గొన్నారు.


బైక్ నడుపుతూ వెళ్తున్న స్పీకర్ మధుసూదనాచారి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీజీపీ మహేందర్‌రెడ్డి


సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు

ఒకే లక్ష్యం.. ఒకే ఆలోచన.. ఒకే సర్వీస్

▶మొదటిపేజీ తరువాయి

కమిషనరేట్‌కు వెళ్లి కమాండ్ కంట్రోల్ రూం శిలాఫలకాన్ని ఆవిష్కరించగా, కలెక్టర్ అమ్రపాలి రిబ్బన్ కట్ చేసి కమాండ్ కంట్రోల్ రూంను ప్రారంభించారు. ఆ తర్వాత డీజీపీ నగరంలో వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న సీసీ కెమెరాల పనితీరును, కమిషనరేట్‌లో నిర్మాణంలో ఉన్న నూతన కమిషనరేట్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందితో మాట్లాడారు. అనంతరం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)లో కమిషనరేట్ పరిధిలోని డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, వివిధ విభాగాల అధికారులతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఆ తర్వాత డీజీపీ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని కమిషనరేట్లు, పోలీసు కార్యాలయాల్లో ఒకే రకమైన పోలీసు విధానం కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ లక్ష్యాలకనుగుణంగా ఇకపై ఎలాంటి విధానం కొనసాగాలి, ప్రజలు ఏం కోరుకుంటున్నారు, వారికి దగ్గర కావడానికి ఏం చేయాలి, ఏం చేస్తే వారి మనసులు గెలుచుకుంటాం, ప్రజల జీవన ప్రమాణాలు పెంచటానికి ఏం చేయాలి అనే అంశాలపై పోలీసు అధికారులతో కూలంకుషంగా చర్చించినట్లు వెల్లడించారు. ప్రజలకు పోలీసులు జవాబుదారీతనంగా ఉండాలని, ప్రజల్లో పోలీస్ వ్యవస్థపై నమ్మకం కలిగించాలన్నారు.

థర్డ్ పార్టీతో రేటింగ్...

పోలీస్ స్టేషన్ల పనితీరు, పోలీస్ అధికారులు, సిబ్బంది పని తీరు గురించి థర్డ్‌పార్టీ ద్వారా ఎప్పటికప్పుడు సమాచారం సేకరించనున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్లకు, వ్యక్తిగతంగా పోలీస్ అధికారులకు రేటింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. దీంతో పోలీసుల పని విధానంలో నాణ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు శాఖలోని అన్ని విభాగాల్లో ఖాళీలను నెలవారీ పదోన్నతులతో భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అధికారులు కోర్టులకు ఎక్కువద్దని, సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కరించాలని, కోర్టులకు ఎక్కడం వల్ల చాలా మందికి నష్టం కలుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఐజీ నాగిరెడ్డి, వరంగల్ పోలీసు కమిషనర్ సుధీర్‌బాబులు పాల్గొన్నారు. కాగా, వరంగల్ అర్బన్ పర్యటనకు ముందు డీజీపీ మహబూబాబాద్ జిల్లాలో పర్యటించారు. మానుకోట జిల్లా పోలీసు కార్యాలయానికి కేటాయించిన స్థలాన్ని, జిల్లా పోలీసు కార్యాలయాన్ని పరిశీలించారు. కాగా, డీజీపీని పోలీస్ అమరుల కుటుంబ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. సాయంత్రం 5 గంటలకు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. డీజీపీతో నార్త్ రేంజ్ ఐజీ నాగిరెడ్డి ఉన్నారు.

శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి

ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సుమన్

చిట్యాల:

చదువుతో పాటు విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరుచుకొని శాస్త్రవేత్తలు కావాలని సైంటిఫిక్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పెండ్యాల సుమన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సువిద్య డిగ్రీ కళాశాలలో మూఢనమ్మకాలు, మంత్రాలు, తంత్రాలపై నిర్వహించిన మ్యాజిక్‌షో విద్యార్థులను ఆలోచింపజేసింది. కళాశాల ప్రిన్సిపాల్ మురాల తిరుపతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో సుమన్ మాట్లాడారు. స్వేరోస్ జిల్లా అధికార ప్రతినిధి పెండ్యాల రవీందర్, ఎస్ఎస్ఎఫ్ మొగుళ్లపల్లి మండల అధ్యక్షుడు రమేష్,


మ్యాజిక్ ప్రదర్శన ఇస్తున్న సుమన్

కళాశాల అధ్యాపకులు రాజన్న, శ్రీనివాస్, రాజేందర్, రాజు, శ్రీకాంత్, వేణు, శివకుమార్, స్వామి, రూప్సీరాణి, ప్రేమలత, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న 15 ఇసుక లారీలకు జరిమానా

కాటారం: ఇసుక క్వారీల నుంచి ఓవర్‌లోడ్ తో వెళ్తున్న 15 ఇసుక లారీలు, టిప్పర్లను కాటారం మండల కేంద్రం శివారులో బుధవారం రాత్రి విజిలెన్స్ సీఐ అమృత్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టుకున్నారు. లారీలను సేఫ్ కస్టడీ కోసం పోలీసులకు అప్పగించారు. లారీల సమాచారాన్ని మైనింగ్, రవాణా శాఖ అధికారులకు అందజేయడంతో గురువారం ఎంవీఐ రవీందర్ కాటారం చేరుకొని లారీలను పరిశీలించారు. వేబ్రిడ్జి తూకం పత్రాలను పరిశీలించి జరిమానా విధించారు.

ఈసారైనా..!

▶మొదటిపేజీ తరువాయి

అర్హులైన రైతులకు 158 ట్రాక్టర్లు, రూ.3 కోట్లతో పరికరాలను అందజేయనున్నారు. లబ్ధిదారులను కమిటీ ద్వారా ఎంపిక చేసి 50 శాతం సబ్సిడీతో యంత్రాలు అందించనున్నారు. ఈ ట్రాక్టర్లు, పరికరాల కోసం జిల్లావ్యాప్తంగా సుమారు 600కుపైగా దరఖాస్తులు వచ్చాయి. నిధుల విడుదలపై అధికారులకు ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇవ్వకపోవడంతో కార్యాచరణ రూపుదాల్చడం లేదు.

సాంకేతిక మార్పులు

వ్యవసాయంలో ఏటా వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతిలో రైతులు యంత్రాలతో వ్యవసాయం చేస్తున్నారు. ఒకప్పుడు పొలాలను ఎడ్ల నాగళ్లతో దున్నేవారు. పంట చేతికి రావాలంటే కనీసం 15 రోజులు సమయం పట్టేది. ప్రస్తుతం యంత్రాలతోపాటు ట్రాక్టర్లను ఉపయోగించిండంతో ఒక రోజులోనే పంట ఇంటికి చేరుతోంది. కలుపుతీత యంత్రాలు, ఎరువులు చల్లే యంత్రాలు, వరినాటే యంత్రాలు, పవర్ టిల్లర్లు, రోటవేటర్, గొర్రు యంత్రం, డ్రమ్ సీడర్ తదితర యంత్రాలు రావడంతో రైతులు వాటికి అలవాటు పడుతున్నారు. వీటిని స్వయంగా కొనుగోలు చేయాలంటే లక్షల్లో వ్యయం అవుతుంది. రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం ఈ నిధులతో చిన్న సన్నకారు రైతులకు యంత్ర పరికరాలను సబ్సిడీపై అందజేస్తోంది.

లబ్ధిదారుల ఎంపిక సవ్యంగా జరిగేనా ?

రైతుల కష్టాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం అధికార పార్టీ నాయకులకు వరంగా మారిందనేది సామాన్య రైతుల ఆరోపణ. గత ఏడాది అధికార పార్టీ నాయకులు తమ బంధువుల పేరిట సబ్సిడీ ట్రాక్టర్లు తీసుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజాగా అమలు చేయనున్న వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నూతన మార్గదర్శకాల ద్వారా అమల్లోకి తీసుకురానున్నారని తెలిసింది. గతంలో మాదిరిగా అధికార పార్టీ నాయకులకే అధిక ప్రాధాన్యమిస్తారా ? లేదా సామాజిక కోణంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారా అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

చిన్న, సన్నకారు రైతులకు ట్రాక్టర్లు ఇవ్వాలి



సబ్సిడీ ట్రాక్టర్లకు లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలి. సన్న, చిన్న కారు రైతులకు ఇవ్వడంవల్ల చాలా ఉపయోగం ఉంటుంది. ట్రాక్టర్లతోపాటు అధునాతన పరికరాలు అందివ్వాలి. దీంతో కూలీల కొరత తీరుతుంది. చాలామంది రైతులు ట్రాక్టర్ల కోసం ఎదురు చూస్తున్నారు.

– డి.నారాయణరావు, రైతు

ప్రాణం తీసిన బియ్యం దందా

- హసన్‌పర్తిలో వ్యాపారి హత్య
- కళ్లలో కారంపొడి చల్లి దాడి
- పథకం ప్రకారమే ఘాతుకం





కుమారస్వామి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ సత్యనారాయణ, ఇన్‌స్పెక్టర్ కిషన్, (ఇన్‌సెట్‌లో) చిత్తారి కుమారస్వామి మృతదేహం

హసన్‌పర్తి: పీడీఎస్ బియ్యం దందా ఓ వ్యాపారి ప్రాణం తీసింది. లాభాల విషయంలో జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ప్రత్యర్థి వర్గాలు చేసిన దాడిలో హసన్‌పర్తికి చెందిన చిత్తారి కుమారస్వామి (35) ప్రాణాలు వదిలాడు. హసన్‌పర్తి మండల కేంద్రంలో విద్యానగర్ (నారాయణ కళా మందిర్) వద్ద బుధవారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన చిత్తారి కుమారస్వామి, చిత్తారి వెంకటేష్ అలియాస్ అబ్రహం సమీప బంధువులు. వీరితోపాటు మరికొంతమంది పీడీఎస్ బియ్యం వ్యాపారానికి తెరలేపారు. కొంతకాలంగా వివిధ వర్గాలు, డీలర్ల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని సేకరిస్తున్నారు. ఆ బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు ఎక్కువ ధరకు విక్రయించడం ప్రారంభించారు. వీరి వ్యాపారం మూడు పూలు ఆరు కాయలుగా సాగుతోంది. పీడీఎస్ బియ్యం దందాలో లాభాలు రావడంతో కుమారస్వామి, వెంకటేష్ అలియాస్ అబ్రహం పాత ఇనుప సామాను వ్యాపారానికి స్వస్తి పలికారు.

టాస్క్‌ఫోర్స్ దాడులతో వేర్వేరు వ్యాపారాలు

ఇటీవల పీడీఎస్ బియ్యం నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు అధికమయ్యాయి. దీంతో బియ్యం వ్యాపారం తగ్గుముఖం పట్టింది. ఈ క్రమంలో వెంకటేష్, కుమారస్వామి వేర్వేరుగా వ్యాపారాన్ని కొనసాగించడం ప్రారంభించారని సమాచారం. ఇద్దరు కలిసి వ్యాపారం చేసినప్పుడు వచ్చిన లాభాల విషయంలో వీరికి కొంతకాలంగా విభేదాలు వచ్చాయి. ఓ మహిళతో కొనసాగిస్తున్న వివాహేతర సంబంధానికి కుమారస్వామి అడ్డు తగిలి పంచాయితీ నిర్వహించి, వెంకటేష్‌కు జరిమానా విధించాడు. దీంతో కుమారస్వామిపై వెంకటేష్ పగ పెంచుకున్నాడని పోలీసులు భావిస్తున్నారు. అయితే పైకి కుమారస్వామితో స్నేహంగానే ఉంటూ లోపల మాత్రం వెంకటేష్ పగతో రగిలిపోయేవాడని స్థానికుల ద్వారా తెలిసింది.

పథకం ప్రకారం హత్య..

కుమారస్వామిని ఎలాగైనా హత్య చేయాలని వెంకటేష్ నిర్ణయించుకుని కారం పొడిని సిద్ధంగా ఉంచుకున్నాడు. తర్వాత పక్కనే ఉన్న వైన్స్‌షాపు నుంచి మద్యం కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి విద్యానగర్ (నారాయణ కళామందిర్) పక్కనే కుమారస్వామి, వెంకటేష్, పోతరాజు మధుకర్, బండెల అవినాష్ చిత్తుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో వెంకటేష్, కుమారస్వామి మధ్య వాగ్వాదం చేసుకుంది. దీంతో వెంకటేష్ తన వెంట తీసుకొచ్చిన కారం పొడిని కుమారస్వామి కళ్లలో చల్లి దాడికి పాల్పడ్డాడు. వెంకటేష్ కిక్ బాక్సర్ కావడంతో గుప్త అవయవాలపై వేసిన బలమైన వేటుకు కుమారస్వామి ప్రాణాలు వదిలాడు. అనంతరం హతుడి సమీప బంధువు చందుకు చెప్పినట్లు కుటుంబ సభ్యులు పేర్కొంటున్నారు. సమాచారం అందుకున్న కాజీపేట ఏసీపీ సత్యనారాయణ, హసన్‌పర్తి పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా హతుడి కుటుంబ సభ్యులతో పాటు చుట్టు పక్కల వారిని విచారించారు. సంఘటన స్థలంలో జాగిలాలతో గాలింపు చర్యలు చేపట్టారు. పోతరాజు మధుకర్, అవినాష్‌తోపాటు వెంకటేష్ ఇళ్లలోకి జాగిలాలు వెళ్లాయి. క్లూస్ టీం సంఘటన స్థలాన్ని చేరుకుని వేలిముద్రలను సేకరించింది.

ముల్కనూర్‌లో విషాదం

భీమదేవరపల్లి: హసన్‌పర్తిలో హత్యకు గురైన చిత్తారి కుమారస్వామి స్వగ్రామమైన భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ బుడిగజంగాల కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయి. గతంలో కుమారస్వామి ముల్కనూర్ పరిసర గ్రామాల్లో ఇనుప సామానుకు ఉల్లిగడ్డలు విక్రయిస్తూ జీవనం కొనసాగించేవాడు. కొన్నేళ్లుగా హసన్‌పర్తిలో జీవిస్తున్నాడు. కాగా మృతుడికి భార్య స్వప్న, కూతురు, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఖమ్మంలో నిందితుల అరెస్ట్

ఖమ్మం క్రైం: కుమారస్వామి హత్య కేసులో నిందితులను ఖమ్మం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. హసన్‌పర్తిలో కుమారస్వామిని బుధవారం అర్ధరాత్రి స్వయాన తమ్ముడు, మరో ఇద్దరు కలిసి హత్య చేసి కారులో ఖమ్మం పారిపోయారు. నిందితులు ఖమ్మంలో ఉన్నట్లు హసన్‌పర్తి పోలీసులు తెలుసుకుని ఖమ్మం వన్‌టౌన్ పోలీసులను సంప్రదించారు. హసన్‌పర్తి పోలీసులు, ఖమ్మం వన్‌టౌన్ సీఐ రమేష్, ఏఎస్సై రాము స్టేషన్ రోడ్డులోని సిటీ లాడ్జిలో ఉన్న గదిపై దాడి చేసి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు యువకులు మృతి చెందారు. వరంగల్ రూరల్ జిల్లా నెక్కొండ మండలం పనికర గ్రామంలో కాసుల రాము, జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలో అజ్మీరా (లింగా) అనే యువకులు బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారు.

ACCIDENT



రాము (ఫైల్)

నెక్కొండ: మండలంలోని దీక్షకుంట గ్రామానికి చెందిన కాసుల రాము (25) బుధవారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు నెక్కొండ ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..హన్మకొండ హంటర్ రోడ్డులో ఉన్న పెట్రోల్ పంపులో రాము పనిచేస్తున్నాడు. రాము పనులు ముగించుకుని నెక్కొండ మీదుగా ఇంటికి వెళ్తుండగా పనికర గ్రామంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. పనికర గ్రామంలో నిలిచి ఉన్న డీసీఎంను ద్విచక్రవాహనంపై వస్తున్న రాము రాత్రి సమయంలో ఢీకొన్నాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రామును పనికర గ్రామస్తులు వెంటనే చికిత్స నిమిత్తం నర్సంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. రామును పరీక్షించిన వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నెక్కొండ ఎస్సై నవీన్‌కుమార్ మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టానికి తరలించారు.

ట్రాక్టర్ కిందపడి యువకుడు..

రఘునాథపల్లి: కూలి పనులకు వెళ్లి వస్తున్న ఓ యువకుడు ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి దుర్మరణం చెందిన సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండల కేంద్రంలోని వెల్ది క్రాస్‌రోడ్డు వద్ద జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్మెట మండలం మచ్చుపహాడ్ గ్రామ శివారు లోక్య తండాకు చెందిన అజ్మీరా లింగా (29) తల్లిదండ్రులకు ఆసరాగా కూలి పనులకు వెళ్తుంటాడు. ఈ క్రమంలో బుధవారం మండలంలోని జాఫర్‌గూడెం శివారు కుసుంబాయితండా వాసులతో కలిసి ట్రాక్టర్‌పై కంచనపల్లిలో సెంట్రింగ్ పనులకు వెళ్లాడు. పనులు పూర్తయ్యాక రాత్రి సమయంలో కూలీలతో కలిసి అదే ట్రాక్టర్‌లో లింగా ఇంజన్‌పై కూర్చొని తిరిగి బయలు దేరాడు. వెల్ది క్రాస్ రోడ్డు వద్ద గుంత కారణంగా ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న లింగా ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. వెనుక ట్రాక్టర్‌కు ఉన్న మిల్లర్ టైరు ఎక్కింది. దీంతో లింగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడి తండ్రి సక్రునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్‌రావు తెలిపారు.

నకిలీ నోట్ల ముఠా అరెస్ట్

- రెండు కార్లు, ప్రింటర్, స్కానర్, రూ.1.12 లక్షలు స్వాధీనం
- సీసీ ఫుటేజీల ఆధారంగానే నిందితుల గుర్తింపు : డీసీపీ మల్లారెడ్డి



నకిలీ నోట్లను చూపిస్తున్న డీసీపీ మల్లారెడ్డి

జనగామ: నకిలీ నోట్లను చెలామణి చేస్తున్న ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ మల్లారెడ్డి తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ బాపురెడ్డి, సీఐ ముష్క శ్రీనివాస్‌తో కలిసి డీసీపీ మల్లారెడ్డి మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని శ్రీ భవాని బ్యాంగిల్ స్టోర్‌లో గత నెల 28 రాత్రి ఓ మహిళ కారులో వచ్చి రూ.270 విలువ గల వస్తువులను కొనుగోలు చేసిందని తెలిపారు. రూ.2 వేల నకిలీ నోటు ఇవ్వగా..గమనించని వ్యాపారి రూ.1730 ఇవ్వగా తీసుకుని మాయమై పోయిందని స్పష్టం చేశారు. కొద్ది సేపటి తర్వాత అనుమానం వచ్చిన వ్యాపారి నోటును పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పెషల్ టీంను ఏర్పాటు చేసి రంగంలోకి దింపామని తెలిపారు. సీసీ పుటేజీల ద్వారా ఏపీ 36 ఏ 0405 నంబరు గల కారులో మహిళ వచ్చినట్లుగా గుర్తించామన్నారు. కారును హన్మకొండలోని ఓ గ్యారేజీలో కొనుగోలు చేసినట్లుగా నిర్ధారించుకున్నామని చెప్పారు.

వీరు ఎవరంటే..

నల్లగొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన బెజవాడ రాజీవ్ ఉపాధి కోసం ఎదేళ్ల క్రితం తొర్రూరుకు వచ్చి హోం నీడ్స్ వ్యాపారం చేశాడు. అక్కడే ఎండీ.చాందిని అనే మహిళ రాజీవ్‌తో పరిచయం ఏర్పడిందని తెలిపారు. చాందినికి ఇద్దరు పిల్లలు షఫి, రఫి జన్మించిన తర్వాత భర్త వదిలేయడంతో రాజీవ్‌తో సహజీవనం సాగిస్తోందన్నారు. మూడు సంవత్సరాల క్రితం తొర్రూరు నుంచి వారు హన్మకొండలోని వినాయక్‌నగర్ కొత్తూరు జెండాకు మకాం మార్చినట్లు వివరించారు. షఫి, రాజీవ్, చాందినీ నకిలీ నోట్లు చెలామణి చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఐదు నెలల క్రితం రిలయన్స్ మాల్‌లో హెచ్‌పీ కలర్ ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. ఇప్పటి వరకు రూ.7లక్షలకు పైగా రూ.2 వేల దొంగ నోట్లను పలు ప్రాంతాల్లో చెలామణి చేశారు. నకిలీ నోట్లు చెలామణి చేస్తున్న రాజీవ్, ఎండీ.చాందిని, ఆమె కుమారుడు షఫిని ఈనెల 3న హన్మకొండలోని వినాయక్‌నగర్‌లో అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. వీరి నుంచి రూ.1.12 లక్షల విలువగల రూ.2 వేల నకిలీ నోట్లు, బ్యాంకు ఖాతాలో రూ.1.30 లక్షలు, రూ.పది వేల అసలునోట్లతో పాటు రెండు కార్లు, స్కానర్, ప్రింటర్, పేపర్, డ్యాక్యుమెంట్లు, ఐదు సెల్‌ఫోన్లను సీజ్ చేసినట్లు డీసీపీ వివరించారు.

రెండు వేల నోటును క్షుణ్ణంగా పరిశీలించాలి

వ్యాపారులు, ప్రజలు రూ.2వేల నోట్లు ఇచ్చిపుచ్చుకునే క్రమంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించుకోవాలని డీసీపీ మల్లారెడ్డి సూచించారు. అసలు రూ.రెండు వేల నోటుపై మెరిసే దారం..తెల్లటి భాగంలో గాంధీ ఫొటోను గుర్తిస్తే సరిపోతుందన్నారు. సమావేశంలో ఎస్సై సంతోషం రవీందర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



భిక్షపతి (ఫైల్)

వర్ధన్నపేట: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పసునూరి భిక్షపతి (55) మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం..మండలంలోని ఇల్లందకు చెందిన పసునూరి భిక్షపతి వారం రోజుల క్రితం జరిగిన ఆటో ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. హన్మకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భిక్షపతి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడు.

విద్యుదాఘాతంతో కూలీ..

మడికొండ: విద్యుదాఘాతంతో ప్రైవేట్ కూలీ మృతి చెందిన సంఘటన టేకులగూడెంలో జరిగింది. మడికొండ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ రూరల్ జిల్లా గీసుకొండ గ్రామానికి చెందిన గుగులోతు పూల్‌సింగ్(30) టేకులగూడెం గ్రామ శివారులో దినసరి కూలీగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈక్రమంలో బుధవారం సాయంత్రం 4 గంటల ప్రాంతంలో విద్యుత్ పోల్‌ను అమరుస్తున్న క్రమంలో పైన ఉన్న 33 కేవీ తీగలు తగిలాయి. చేతులు కాలిపోయి షాక్‌కు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. భార్య గుగులోతు నీల ఫిర్యాదు మేరకు కాంట్రాక్టర్ వీరన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తిరుమల సమాచారం



తిరుమలలో గురువారం భక్తుల రద్దీ మోస్తరుగా ఉంది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు–	ఖాళీ లేవు
రూ.50 గదులు–	ఖాళీ లేవు
రూ.100 గదులు–	ఖాళీ లేవు
రూ.500 గదులు–	ఖాళీ లేవు
సేవలు	
సహస్ర దీపాలంకరణ–	ఖాళీ లేవు
వసంతోత్సవం–	ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం–	ఖాళీ లేవు

శుక్రవారం ప్రత్యేక సేవ : అభిషేకం

వరంగల్ మార్కెట్ ధరలు

వస్తువులు (క్వింటాల్)	గరిష్టం (రూ.)	కనిష్టం (రూ)
విజయమసూరి(పాతవి)	1950	1850
ఎంటీయూ 100	1600	1600
ఎంటీయూ1001 రకం	1450	1450
వ్యాపారస్థులు(పాతవి)	1219	1149
పల్లికాయ	4511	4000
కందులు	4059	3280
పెసర్లు	4659	4608
మినుములు	4910	4910
అలుచందలు(నల్లవి)	5004	4950
అలుచందలు(ఎర్రవి)	4455	4455
అలుచందలు(తెల్లవి)	4329	4312
పత్తి(క్వింటాల్)		
వ్యాపారస్తులు	5030	4725
మిర్చి(క్వింటాల్)		
తేజ	8400	4500
తాలు	3500	1300

పాడి-పంట

పసుపులో అధిక దిగుబడులు

- రాజేంద్ర సొనాలి రకం మేలుదుంప కుళ్లు రోగాలను తట్టుకుంటుంది..
- మల్యాల కృషి విజ్ఞానకేంద్రం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ సరళ కుమారి



జయ్యారంలో పసుపు పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

మరిపెడ(డోర్నకల్): పసుపు పంటలో రాజేంద్రసోనాలి అనే రకం దుంపకుల్లు రోగాలను తట్టుకునే శక్తి వుంటుందని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగాం కో ఆర్డినేటర్ సరళ కుమారి అన్నారు. చిన్నగూడూరు మండలంలోని జయ్యారం గ్రామానికి చెందిన వల్లూరి వెంకటరెడ్డి పసుపు పంటలో గురువారం పసుపు పంట క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులు పసుపుతో పాటు ఏ పంటనైనా యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధిస్తారని చెప్పారు. ఇదే గ్రామానికి చెందిన రైతు వల్లూరి కృష్ణారెడ్డి గత ఏడాది ఇదే రకం ఏపీపీ–79రకం పసుపు సాగుచేసి జిల్లాలోనే దిగుబడిలో టాప్ వన్‌లో నిలిచారని తెలిపారు. ఆయన సోదరుడు వెంకటరెడ్డి అదేరకం ఏపీపీ–48రకం పసుపు సాగుచేసి అధిగమించే ప్రయత్నంలో ఉన్నాడని వివరించారు. ఇలాంటి ఆసక్తి గల రైతుల నుంచి ఇతర రైతులు నేర్చుకోవల్సిన పద్ధతులు చాలా ఉన్నాయన్నారు. పసుపు పంట సాధారణంగా తొమ్మిదినెలల కాలంలో చేతికొస్తుంది. అయితే ఈ రకం సాగు కేవలం ఏడు నెలలకే చేతికందుతుందని వివరించారు. అంతే కాకుండా దుంపకుళ్లుతో పాటు ఆకుమచ్చ తెగులును తట్టుకునే శక్తి ఉంటుందన్నారు. అయితే పంట కోత దశకు వచ్చే కాలానికి వ్యవసాయ పనులు ఉండకపోవడంతో కూలీల కొరత ధిగమించవచ్చన్నారు. దీంతో స్వల్పకాలిక పంటలను అదనంగా వేసుకోవచ్చని సూచించారు. ఎకరానికి సుమారు 200 నుంచి 225 క్వింటాల పచ్చి ప సుపు దిగబడి వస్తుందన్నారు. రైతులు ఇది గమనించి సాగు చేసుకోవాలని ఆమె కోరారు. అనంతరం స్పైసెస్ డీడీ లింగప్ప మాట్లాడారు. రైతు వల్లూరి కృష్ణారెడ్డి, శాస్త్రవేత్తలు రాములమ్మ, చైతన్య, కిషోర్, సునీల్. ఉద్యానవన శాఖాధికారులు సీహెచ్. రికేష్, రమేష్, సుహాసిని, గోపాల్‌రెడ్డి, చిన్నయ్యరెడ్డి, ఉప్పల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పై పాటుగా డీఏపీ వేయొద్దు



పొలం దున్నుతున్న రైతు

చెన్నారావుపేట(నర్సంపేట): రైతులు పంటలను సాగు చేసే సమయంలో డీఏపీ ఎరువులను మొక్కలకు పై పాటుగా వేయకూడదని వ్యవసాయ విస్తరణ అధికారి చెలికాని రాజు (9553828135) సూచించారు. పై పాటుగా ఎరువులను వేసిన మొక్కలకు ఎలాంటి పోషకాలు అందవని చెప్పారు. అదనపు ఖర్చు పెరుగుతుంది అన్నారు. డీఏపీని కేవలం దుక్కిలో వేసుకొని దున్నుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. డీఏపీలో డై అమ్మోనియా, పాస్పేట్ ఉంటుంది. అందుచేత అది దుక్కిలో మాత్రమే కలిసిపోతుంది. డీఏపీని పై పాటుగా వేస్తే దానిలోని పాస్పరస్ మొక్క వేర్లకు అందక వ్యర్థమవుతుంది.పాస్పరస్ మొక్క వేర్లకు అందుతేనే అవి దృఢంగా పెరుగుతాయి.మొక్క వేరుకు అందేలా గుంతలు తీసి అందులో డీఏపీ వేసి మట్టి కలపాలి మోతాదుకు మించి డీఏపీని వాడటం వలన మొక్కలకు అందే సూక్ష్మ పోషకాలైన జింక్, మెగ్నిషియం, సల్ఫర్,క్యాల్షియం అందకుండా చేస్తుంది. డీఏపీ మొక్కలకు అందేందుకు 30–35 రోజుల సమయం పడుతుంది. డీఏపీని ప్రతీ పంటకు దుక్కిలో వేసుకోని కలియదున్నాలి. దీంతో పూర్తిగా మట్టిలో కలిసి పోయి మొక్కల వేర్లకు పోషకాలను అందిస్తుంది.

భవిష్యం



మేషం: పనుల్లో ఆటంకాలు. వృథా ఖర్చులు. దూరప్రయాణాలు. కొన్ని సమస్యలు చికాకు పరుస్తాయి. బంధువిరోధాలు. వృత్తి, వ్యాపారాలలో నిరాశానిస్పృహలు.

వృషభం: మిత్రులు, బంధువులు ఒత్తిడులు పెంచుతారు. ఆకస్మిక ప్రయాణాలు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో నిరుత్సాహమే.

మిథునం: సంఘంలో విశేష ఆదరణ. యత్నకార్యసిద్ధి. ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. ప్రతిభ వెలుగులోకి వస్తుంది. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల మార్పులు.

కర్కాటకం: ముఖ్యమైన కార్యక్రమాలలో అవాంతరాలు. ఆదాయానికి మించిన ఖర్చులు. బాధ్యతలు పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాలు నత్తనడకనే సాగుతాయి.

సింహం: ప్రత్యర్థులు మిత్రులుగా మారతారు. పనులు సకాలంలో పూర్తి చేస్తారు. దైవ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహవంతంగా ఉంటుంది.

కన్య: రుణాలు చేస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో ఆటంకాలు. సోదరుల కలయిక. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు ఎదుర్కొంటారు.

తుల: ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. పాతబాకీలు వసూలవుతాయి. మీ సత్తా చాటుకుంటారు. వస్తులాభాలు. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

వృశ్చికం: కొన్ని సమస్యలు పరిష్కారం. శుభవార్తలు. ఉద్యోగయత్నాలు కలసివస్తాయి. సభలు, సమావేశాలలో పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో నూతనోత్సాహం.

ధనుస్సు: పనులు కాస్త మందగిస్తాయి. అనారోగ్యం. కుటుంబసభ్యులతో విభేదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. వ్యాపార, ఉద్యోగాలలో చిక్కులు.

మకరం: దూరప్రయాణాలు. ఇంటాబయటా చికాకులు ఎదుర్కొంటారు. బంధువుల నుంచి ఒత్తిడులు. ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో గందరగోళంగా ఉంటుంది.

కుంభం: ప్రముఖుల నుంచి శుభవార్తలు. వాహనయోగం. అప్రయత్న కార్యసిద్ధి. ఇంటర్వ్యూలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో ముందడుగు వేస్తారు.

మీనం: యత్నకార్యసిద్ధి. చిన్ననాటి మిత్రుల కలయిక. విందువినోదాలు. నూతన విద్యావకాశాలు. ఆహ్వానాలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

– సింహంభట్ల సుబ్బారావు

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ నికోబార్ దీవుల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. జమ్మూ–కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్‌లలో చిరు జల్లులు/మంచు కురవచ్చు. కేరళ తీరం, అరుణాచల్‌ప్రదేశ్‌లలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. పంజాబ్, హర్యానా, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బిహార్‌లలో దట్టమైన పొగమంచు ఆవరించవచ్చు. ఉత్తరప్రదేశ్ ఉత్తరం, బిహార్‌లలో చల్లటి వాతావరణం నెలకొని ఉంటుంది.

వరంగల్ వాతావరణం

గరిష్టం కనిష్టం

30.2°/16.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	20.3	05.0
కోల్‌కతా	21.4	12.6
బెంగళూరు	28.3	17.0
ముంబై	30.5	16.4
చెన్నై	30.0	22.0

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
కడప	32.2/18.5	నిజామాబాద్	30.0/14.9
ఒంగోలు	31.9/22.2	కరీంనగర్	29.6/12.5
అనంతపురం	31.8/17.1	కాకినాడ	29.4/20.0
కర్నూలు	31.5/19.7	హైదరాబాద్	29.3/16.9
మహబూబ్‌నగర్	31.3/18.9	రంగారెడ్డి	29.3/16.9
నెల్లూరు	31.1/22.8	నల్లగొండ	29.3/15.0
చిత్తూరు	31.1/19.3	ఆదిలాబాద్	28.9/07.0
తిరుపతి	31.1/19.3	విశాఖపట్నం	28.8/21.5
మెదక్	31.1/12.0	ఏలూరు	28.8/19.4
విజయవాడ	31.0/19.0	రాజమండ్రి	28.8/19.4
ఖమ్మం	30.6/14.2	తాడేపల్లిగూడెం	28.8/19.4
వరంగల్	30.2/18.0	శ్రీకాకుళం	28.0/16.0
గుంటూరు	30.2/16.0	విజయనగరం	28.0/16.0

బుల్లితెర

W

SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 గుడ్ మార్నింగ్
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 న్యూస్ ఫీచర్
ఉ.09.00 రీజనల్ న్యూస్
ఉ.09.30 మ్యాగజీన్ స్టోరీ
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.10.30 న్యూస్ ఫీచర్
మ.02.30 హెల్త్ ప్లస్
సా.04.30 హ్యాపీ జర్నీ
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 ఉర్దూ న్యూస్
రా.07.30 పొలిటికల్ కారిడార్
రా.08.00 ఫోర్త్ ఎస్టేట్
రా.09.00 న్యూస్ 360
రా.09.30 మ్యాగజీన్ స్టోరీ
రా.10.30 స్క్రీన్‌ప్లే
రా.11.30 న్యూస్ ఫీచర్


టీవీలో ఈరోజు సినిమాలు



జెమిని మూవీస్
ఉ.07.00 పూజ
ఉ.09.30 దేవుడు చేసిన మనుషులు
మ.12.00 గజిని
మ.03.00 రగడ
సా.06.00 ఇష్క్



మూవీస్ నౌ
ఉ.06.30 గాడ్జిల్లా
ఉ.08.45 స్నేక్స్ ఆన్ ఏ ప్లేన్
ఉ.10.35 ద జంగిల్ బుక్
మ.03.05 రష్ అవర్ 3
రా.07.15 మినియన్స్




హెచ్‌బీవో
ఉ.04.16 రాక్ ఆఫ్ ఏజెస్
ఉ.07.01 ఇన్‌సెప్షన్
ఉ.09.21 ద టక్సెడో
మ.03.58 ద అకౌంటెంట్
రా.10.55 ద హ్యాంగోవర్-2



స్టార్ మూవీస్
ఉ.06.01 జింగిల్ ఆల్ ద వే
ఉ.07.25 టాయ్ యమ్ గూంగ్ 2
మ.12.13 స్పీడ్
సా.06.51 టాయ్ స్టోరీ 3
రా.09.00 ద వోల్వరిన్



మా మూవీస్
ఉ.07.00 143- ఐ మిస్ యు
ఉ.09.00 బెండు అప్పారావ్
మ.12.00 ద్రోణాచార్యస
మ.03.00 రాజుగారి గది
సా.06.00 ఎవడు



జీ సినిమా
ఉ.04.45 తేరీ మేరీ కహానీ
ఉ.08.04 సిర్ఫ్ తుమ్
ఉ.10.57 ఖతర్నాక్ ఇష్క్
సా.05.11 రివాల్వర్ రాజా
రా.08.00 హాలిడే

ప్రమాదపు అంచున..



భూపాలపల్లి అర్బన్: టేకుమట్ల మండల కేంద్రం నుంచి సుబ్బక్కపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పంట పొలాల్లో విద్యుత్ స్తంభం ప్రమాదపు అంచున ఉన్నది. దీనిని మరమ్మతు చేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పంపినవారు. కాటం లక్ష్మణ్

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా నంబర్ : 9533728871

లోకల్ వాయిస్

సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి



రేగొండ: మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారిలో మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు డివైడర్లను ఏర్పాటు చేసి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయాలి. కాళేశ్వరం నుంచి వచ్చే లారీలు పోటీ పడి వేగంగా వస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడం వల్ల ప్రమాదాలు తగ్గుతాయి

–గుర్రాల సుమన్‌రెడ్డి, రేగొండ

రబీపైనే రైతన్న ఆశ

- యాసంగి పనుల్లో బిజీ.. బిజీగా అన్నదాత
- మండల వ్యాప్తంగా ముమ్మరంగా వరినాట్లు..



వరినాట్లు వేస్తున్న మహిళలు



సిద్ధంగా ఉన్న నారు..

మొగుళ్లపల్లి:

ఎన్నో ఆశలు, ఏదో మూల భయం వెరసి రబీ సాగుకు రైతన్న హలం పట్టాడు. ఖరీఫ్ మిగిల్చిన కన్నీటి నష్టాలను యాసంగిలో పూడ్చుకుందామని నాట్లకు సిద్ధమయ్యాడు. రబీ సాగులో ప్రధానంగా వరి పంటలను అధికంగా సాగు చేస్తున్నారు. మొక్కజొన్న ఇతర పంటలను ఇప్పటికే సాగు చేశారు. ఖరీఫ్ వరి కోతలు ముగిసిన నేపథ్యంలో యాసంగి వరి సాగులో రైతన్న బిజీబిజీగా ఉన్నాడు.

దాదాపు 5 వేల ఎకరాల్లో రబీ సాగు..

మండలంలో రబీ సీజన్‌లో మూడు వేల ఎకరాల్లో వరి, రెండు వేల ఎకరాల్లో మిగతా పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం మండలంలోని మొగుళ్లపల్లి, రంగాపురం, వేములపల్లి, మొట్లపల్లి, ఇస్సిపేట, తదితర గ్రామాల్లో రైతులు, కూలీలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. గత ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలు చీడ పీడలతో రైతులకు ఖరీఫ్ కలిసిరాలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చాలనే పట్టుదలతో రబీపైనే ఆశలు పెంచుకున్నారు. ముఖ్యంగా బోర్లు, బావులు చెరువుల కింది రైతులు వరినాట్లు వేసేందుకు దుక్కులను దున్ని కల్టివేటర్ కొట్టడం పనుల్లో నిమగ్నమయ్యారు. అలాగే నీటి పారుదల సౌకర్యం లేని రైతులు ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో అకాల వర్షాలతో పాటు వరికి సుడిదోమ అశించి దిగుబడులు తగ్గడమే కాకుండా మద్దతు కూడా రాకపోవడంతో అప్పులు రైతుల నడ్డి విరిశాయి. దీంతో యాసింగి సీజన్‌లోనైనా పంట దిగుబడి బాగా వచ్చి అప్పులు తీర్చుకోవాలని రైతులు ఆశపడుతున్నారు.

పెట్టుబడి రాలేదు..



ఖరీఫ్‌లో వరిపంట వేసినా అష్టకష్టాలు పడి పంటకు నీటి తడులు అందించా. పంట చేతికి వచ్చే సమయానికి దోమకాటు విపరీతంగా వచ్చింది. మందులు పిచికారీ చేసినా ఫలితం లేదు. పెట్టుబడి పెట్టిన డబ్బులు కూడా రాలేదు.

– అరికంతపు అన్నారెడ్డి, రైతు, మొగుళ్లపల్లి

రబీ పైనే ఆశలు..



ఖరీఫ్‌లో పంట చేతికి వచ్చే సమయానికి దోమపోటుతో దిగుబడి బాగా తగ్గి పోయింది. ఖరీఫ్‌లో వచ్చిన నష్టాన్ని పూడ్చుకునేందుకు రబీలో పంటలు వేసేందుకు దుక్కులు దున్ని నాట్లు వేయడానికి సిద్ధంగా ఉన్నాం.

–శనిగరపు అశోక్, రైతు, అంకుషాపురం

హామీల అమలులో చిత్తశుద్ధి లేదు

టీపీసీసీ కార్యదర్శి గండ్ర జ్యోతి

రేగొండ: టీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలులో చిత్తశుద్ధి లేదని టీపీసీసీ కార్యదర్శి గండ్ర జ్యోతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆమె కాంగ్రెస్ పార్టీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు హింగె మహేందర్, ఎంపీటీసీ సభ్యుడు పట్టెం శంకర్, మండల ఉపాధ్యక్షుడు కొలెపాక భిక్షపతి, గంపల లింగయ్య, దేవేందర్, సామల పాపిరెడ్డి, కొంరయ్య, రహీం, ముప్ప బాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద జయంతిని జయప్రదం చేయాలి

చిట్యాల: జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 12 వరకు ప్రతి మండలంలో నిర్వహించనున్న స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ప్రజలు జయప్రదం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పాలెపు రాంబాబు కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు, విద్యావేత్తలు, యువత ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయాలని రాంబాబు పేర్కొన్నారు.

రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం

ప్రభుత్వ మాజీ చీఫ్‌విప్ గండ్ర



మాట్లాడుతున్న గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా దగా చేస్తోందని కాంగ్రెస్‌పార్టీ మాజీ చీఫ్‌విప్ గండ్ర వెంకటరమణారెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నైన్‌పాక, వరుకోల్‌పల్లి, కొత్తపల్లి గ్రామాలలో మండల అధ్యక్షుడు గొర్రె సాగర్ ఆధ్వర్యంలో గురువారం 'మన ఊరికి మన గండ్ర రమణన్న' కార్యక్రమం నిర్వహించారు. అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాగర్, పర్లపల్లి భద్రయ్య, చిలువేరు సంతోష్, సుదర్శన్, సర్వేశం, కుమార్, సతీష్, ప్రభాకర్, అశోక్, సాంబయ్య, అయిలయ్య, దేవేందర్‌రెడ్డి, రాంరెడ్డి, సంతోష్‌రెడ్డి, రవి, తిరుపతి, సంజీవ్, మహేందర్, రఘు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులను గుర్తించాలి

- జిల్లా ఉప వైద్యాధికారి మధుసూదన్

చిట్యాల:

ప్రజలకు సోకుతున్న అసంక్రమిత వ్యాధులను వైద్య సిబ్బంది గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ చల్లా మధుసూదన్ అన్నారు. గురువారం చిట్యాల గ్రామపంచాయతీ ఆవరణలో సంపూర్ణ స్వస్థత కార్యక్రమంలో భాగంగా అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ పుల్లూరి రమాదేవి ప్రారంభించారు. హెల్త్ ఎడ్యూకేటర్ వెంకటేశ్వరరాజు, సూపర్‌వైజర్లు వెంకన్న, బేబిరాణి, హెల్త్ అసిస్టెంట్లు పుల్ల సుమలత, సాంబయ్య, ఆశకార్యకర్తలు విజయ, క్రిష్ణవేణి, విశాల పాల్గొన్నారు.

న్యూస్‌బాక్స్

డీఎస్సీ నిబంధనలు సవరించాలి

భూపాలపల్లి అర్బన్: డీఎస్సీ అర్హతలో పలు నిబంధనలు సవరించాలని కోరుతు పీడీఎస్‌యూ నాయకులు గురువారం జిల్లా ఇన్‌చార్జీ విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. డిగ్రీలో 45 శాతం మార్కులు ఉండాలనే నిబంధన సరికాదన్నారు. కార్యక్రమంలోనాయకులు కిరణ్, ప్రవీణ్, శంకర్, మహేందర్, అర్జున్ పాల్గొన్నారు.

ముదిరాజ్ కులస్తులను ప్రభుత్వం ఆదుకోవాలి

రేగొండ: అర్థికంగా వెనుబడిన ముదిరాజ్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షుడు మారబోయిన ధనుంజయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలో ముదిరాజ్ కులాల సమస్యలపై సమిక్ష సమావేశం నిర్వహించారు. ముదిరాజ్‌ల హక్కుల సాధనకై ఈ నెల 7న చెన్నాపురం గ్రామంలో రాజకీయ అవగాహన సదస్సును డాక్టర్ కొత్తగట్టు శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. సదస్సుకు ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సెల్ టవర్ ఎక్కిన టీఆర్‌ఎస్ నాయకుడు

పార్టీ నుంచి సస్పెండ్ చేశారని మనస్తాపం

నెక్కొండ(నర్సంపేట): తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో ఓ టీఆర్‌ఎస్ నాయకుడు సెల్ టవర్ ఎక్కిన సంఘటన నెక్కొండలో గురువారం జరిగింది. బాధితుడి కథనం ప్రకారం.. టీఆర్‌ఎస్ నాయకుడు బండి శివకుమార్ నెక్కొండలో న్యూఇయర్ వేడుకల్లో భాగంగా టీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర సివిల్ సప్లయ్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి ఫొటోతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. అయితే అందులో నెక్కొండ ఎంపీపీ గటిక అజయ్‌కుమార్ ఫొటో పెట్టకపోవడంతో కావాలనే టీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గుంటుక సోమయ్యపై ఒత్తిడి తీసుకువచ్చి తనను సస్పెండ్ చేయించారని శివకుమార్ చెప్పాడు. ఉద్యమంలో చురుకుగా పాల్గొన్న వారికి పార్టీలో సముచిత స్థానం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గురువారం నెక్కొండ మండలంలోని పెద్దకొర్పోలు గ్రామంలో పల్లెప్రగతి కార్యక్రమానికి వచ్చిన పెద్ది సుదర్శన్‌రెడ్డి విషయం తెలుసుకుని సంఘటన స్థలానికి వెళ్లారు. జిల్లా కోఆప్షన్ సభ్యుడు షేక్ అబ్దుల్ నభిని టవర్‌పైకి పంపించి నచ్చచెప్పడంతో శివకుమార్‌ను టవర్ దిగాడు. పార్టీలో ప్రాధాన్యం కల్పిస్తామని సుదర్శన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమనిగింది.



సెల్ టవర్ ఎక్కిన బండి శివకుమార్

ఆగ్రోస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తా

చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు

హన్మకొండ: ఆగ్రోస్‌కు పూర్వ వైభవం తీసుకువస్తానని ఆ సంస్థ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు అన్నారు. గు రువారం హన్మకొండ సుబేదారిలోని కృషి భవన్‌లో ఆగ్రోస్ రైతు సేవా కేంద్ర మిత్రల రాష్ట్ర స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రం లోని వివిధ జిల్లాల నుంచి ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ముందుగా ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల నిర్వాహకుల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం లింగంపల్లి కిషన్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఇస్తున్న క్రమంలో ఆగ్రోస్ సేవలు రైతులకు వినియోగపడేలా చర్యలు తీసుకుంటున్నారన్నారు. తాను చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి న నాటి నుంచి ఆగ్రోస్ ద్వారా రైతులకు సేవలు అందించడంపై దృష్టి సారించా మన్నారు. ఆగ్రోస్‌ను బలోపేతం చేయడంతో పాటు రైతులకు వ్యవసాయ యంత్రాలను, ఆధునిక పనిముట్లను రైతులకు అందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపా రు. ఆగ్రోస్ ఆర్థిక పరిపుష్టికి ఆగ్రోస్ కర్షక్ పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 6 పెట్రోల్ బంక్‌లు మంజూరయ్యాయన్నారు. ఒకటి వరంగల్‌లోని ములుగు రోడ్డులో ప్రా ంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సమీపంలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని పాత 9 జిల్లాల కేంద్రాల్లో ఆగ్రోస్ ఎగ్జిబిషన్‌లు ఏర్పా టు చేయనున్నట్లు తెలిపారు. ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల రాష్ట్ర ఇన్‌చార్జి విద్యాకుమారి మాట్లాడుతూ ఆగ్రోస్ కేంద్రాలద్వారా గతంలో ఎరువులతోపాటు క్రిమిసంహారక మందులు,వ్యవసాయ పనిముట్లు రైతులకు సరఫరా చేసే వారమన్నారు. మధ్యలో వీటిని నిలిపివేశారని, తిరిగి పునరుద్ధరించేందుకు ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు కృషి చేస్తున్నారన్నా రు. జిల్లా వ్యవసాయ అధికారి ఉషాదయాల్ మాట్లాడు తూ ఆగ్రోస్‌కు ప్రస్తుతం పథకాలు తగ్గాయన్నారు. వ్యవసాయ పట్టభద్రులు, వ్యవసాయ డిప్లొమా చేసిన వారికే ఎరువుల షాపు ఏర్పాటుకు లైసెన్స్ ఇవ్వాలనే నిబంధనను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందన్నారు. సమావేశంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమ అధికారి సునిత,ఆగ్రోస్ రైతు సేవా మిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.శ్రీరాంశర్మ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆగ్రోస్ చైర్మన్ కిషన్‌రావు

ఈసారైనా సజావుగా సాగేనా?

రేపు జెడ్పీ సర్వసభ్య సమావేశం

హన్మకొండ: జెడ్పీ పాలక మండలి, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో ప్రతీ సారి జెడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా పడుతూ వస్తోంది. దీంతో ప్రజా సమస్యలు చర్చకు రావడం లేదు. కోరం లేక, ఇతర కారణాలతో కొన్ని సమావేశాలు వాయిదా పడుతుండగా, జరిగిన సమావేశాలు మొక్కుబడిగా ముగుస్తున్నాయి. జెడ్పీలో నిర్వహించే ప్రతీ సర్వసభ్య సమావేశం వాయిదా పడుతుండటంతో ఈ నెల 6న జరగాల్సిన సర్వసభ్య సమావేశం సజావుగా సాగుతుందా.. లేదా? అనే సందేహం పలువురిలో వ్యక్తమవుతోంది. సమావేశానికి హాజరుకావాల్సిన డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి పాల్గొనకుంటే సమావేశం వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏడాదికి 12 సర్వసభ్య సమావేశాలు జరుగాల్సి ఉండగా కేవలం మూడు సమావేశాలు మాత్రమే జరుగుతున్నాయి. కోరం లేకనే ఎక్కువ సమావేశాలు వాయిదా పడుతున్నాయి. అన్ని శాఖలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశం మూడు, నాలుగు శాఖలకే పరిమితమవుతుంది. 34 అంశాలపై చర్చించాల్సి ఉండగా నాలుగైదు అంశాల పైనే చర్చ జరుగుతుంది. 2018 సంవత్సరంలో మొదటి సమావేశం ఈ నెల 6న నిర్వహించనున్నారు. ఈ సమావేశమైనా వాయిదా పడకుండా సజావుగా సాగుతుందో లేదో చూడాలి మరి.



జెడ్పీ కార్యాలయం

రూ. పది లక్షల పరిహారం చెల్లించాలి

- అన్నారం బ్యారేజీ పనులను అడ్డుకున్న రైతులు
- ప్రాజెక్టు క్యాంప్ కార్యాలయం ఎదుట ఆందోళన

కాళేశ్వరం(మంథని): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న అన్నారం బ్యారేజీ భూ నిర్వాసితులు గురువారం ప్రాజెక్టు పనులు అడ్డుకున్నారు. రూ. పది లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిర్వాసితులకు మొదటి దశలో ప్రభుత్వం ఎకరానికి రూ. 5. 50 లక్షల పరిహారం మాత్రమే చెల్లించిందని రూ.10.50 లక్షలు ఇవ్వాలని క్యాంప్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. నిర్వాసితులు మాట్లాడుతూ మొదట బ్యారేజీకి ఎకరానికి రూ.5.50 లక్షలకే భూములు ఇచ్చి మోస పోయామని వాపోయారు. గుండ్రాత్‌పల్లి రైతులకు మాత్రం ప్రభుత్వం రూ.10.50 లక్షలు పరిహారం చెల్లించారని ఆరోపించారు. ఇరిగేషన్, రెవెన్యూ, బ్యారేజీ అధికారులు తమకు అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మహదేవపూర్ సీఐ రమేష్, కాళేశ్వరం ఎస్సై శ్రీనివాస్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులకు నచ్చ చెప్పినా వినలేదు. మధ్యాహ్నం వరకు క్యాంప్ కార్యాలయం ఎదుటే బీష్మించుకొని కూర్చున్నారు. కాటారం డీఎస్పీ కేఆర్‌కే ప్రసాదరావు చేరుకొని సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.


అన్నారం బ్యారేజీ పనులు అడ్డుకున్న రైతులు

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


గాయాలు చూపుతున్న బంధువులు

మహాముత్తారం: మండలంలోని వజినేపల్లి గ్రామానికి చెందిన గడ్డం సువర్ణ గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. బంధువుల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన లింగయ్య కూతురు సువర్ణకు మహాముత్తారం మండలం వజినేపల్లి గ్రామానికి చెందిన గడ్డం భాస్కర్‌తో పద్నేళ్ల క్రితం వివాహమైంది. కొద్దిరోజులు వారి సంసారం చక్కగా సాగినప్పటికీ ఆ తర్వాత భార్యపై అనుమానం పెంచుకున్న భర్త ఇబ్బందులకు గురిచేయగా గతంలో తల్లిదండ్రుల ఇంటికి వెళ్లిపోయింది. దీంతో సువర్ణ తల్లిదండ్రులు ములుగు పీఎస్‌లో ఫిర్యాదు చేయగా దంపతులకు కౌన్సెలింగ్ నిర్వహించి అత్తగారింటికి పంపించారు. ఈ క్రమంలోనే భార్యపై అనుమానం పెంచుకున్న భర్త, అత్తమామలు తమ కూతురిని చిత్రహింసలకు గురిచేసి చంపి పురుగుల మందు పోసి ఆత్మహత్య చేసుకున్నట్లు కథ అల్లారని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మహాముత్తారం ఎస్సైని వివరణ కోరగా మృతురాలి తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన అనంతరం పూర్తి వివరాలు తెలియజేస్తామని తెలిపారు.

వివాహిత ఆత్మహత్య

మహాముత్తారం(మంథని): మండలంలోని స్తంభంపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని హుజూర్‌నగర్‌కు చెందిన గడ్డం సువర్ణ (30) గురువారం ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబసభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి భర్త, పాప, బాబు ఉన్నారు. సువర్ణ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై మారెపల్లి రాజు తెలిపారు.

సమాజ సేవకులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది


ప్రశంస పత్రంతో అన్నాజాన్, డీఆర్వో

భూపాలపల్లి అర్బన్: సమాజసేవ చేసే వారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని డీఆర్వో మోహన్ లాల్ అన్నారు. గణపురం మండలంలోని హోమ్ ఆఫ్ లవ్ సంస్థను స్థాపించి అనాథలకు సేవ చేస్తున్నందుకు క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 22న హైదరాబాద్‌లో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ క్రిస్టియన్ ఫర్‌దా ఇయర్ 2017 అవార్డు అందజేసినట్లు డీఆర్వో పేర్కొన్నారు. హోమ్ ఆఫ్‌లవ్ సంస్థ నిర్వాహకురాలు సిస్టర్ అన్నాజాన్ గురువారం డీఆర్వో మోహన్‌లాల్ అభినందించారు. సమాజ సేవ చేసే వారిని తప్పకుండా ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. ప్రభుత్వం ప్రశంస పత్రంతో పాటు రూ. 50 వేలు నగదు బహుమతి ఇవ్వడం అభినందనీయమన్నారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు వారి వెంట ఉన్నారు.

కాల్వ మరమ్మతులకు సిద్ధమైన రైతులు

- ఐబీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన
- అక్రమ మోటార్లను తొలగించాలని తహసీల్దార్‌కు వినతి

గోవిందరావుపేట: రబీ ముంచుకొస్తున్నా ఐబీ అధికారులు పట్టించుకోకపోవడంతో నర్సింహుల కాల్వకు స్వచ్ఛందంగా మరమ్మతులు చేపట్టేందుకు రైతులు ముందుకొచ్చారు. నర్సింహుల–1, 2 కాల్వలకు పడిన గండ్లు, పూడిక తీత పనులు చేపట్టడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తుండడంతో రైతులు ఈ నిర్ణయం తీసుకున్నారు. 5వ తేదీ నుంచి నీటి విడుదల ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులు ఈ మేరకు తీర్మానించారు. ఎకరాకు రూ. రెండు వందల చొప్పున వసూలు చేసి పనులు ప్రారంభించాలని నిశ్చయించుకున్నారు. బుస్సాపూర్ రైతులు మోటార్ల ద్వారా అక్రమంగా సాగునీటిని తరలిస్తుండడంతో చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న చల్వాయి రైతులు

అక్రమసాగు చేస్తే చర్య తీసుకుంటాం

సాగునీటిని అక్రమంగా వినియోగిస్తే చర్య తీసుకుంటామని తహసీల్దార్ రవిరాజ్‌కుమార్‌రావు హెచ్చరించారు. రైతుల వినతితో స్పందించిన ఆయన వెంటనే బుస్సాపురం సర్పంచ్ పాలెం శోభారాణికి ఫోన్ చేసి అక్రమ సాగు విషయమై చాటింపు వేయాలని కోరారు. బుస్సాపూర్‌తో పాటు దుంపెల్లిగూడెంలో రైతులెవరైనా అక్రమంగా సాగు చేసే ప్రయత్నం చేస్తే నాట్లను ధ్వంసం చేయడంతో పాటు ఆయా రైతులపై చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఎస్‌ఎంఈయూ పిట్ కార్యదర్శుల నియామకం

కోల్‌బెల్ట్(భూపాలపల్లి): సింగరేణి మాదిగ ఉద్యోగుల సంఘం భూపాలపల్లి ఏరియాలోని పలు గనులకు పిట్ కార్యదర్శులను నియమించినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడెపాక సంజీవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేటీకే 1, 6, వర్క్‌షాప్, సెక్యూరిటీ విభాగానికి సంగి రవి, శంకర్, మధునయ్య, లంక వెంకటి, మేరుపాటి మొగిలిలను నియమించినట్లు వెల్లడించారు.

చివరి ఆయకట్టుకూ సాగు నీరందిస్తాం

ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ

వెంకటాపురం(కె): వెంకటాపురం, వాజేడు మండలాల్లో చివరి ఆయకట్టు వరకూ సాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రాజెక్టుల నిర్మాణాలు చేపట్టినట్లు ఖమ్మం ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలకేంద్రంలోని ఆర్ అండ్‌బీ అతిథిగృహంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ పంటల సాగుకు ఎకరాకు రూ.4 వేలు ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వెంకటాపురం మండలం కేంద్రం నుంచి మరికాల మీదుగా ఎదుల్లపల్లి వాజేడు మండల కేంద్రం వరకు రూ.50 లక్షలతో రోడ్డు పనులు చేపట్టినట్లు తెలిపారు. ఖమ్మం డీసీఎమ్మెస్ చైర్మన్ యగ్గడి అంజయ్య, నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, డీసీసీబీ డైరెక్టర్ గుడపాటి శ్రీనివాసరావు, ఎంపీపీ ఎట్టి రూప్లీలక్ష్మిబాయి, మురళిబాబు, కాకర్లపూడి విక్రాంత్, గంపా రాంబాబు, వేల్పూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ

ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడిగా దేవేందర్‌నాయక్


దేవేందర్‌ను అభినందిస్తున్న జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు

భూపాలపల్లి అర్బన్: లంబాడి హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడిగా చిట్యాల మండలం భావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన అజ్మీరా దేవేందర్‌నాయక్‌ను నియమించినట్లు ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు భూక్య కోట్యానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా, మండల, గ్రామ కమిటీలను దేవేందర్ అధ్యక్షతలో ఎన్నుకోనున్నట్లు పేర్కొన్నారు.

కేటీపీపీలో ముమ్మరంగా మరమ్మతు పనులు

- పరిశీలించిన డైరెక్టర్ సచ్చిదానంద
- రెండు రోజుల్లో విద్యుత్ ఉత్పత్తి

గణపురం(భూపాలపల్లి): గణపురం మండలంలోని కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో 500, 600 మెగా వాట్ల తయారీ కేంద్రాల్లో మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ నెల 1 న 600 మెగా వాట్ల విద్యుత్ తయారీ ప్లాంటులోని బాయిలర్ ట్యూబ్ లీకేజీ కావడంతో ఉత్పత్తి నిలిపివేశారు. రెండు ప్లాంట్లలో పనులు జరుగుతుండడంతో విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా నిలిపివేశారు. మరమ్మతు పనులను వేగవంతంగా పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించేందుకు అధికారులు విరామం లేకుండా పనులు కొనసాగిస్తున్నారు. ఈ పనులను జెన్‌కో డైరెక్టర్ థర్మల్ సచ్చిదానందం, సీఈ మంగేష్ కుమార్ పరిశీలిస్తున్నారు. మరో రెండు రోజుల్లో మరమ్మతు పూర్తిచేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.


ప్రధాన ప్లాంటులో యంత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

జాతీయ రహదారికి మరమ్మతు

- ఆత్మకూరు నుంచి చల్వాయి వరకు పనులు
- రోలింగ్ చేయకుండా తూతూ మంత్రంగా బీటీ



జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ములుగు: మేడారం మహాజాతర ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభంకానున్నందున జాతీయ రహదారి 163పై సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని ఆత్మకూరు నుంచి గోవిందరావుపేట మండలం చల్వాయి వరకు సుమారు 40 కిలో మీటర్ల పరిధి మేర ఏర్పడిన గుంతల్లో బీటీ వేసి పూడ్చుతున్నారు. దీంతో పాటు నాణ్యత దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ పై పూతగా బీటీ వేస్తున్నారు. ఇంతకు ముందే చల్వాయి నుంచి పస్రా వరకు మరమ్మతు చేశారు. గత ఐదు రోజులు పనులు జరుగుతున్నాయి.

తూతూ మంత్రంగా..

వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పుకుంటున్నారు. అయితే వేలాది వచ్చే వాహనాల రాకపోకలను తట్టుకోవడానికి వీలుగా గుంతలను తవ్వి బీటీ నింపాల్సిన కాంట్రాక్టర్ అవేమీ పాటించకుండా రోడ్డుపై పూతగా బీటీని పరుస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా వేస్తున్న బీటీపై రోలింగ్ చేయకుండా కేవలం దిమ్మెలతో అంటీముట్టనట్లు సరిచేస్తున్నారు.

10 లోగా పూర్తిచేయాలి



మేడారం మ్యూజియంపై డీడీ, అసిస్టెంట్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు

- ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు
- గిరిజన మ్యూజియంపై అధికారులతో సమావేశం

ఏటూరునాగారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఒకేచోట నిలిపే గిరిజన మ్యూజియం పనులు ఈనెల 10లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం లోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో గురువారం గిరిజన మ్యూ జియం డిప్యూటీ డైరెక్టర్ డి. సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు రామకృష్ణ, శంకర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావుతో పీఓ సమావేశమయ్యారు. మేడారం జాతర లోపు మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన మ్యూజియం పైన కోయకులస్తులు నృత్యాల సమయంలో తలపై ఉపయోగించే కొమ్ములను సుమారు 12 ఫీట్ల ఎత్తులో అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యూజియంకు రంగును గిరిజనులు ఎక్కువగా ఇళ్లకు ఉపయోగించే పుట్టమన్ను కలర్, పేడ కలర్‌ను వేయాలన్నారు. చినుకుల ముగ్గులను మహిళలతోనే వేయించాలని సూచించారు. శ్రీ సమ్మక్క-సారలమ్మ గిరిజన మ్యూజియం అనే పేరును స్టీల్‌తో తయారు చేయించి బోర్డును అమర్చాలన్నారు. గోడకు అమర్చే షోకేజ్‌లు 20, ఫ్లోరింగ్‌పై అమర్చే బీరువాలు 17 తయారు చేసేందుకు ప్రత్యేక కార్పెంటర్‌ను పిలిపించి కొలతను తీయించినట్లు డీడీ సత్యనారాయణ పీఓకు వెల్లడించారు. మ్యూజియంలో అమర్చే వస్తువులను సేకరించేందుకు పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని పీఓ అన్నారు. లఘు చిత్రాల నమూనాలను హైదరాబాద్ నుంచి తెప్పించి వాటిని పరిశీలించిన తర్వాత ఎంపిక చేయడం జరుగుతుందని పీఓ అన్నారు. సేకరించిన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. పెసా జిల్లా కన్వీనర్ కొమురం ప్రభాకర్, ఆర్ఓఎఫ్ఆర్ ప్రభాకర్, ఫొటోగ్రాఫర్ రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక బస్తాల కట్టల పనులు షురూ

ఎస్ఎస్‌తాడ్వాయి: జంపన్నవాగులో ఇసుక కట్టల ఏర్పాట్ల పనులను ప్రారంభించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో నీటి లభ్యత కో సం నాలుగు చోట్ల శాశ్వత చెక్ డ్యాం నిర్మాణాల కోసం నిధులు కేటాయించా రు. కాని ఆ పనులు జాతర వరకు పూర్తయ్యే పరిస్థితి లేదనే ఉద్దేశంతోనే ఆ శాఖ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాల అడ్డుకట్టల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు.అందుకు స్పందించిన ప్రభుత్వం రూ కోటిపైగా నిధులు మంజూరు చేసింది. వాగులో మునిగి స్నానమాచరించే భక్తులకు నీటి లభ్యం కోసం జంపన్నవాగులో 12 చోట్ల ఇసుక బస్తాల అడ్డ కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నీటి నిల్వ తోపాటు ఇసుక బస్తాలపై నుంచి నీళ్లు సమాంతరంగా వెళ్లనున్నాయి.



జంపన్నవాగులో ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

జాతరలో జేబుదొంగలు..!



బాధితుడు వీరభద్రం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో జేబు దొంగల బెడద మొదలైంది. జాతరకు ముందుగానే మేడారంలో జేబు దొంగలు ప్రవేశించారు. ఇప్పటికే నాలుగైదుసార్లు భక్తుల జేబులను కొట్టేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా గురువారం ఓ భక్తుడి జేబులోని డబ్బులను కొట్టేసిన బాలికను భక్తులు పట్టుకున్నారు. అంతేగాకుండా ఖమ్మం జిల్లాకు చెందిన వీరభద్రం కుటుంబ సమేతంగా మేడారం వచ్చారు. సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో ఆయన ప్యాంట్ జేబులోని డబ్బులను కొట్టేశారు. తన జేబులో రెండు వేల నోట్లు రూ. 40 వేలకు పైగా ఉన్నాయని సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు తన డబ్బులు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశాడు. సీసీ కెమెరాల ద్వా రా దొంగలను కనుక్కొనేందుకు ఎండోమెంట్ కార్యాలయంలోని సీసీ పుటేజీలను బాధిత భక్తులు పరిశీలించారు. ఈ విషయంపై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.



తరలివచ్చి.. మొక్కులు తీర్చి..

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రాక ఊపందుకుంది. వనదేవతలను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు, ఒడిబియ్యం, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పుతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.



యాటతో మొక్కుతున్న భక్తులు



తల్లులకు ఎత్తు బంగారం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు



కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు



నృత్యం చేస్తున్న భక్తులు





బొమ్మలు, లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

మరుగున పడ్డ మరుగుదొడ్ల పనులు

మేడారంలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తు ల సౌకర్యార్థం 4వేల సెమీ పర్మనెంట్ , 1350 తాత్కాలిక, 60 పర్మనెంట్, 60 వీఐపీ టాయిలెట్లు జాతర జరిగే పరిసర ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు వందల సంఖ్యలో కూడా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. జాతర కోసం ఆధునిక మొబైల్ టాయిలెట్లను తెప్పించినా వాటిని వీఐపీ భక్తులకే అని పక్కన పెట్టారు. బేస్‌మెంట్ లెవల్ లోనే మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయి.

మరుగుదొడ్ల కోసం కడుతున్న బేస్‌మెంట్లు



నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు



గోదావరి జలాలు అందేనా?

మిషన్ భగీరథ పథకం కింద జాతర భక్తులకు గోదావరి జలాలను అందించేందుకు మేడారంలో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నారు. ట్యాంకు ద్వారా జాతరలోని నల్లాలకు పైపులైన్ కనెక్షన్ పనులు చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను బట్టి చూస్తే జాతర వరకు కూడా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. జాతరలో 50శాతం మేరకేనా గోదావరి జలాలను భక్తులు అందిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా పనులు వేగవంతం చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

మహాజాతర.. పనులు పౌతర

సమీపిస్తున్న మేడారం జాతర

- నేటికీ పూర్తికాని అభివృద్ధి పనులు
- పదిరోజులే డెడ్‌లైన్
- జాడలేని తాగునీటి పైపులైన్
- నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం
- జాతర భక్తులకు 'మిషన్ భగీరథ' నీళ్లు అనుమానమే
- వైద్య సేవలు అంతంతమాత్రమే..

మేడారం జాతర సమీపిస్తున్నా అధికారుల అలసత్వం, పాలకుల పట్టించుకోని తనంతో భక్తులకు ఇక్కట్లు తప్పేటట్లు లేవు. ఎప్పటిపనులు అప్పుడే చేయడం అలవాటు చేసుకున్న అధికారులు ఈ సారి జాతరకు కూడా పది రోజుల ముందు హడావుడి చేసి చేతులు దులుపుకునేలా ఉన్నారు. కొత్త రాష్ట్రం, కొత్త జిల్లా ఏర్పడినా జాతర లో శాశ్వత పనుల ఊసే లేదు. తాత్కాలిక పనులు చేయడం తోనే అధిక లాభాలున్నాయని పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు

-ఎస్ఎస్ తాడ్వాయి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మహాజాతర సమయం ఇంకా 25 రోజులే ఉంది. జాతర సమీపిస్తున్న తరుణంలో భక్తుల భక్తుల తాకిడి మేడారానికి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కానీ.. జాతర అభివృద్ధి పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. ఈనెల 15కల్లా పనులన్నింటినీ పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ పట్టుమని పది రోజుల కూడా లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కొత్త తాగునీటి పైపులైన్ నిర్మా ణం పనులు సైతం ప్రారంభించలేదు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హైదరాబాద్‌లో జాతర అభివృద్ధి పనులపై కొద్ది రోజుల క్రింత నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా జనవరి 15కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. అధికారుల తీరును పరిశీలిస్తే జాతర నాటికి కూడా పనులు సాగేలా కనిపిస్తున్నాయి.

ఆలయానికి రంగులు ఎప్పుడు..?



దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 2.60 కోట్ల రంగుల పనులు జరుగుతున్నాయి. వీటితో కల్యాణ కట్టల నిర్మాణం, క్యూలైన్లకు మరమ్మతు, సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పెయింటింగ్, లైటింగ్ తదితర ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలంటూ ఆదివాసీలు, టెండర్లు నిర్వహిస్తామంటూ దేవాదాయశాఖ అధికారులు తెలుపడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల కొలిక్కి వచ్చినప్పటికీ రంగుల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తడుకలు వేయడంతో క్యూలైన్ల బారీకేడ్లకు వేసిన రంగులు ఆరక భక్తుల చేతులకు అంటే అవకాశాలున్నాయి.

తాగునీటి పైపులైన్ పనులు



జాడలేని తాగునీటి పైపులైన్ పనులు

జాతరలో భక్తులకు తాగునీటి సౌకర్యం చాలా ప్రధానమైనది. తాగునీటి కోసం కాంట్రాక్టర్లు బోరుబావుల్లో మోటార్లు బిగించడం, జాతర పరిసరాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. బోరుమోటార్ల ద్వారా నల్లాలకు తాగునీటి సరఫరా చేయాలి. కొత్త పైపులైన్ నిర్మాణం పనుల కోసం అధికారులు హైదరాబాద్‌లో వారు చెప్పిన పైపుల కంపెనీలోనే పైపులకు కాంట్రాక్టర్లు ఆర్డర్ చేశారు. సంబంధిత అధి కారులు అక్కడికి వెళ్లి పైపులను పరిశీలించి వారి ఒకే అంటే కాంట్రాక్టర్లు తీసుకురావాలనే నిబంధనలు ఉన్నాయి. పైపులకు కాంట్రాక్టర్లకు ఆర్డర్ చేసి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

వైద్య సేవలు అంతంతమాత్రమే..



జాతరకు నెలరోజుల ముందు నుంచే దేవతలను దర్శించుకునేందుకు మేడారానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చిపోతున్నారు. కల్యాణ మండపం ఫస్ట్ ఫ్లోర్ భవన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వైద్యశాలను నేటికి ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు వైద్య సేవల కోసం ఆస్పత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.మూడు రోజుల క్రితం మేడారంలోని సబ్‌సెంటర్‌లో వైద్యశాల సేవలు ప్రారంభించినప్పటికీ గద్దెలకు కిలోమీటర్ల దూరం ఉండడంతో భక్తులకు సేవలకు ఏమాత్రం వినియోగంలోకి రావడం లేదు. భక్తుల సౌకర్యార్థం వైద్య సేవలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

క్యూలైన్లలోనే సాగుతున్న ఆర్టీసీ పనులు



దేశం నలుమూలల నుంచి జాతరకు రికార్డు స్థాయిలో 4,000 బస్సులు నడిపించాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఏర్పాట్లు మాత్రం కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది కోసం తడుకలతో తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల పనులు మాత్రం ఇంకా సాగదీస్తున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్ల గదుల ఏర్పాట్లు పనులు చేపట్టలేదు. పనులు ఊపందుకోలేదు.

'ఐనవోలు' ఏర్పాట్లు పూర్తి చేయాలి



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీ సునీత

ఐనవోలు(వర్ధన్నపేట): ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్నందున ఏర్పాట్లను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. స్నానాల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన అధునాతన షవర్లు, దుస్తులు మార్చుకునే గది, క్యూ ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, నూతనంగా ఉత్తర, దక్షిణ దిశల్లో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాలక వర్గం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతమయ్యే విధంగా చూడాలని కోరారు. వీరి వెంట ఆలయ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఈఓ సదానందం, సర్పంచ్ పల్లకొండ సురేష్, ఎంపీటీసీ బోళ్లపెల్లి మధు, దర్మకర్తలు తక్కళ్లపెల్లి చందర్‌రావు, యాకూబ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తకొండ జాతరకు స్పెషల్ బస్సులు

హుజూరాబాద్ డీఎం ధరంసింగ్



డీఎం ధరంసింగ్

భీమదేవరపల్లి(హుస్నాబాద్): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతర నేపథ్యంలో మూడు రోజుల పాటు 250 ప్రత్యేక ఆర్టీసీ బస్సు ట్రిప్పులను నడపనున్నట్లు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డీఎం ధరంసింగ్ వెల్లడించారు. మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు పలు వివరాలు తెలిపారు. జాతరలో ప్రధాన ఘ ట్టాలైన 14, 15, 16 తేదీల్లో హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, గోపాల్‌పూర్, జీల్గుల మీదుగా 250 బస్ ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ నుంచి కొత్తకొండకు పెద్దలకు రూ. 42, చిన్నలకు రూ. 21 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. మూడు రోజుల పాటు కొత్తకొండ, హుజూ రాబాద్ నుంచి ప్రతి అరగంటకోమారు ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఇందులో ఈఓ హరిప్రకాశ్‌రావు, టీఎంయూ అధ్యక్షులు పీఎ ల్.రావు, జనరల్ సెక్రటరీ ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల భద్రయ్య ఉన్నారు.

మిర్చి కార్మికుల ధర్నా

- బస్తాకు రూ.8 చెల్లించాలని డిమాండ్
- లేకుంటే మునీం, దానం, భిక్ష ఇవ్వాలని ఆందోళన
- ఆగ్రహం వ్యక్తం చేసిన మార్కెట్ చైర్మన్, కార్యదర్శి



మిర్చి యార్డు ఎదుట ఆందోళన చేస్తున్న కార్మికులు


చైర్మన్‌తో మాట్లాడడానికి వచ్చిన కార్మిక పెద్దలు

వరంగల్ సిటీ:

వరంగల్ వ్యవసాయ మార్కెట్లో గురువారం మిర్చి యార్డులో పనిచేసే కటింగ్, మార్కింగ్ కార్మికులు విచిత్ర ఆందోళనను నిర్వహించారు. కొద్ది రోజుల్లోనే మిర్చి సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో తాము రైతుల వద్ద నుంచి మునీం, దానం, భిక్ష పేరుతో మిర్చి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ విధానాన్ని నిలిపివేయద్దని నినాదాలు చేస్తూ మిర్చి యార్డు ఎదుట ఆందోళన చేశారు. దోచుకోనిస్తే పనిచేస్తాం..లేదంటే మాకు కూలి గిట్టదంటూ మాట్లాడుతుండడంతో మార్కెట్ చైర్మన్ కొంపెల్లి ధర్మరాజు, కార్యదర్శి నిర్మల ఆందోళన వద్దకు చేరుకోని వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛాంబర్‌కు వచ్చి మాట్లాడాలని అనవసరంగా ఆందోళన చేయవద్దని వారికి సూచించారు. దీంతో కార్మిక నాయకుడు మహేష్ ఆధ్వర్యంలో కొందరు కార్యాలయానికి చేరుకొని చైర్మన్, కార్యదర్శులతో మాట్లాడారు. ప్రస్తుతం బస్తాకు రూ.8 చెల్లించడం జరుగుతుందన్నారు. అగ్రిమెంట్ సమయం కాగానే గిట్టుబాటు కాకుంటే ఛాంబర్, రైతు సంఘం నాయకులు, అధికారులతో కలిసి జాయింట్ కలెక్టర్ సమక్షంలో కూలి రేట్లు పెంచడం జరుగుతుందని చైర్మన్, కార్యదర్శులు చెప్పారు. అప్పటి వరకు ఓపిక పట్టాలే తప్పా, ఇటువంటి అక్కరకు రాని దందాకు అనుమతి ఇవ్వాలని ఆందోళన చేయడం సరికాదని మందలించారు. ఇందుకు కార్మిక నాయకులు తమకు బస్తాకు రూ.4.80నే ఇస్తున్నారని, రూ.8 ఇవ్వడం లేదని, పైగా మిర్చి సీజన్లో అర్ధరాత్రి వరకు పని చేయడం జరుగుతుందని, ఇతర మార్కెట్లలో ఉన్న కూలి రేట్ల మాదిరిగా ధరలు పెంచాలని పేర్కొన్నారు. ఇందుకు చైర్మన్,కార్యదర్శిలు మాట్లాడుతూ బైలా నిబంధనల ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించడం జరుగుతుందని వివరించారు. డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయో మీ అడ్తిదారులను, కార్మిక మేస్త్రీలను నిలదీయాలని, ఒప్పందానికి సంబంధించిన ధరల పట్టికను వారికి అందచేశారు.

కొందరి ఉన్నతాధికారుల పాత్ర

కటింగ్, మార్కింగ్ కార్మికులు ఏ మాత్రం నిజాయితీలేని, పద్ధతి కానీ అడ్డగోలు దోపిడీకి అనుమతి ఇవ్వాలని ఆందోళన చేపట్టడంలో మార్కెట్‌కు సంబంధించిన ఓ ముగ్గురి ముఖ్య అధికారుల పాత్ర ఉన్నట్లు ఉద్యోగులు, కార్మిక నాయకుల మాటలను బట్టి తెలుస్తోంది. అంతే కాకుండా చైర్మన్, కార్యదర్శులను వారు హెచ్చరిస్తూ మార్కెట్లో ఎప్పటి నుంచో జరుగుతున్న ఈ దందాను అరికడితే మార్కెట్ నడవదని చైర్మన్, కార్యదర్శులు చెప్పారు. ఏది ఏమైనా అడుక్కోవడం పేరుతో అన్యాయంగా రైతుల పంట సరుకులను దోచుకోవడానికి అడ్డుకట్ట వేస్తే, ఇన్ని అడ్డంకులు ఎదురు కావడం విశేషం.

దూరవిద్య డిగ్రీ అర్హత పరీక్ష నోటిఫికేషన్

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలో దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న డిగ్రీ బీఏ, బీకాం, బీబీఎం, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు ఈనెల 4 నుంచి ప్రవేశ అర్హత పరీక్షకు నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తు ఫారాలను దూరవిద్య స్టడీ సెంటర్లలో లభిస్తాయని కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ సీహెచ్.దినేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. 28 వరకు అర్హత పరీక్ష ఉంటుందన్నారు.

ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమావేశాలు

కేయూ ముచ్చట్లు

- 6, 7వ తేదీల్లో కేయూలో నిర్వహణ
- విద్యారంగ సమస్యలపై చర్చ

కేయూ క్యాంపస్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) జాతీయ సమితి సమావేశాలు ఈనెల 6,7 తేదీల్లో కేయూలో నిర్వహించనున్నారు. సమావేశాలు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుంచి జాతీయ సమితి సభ్యులు హాజరుకానున్నారు. దేశంలోని ప్రధాన విశ్వవిద్యాలయలైన ఢిల్లీ, జవహర్‌లాల్, జామియా మిల్లియా ఇస్తామియా, పాండిచ్చేరి, కేరళ, కొచ్చిన్, ముంబాయి, ఐఐటీ ఖరగ్‌పూర్, ఢిల్లీ నిట్ లాంటి ప్రముఖ యూనివర్సిటీల నుంచి ఎన్నికైన విద్యార్థి నాయకులు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. 6న ఉదయం 11 గంటలకు కేయూలోని ఫిజిక్స్ విభాగం సెమినార్ హాల్‌లో ప్రారంభమయ్యే సమావేశాలకు వరంగల్‌కు చెందిన ఏఐఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు వలీఉల్లాఖాద్రి అధ్యక్షతవహిస్తారు. సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి విశ్వజిత్‌కుమార్, కేరళ మాజీ హోంశాఖ మంత్రి, మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి బినయ్ విశ్వవ్ ,ఏఐఎస్‌ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షుడు వరంగల్ జిల్లాకు చెందిన తక్కళ్లపెల్లి శ్రీనివాస్ రావు ప్రసంగిస్తారు.

తొలిసారిగా జాతీయ సమితి సమావేశాలు

ఏఐఎస్‌ఎఫ్ 1936 అగస్టు 12 ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలోని గంగా ప్రసాద్ మెమోరియల్ హాల్‌లో దేశమొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్‌నెహ్రూ అధ్యక్షతన జరిగింది. అలాగే జిన్నా, మౌలానా ఆజాద్, సరోజినీ నాయుడు, సీవి రామన్ సమక్షంలో ప్రేమ్‌నారాయణ, భార్గవ్ ప్రధాన కార్యదర్శిగా ఏఐఎస్‌ఎఫ్ స్థాపించబడింది. ఏఐఎస్‌ఎఫ్ స్థాపించబడిన నాటి నుంచి వివిధ ప్రాంతాల్లో జరిగిన జాతీయ స్థాయి సమావేశాలు వరంగల్‌లో తొలిసారి కావడం గమనార్హం.

విద్యారంగ సమస్యలపై చర్చించబోతున్నాం: వలీఉల్లాఖాద్రి


సయ్యద్ వలీఉల్లాఖాద్రి

కేయూలో రెండు రోజుల పాటు నిర్వహించబోయే ఏఐఎస్‌ఎఫ్ జాతీయ సమితి సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై సామాజిక సమస్యలపై చర్చించనున్నట్లు వల్లీఉల్లాఖాద్రి చెప్పారు. దేశంలో మోడీ సర్కార్ అవలంభిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలు తదితర అంశాలపై సమావేశాల్లో చర్చించడం జరుగుతుందని తెలిపారు.

కొనసాగుతున్న రైల్వే టోర్నమెంట్స్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్‌లో ఆల్ ఇండియా రైల్వే ఇంటర్ ఇనిస్టిట్యూట్ ఇన్విటేషన్ టోర్నమెంట్స్ డీఆర్‌ఎం ట్రోఫీలో గురువారం రాత్రి రైల్వే కార్మికులైన మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, ముంబాయి, చెన్నై రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు స్నూకర్స్, క్యారమ్స్ సింగిల్స్ ఆడారు. క్యారమ్స్ సింగిల్స్‌లో 20 జట్లు, స్నూకర్స్‌లో 11 మంది గెలుపొందారు. స్నూకర్స్ విజేతలు వీరే...

ఉబ్లి డివిజన్‌కు చెందిన సువర్తయ్యపై వరంగల్‌కు చెందిన దీరజ్, వరంగల్‌కు చెందిన కిషోర్‌పై ఉబ్లి డివిజన్‌కు చెందిన యాసిర్ గెలుపొందారు. డోర్నకల్‌కు చెందిన మాధవరావుపై వరంగల్‌కు చెందిన కులదీప్, వరంగల్‌కు చెందిన అమ్జద్ అలీపై ముంబాయికి చెందిన ప్రవీన్ సొస విజయం సాధించారు. వరంగల్‌కు చెందిన రంజిత్‌పై బెల్లంపెల్లికి చెందిన గోపి కుమార్, కాజీపేట రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్ పి.రాజుపై వరంగల్‌కు చెందిన డి.రోహిత్ గెలుపొందాడు. ముంబాయికి చెందిన సునిల్ గాడ్గే పై వరంగల్‌కు చెందిన పవన్, ముంబాయికి చెందిన సందీప్ అంకోలపై వరంగల్‌కు చెందిన జిజె.రాకేష్, ముంబాయికి చెందిన అనంద్ కమలేపై విజయం సాధించాడు. వరంగల్‌కు చెందిన భవాని కుమార్, వరంగల్‌కు చెందిన అన్వర్ అలీపై, కాజీపేట జనరల్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన విష్ణుప్రసాద్, వరంగల్‌కు చెందిన అన్వర్‌పై కాజీపేటకు చెందిన ముజాహిద్ గెలుపొందారు.


క్యారమ్స్ సింగిల్స్ ఆడుతున్న క్రీడాకారులు

స్నూకర్స్‌ను ప్రారంభించిన సీసీసీ ఇస్మాయిల్

కాజీపేట రైల్వే ఇనిస్టిట్యూట్ టోర్నమెంట్స్‌లో భాగంగా రెండో రోజు గురువారం స్నూకర్స్ క్రీడను కాజీపేట చీఫ్ క్రూ కంట్రోలర్(సీసీసీ) ఇస్మాయిల్ ప్రారంభించారు. ఎం.సుదర్శన్, పి.రాజు, ఎం.రాజయ్య, సీహెచ్.సుదర్శన్, పి.వేదప్రకాష్, డీవీ.ప్రసాద్, అనిల్, ఎస్‌కె.జానీ తదితరులు పాల్గొన్నారు.


ఖేల్

హోరాహోరీగా క్రికెట్ పోటీలు


మ్యాన్‌ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న కేఎల్ యూనివర్సిటీ ప్లేయర్ టోని

హసన్‌పర్తి(వర్ధన్నపేట): ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న సౌత్ ఇండియా చాంపియన్ టీ–20 పోటీలు హోరాహరీగా సాగుతున్నాయి. ఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల(వరంగల్)లో మూడు మైదానాలు, ఎస్‌ఆర్ ఐటీ(హైదరాబాద్)లోని మరో గ్రౌండ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయి. వరంగల్ కళాశాల మైదానంలో గురువారం రెండో రోజు కిట్స్(వరంగల్), అరోరా(హైదరాబాద్) జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కిట్స్ జట్టు 94 తేడాతో విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన కిట్స్ జట్టు నిర్ణీత 16 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 177 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అరోరా జట్టు 16 ఓవర్లలో తొమ్మిది వికెట్ల నష్టానికి 83 పరుగులు చేశారు. కిట్స్ ఆటగాడు పవన్ 42 బంతుల్లో 63 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. మరో మ్యాచ్‌లో తిరుమల ఇంజనీరింగ్ కళాశాల(హైదరాబాద్)జట్టు, బిట్స్ (నర్సంపేట) జట్టుపై విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన తిరుమల జట్టు 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 154 పరుగులు చేయగా అనంతరం బ్యాటింగ్ చేసిన బిట్స్ జట్టు 17.4 ఓవర్లలో 91 పరుగులకే కుప్పకూలింది. అలాగే కేఎల్ యూనివర్సిటీ(గుంటూరు) జట్టు, సీఐటీఎస్(కరీంనగర్)జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కేఎల్ జట్టు గెలుపొందింది. ముందుగా బ్యాటింగ్ చేసిన కేఎల్ యూనివర్సిటీ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేయగా తర్వాత బ్యాటింగ్ చేసిన సీఐటీఎస్ జట్టు 17.3 ఓవర్లలో 100 పరుగులకే అలౌటైంది. సీఎంఆర్‌ఈసీ(హైదరాబాద్)జట్టును నిట్ (వరంగల్) జట్టు ఓడించింది.

అలాగే ఎంఆర్‌ఈసీ(హైదరాబాద్) జట్టు, ఎంఎల్‌ఆర్‌ఐటీ(హైదరాబాద్)జట్టును డించింది. ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఆర్‌ఈసీ జట్టు 19.2 ఓవర్లలో 97 పరుగులకు అలౌట్ కాగా తర్వాత బ్యాటింగ్ దిగిన ఎంఎల్‌ఆర్‌ఐటీ జట్టు 20 ఓవర్లలో 86 పరుగులకు ఇన్నింగ్‌ను ముగించుకుంది.





అంగన్‌వాడీ సెంటర్లు అనుకున్న లక్ష్యాన్ని అందించడం లేదు. కేవలం చిన్న పిల్లలను రెండు మూడు గంటలు కూర్చోబెట్టి పంపించే కేంద్రాలుగా మారిపోయాయి. అసలు తొలి సంరక్షణ విద్య చాలా సెంటర్లలో కొనసాగడం లేదు. కేవలం ఆహారం పెట్టేసి ఇళ్లకు పంపుతున్నారు.

అంగన్‌వాడీలా!

కనీస సౌకర్యాలు లేని అంగన్‌వాడీ సెంటర్లు.. సిబ్బంది కొరతతో ఇబ్బందులు

సిరిసిల్ల నుంచి ఆసరి మహేశ్:

గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లల ఆరోగ్య సంరక్షణతోపాటు చిన్న పిల్లల్లో పౌష్టికాహారలోపాన్ని నిర్మూలించడం, ప్రీప్రైమరీ విద్యను అందించడం కోసం ఏర్పాటైన అంగన్‌వాడీ సెంటర్లు.. కేవలం అరకొర ఆహార పంపిణీ చేపట్టి చేతులు దులుపుకొనే కేంద్రాలుగా మారిపోతున్నాయి. రాష్ట్రంలోని అంగన్‌వాడీ సెంటర్లు ప్రీస్కూల్ విధానంలో నడవాలని, ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పిల్లలకు, లబ్ధిదారులకు అందించే సేవలకు సంబంధించిన టైంటేబుల్‌ను మహిళా, శిశు సంక్షేమ శాఖాధికారులు విడుదల చేశారు. కానీ అది ఎక్కడా అమలు కావడం లేదు. కేవలం నివేదికలు పైఅధికారులకు పంపడం, అంతా సవ్యంగా జరుగుతోందని వాళ్లు మిన్నకుండడం జరిగిపోతోంది.

కనీస సౌకర్యాలేవీ?

అంగన్‌వాడీ కేంద్రాలకు పిల్లలను పంపించడానికి తల్లిదండ్రులు సుముఖంగానే ఉన్నారు. కానీ ఆ కేంద్రాల్లో కనీస వసతులైన తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, గదుల సౌకర్యాల లేమి ఉంది. టైం టేబుల్‌లో పిల్లలు నిద్రించేందుకు సమయాన్ని కేటాయించిన అధికారులు అందుకు అవసరమైన కనీస సౌకర్యాలు కల్పించలేకపోవడం మరో కారణం. రాష్ట్రంలోని అనేక కేంద్రాల్లో ఆయాలు, టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. కేంద్రాల పనితీరును పర్యవేక్షణ చేసే అధికారుల పోస్టులూ ఖాళీగా ఉండడంతో అనుకున్న లక్ష్యాలు నెరవేరడం లేదు. ప్రభుత్వ పథకాల ప్రచారం, సభలు, సమావేశాలకు అంగన్‌వాడీ కార్యకర్తలను, టీచర్లను వినియోగించడం కూడా సెంటర్ల నిర్వహణకు ఇబ్బందిగా మారింది.



చిన్న పిల్లలకూ దొడ్డు బియ్యమేనా?

వసతి గృహాల్లో, పాఠశాలల్లో సన్నబియ్యం భోజనం అందిస్తూ, చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు దొడ్డు బియ్యంతో కూడిన ఆహారం అందించడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇక గుడ్డు విషయంలోనూ అనేక ఆరోపణలు ఉన్నాయి. గుత్తేదారులు పౌల్ట్రీలో మిగిలిపోయిన చిన్నసైజు గుడ్లను సరఫరా చేస్తున్నారు. ఈ వ్యవహారం ఏళ్లుగా నడుస్తున్నా అధికారుల నుంచి స్పందన లేదు.



సాగుచేద్దామా.. సేంద్రియ పత్తి!

ఆదిలాబాద్ జిల్లా నుంచి మహమ్మద్ అక్బర్ ఖాన్:

ఆర్గానిక్ పత్తికి మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో దిగుబడి పెరిగేందుకు కొత్త కొత్త వంగడాలు వస్తున్నాయి. రోగాలను తట్టుకొనే విత్తనాలు తయారు చేస్తున్నారు. వాటికి కావాల్సిన పురుగుల మందులు సైతం కంపెనీలు తయారు చేస్తున్నాయి. దానికి తోడు రసాయన ఎరువులు విరివిగా వాడుతున్నారు. అయినా సరైన దిగుబడి రావడం లేదు. భూమిలో సారంలేక, కొత్త వంగడాలతో పురుగులు ఆశించి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. ఇక వాతావరణం అనుకూలించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కానీ చేతన ఆర్గానిక్ ఎన్‌జీఓ ద్వారా ఆర్గానిక్ (సేంద్రియ పద్ధతి)లో సాగు చేయడంలో అధిక దిగుబడి సాధించడమే కాకుండా సాధారణ పంటల కంటే ఎక్కువ ధర పలుకుతోంది. విదేశాల నుంచి వచ్చి పంటలు కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారంటే దీనికి ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పటికే 200 గ్రామాల రైతులు సాగు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ పరిధి సిర్పూర్(యు), ఉట్నూర్, నార్నూర్, ఆసిఫాబాద్, కెరమెరి, జైనూర్ మండలాల్లో సుమారు 200 గ్రామాల రైతులు 230 సంఘాలుగా ఏర్పడి ఐదు వేల ఎకరాల్లో ఆర్గానిక్ పద్ధతిలో పత్తి పంటను సాగు చేశారు. ఈ సీజన్‌లో సుమారు 20 వేల క్వింటాళ్ల దిగుబడి సాధించారు. సాధారణ పద్ధతిలో సాగుచేసే పత్తితో పోల్చితే ఆర్గానిక్ పద్ధతిలో వచ్చిన దిగుబడికి మంచి ధర లభిస్తోంది. క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400 వరకు అధికంగా వస్తోంది. ఈ పద్ధతిని 2009 సంవత్సరం నుంచి అమలు చేస్తున్నారు.

ఇదీ ఆర్గానిక్ విధానం..

ఆర్గానిక్ పద్ధతిలో సాగుచేసే రైతులు భూమిలో రసాయనిక ఎరువులకు బదులు పశువుల పేడను వాడతారు. పురుగుల మందులు కాకుండా వేప కషాయం, ఆవు మూత్రం, ఆవుపేడ, వేపనూనె, మిరపకాయ- వెల్లుల్లితో చేసిన మిశ్రమం పంటలకు ఉపయోగిస్తున్నారు. చేతన ఆర్గానిక్ సంస్థ నిర్వాహకులు దగ్గరుండి పర్యవేక్షిస్తూ రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు చేస్తున్నారు.

విదేశాలకు ఎగుమతి

గిరిజనులు పండించిన ఆర్గానిక్ పత్తిని విక్రయించడానికి మార్కెట్‌కు తీసుకుపోనక్కర్లేదు. ఈ పత్తి విదేశాలకు ఎగుమతి అవుతోంది. జర్మనీకి చెందిన డెబెల్లా అనే సంస్థ ఈ పత్తిని కొనుగోలు చేస్తోంది. అక్కడి నుంచి బ్రెజిల్, ఇంగ్లాండ్, స్వీడన్ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ఆయా దేశాల ప్రతినిధులు బెంగళూరులోని చేతన ఆర్గానిక్ సంస్థ కార్యాలయంలో సంప్రదించి పత్తిని కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా విదేశీ కంపెనీ అయిన డెబెల్లా.. అనేక సేవా కార్యక్రమాలు చేపడుతోంది. ఈ కంపెనీ 2009లో ఏజెన్సీలోని సుమారు 50 గ్రామాలను దత్తత తీసుకుంది. మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు జీవనోపాధికి సంబంధించి అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ఇందులో భాగంగానే నార్నూర్ మండలం మహాగామ్ గ్రామంలో 50 మరుగుదొడ్లు నిర్మించడంతోపాటు విద్యార్థులు కూర్చోవడానికి 350 బెంచీలు, సైకిళ్లను పంపిణీ చేసింది.

పర్యటించిన స్వీడన్ దేశస్తులు



స్వీడన్ దేశానికి చెందిన క్లాత్ బ్రాండ్ కంపెనీ నిర్వాహకులు అలెగ్జాండర్, లార్స్‌గున్నార్ గత డిసెంబర్ 13, 14 తేదీల్లో ఏజెన్సీ గ్రామాల్లో పర్యటించారు. గిరిజనులు సాగుచేస్తున్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతు సంఘాలతో సమావేశమై వారి జీవన విధానం, పంటలు పండించే తీరు, సంస్థ ద్వారా అందుతున్న సహాయ సహకారాలపై ఆరా తీశారు. జైనూర్ మండలంలోని ఉషేగాం, రాగాపూర్, నార్నూర్ మండలంలోని పిప్రి, మహాగాం గ్రామాలను సందర్శించి తమ సంస్థ ద్వారా చేపట్టిన సామాజిక కార్యక్రమాలను పర్యవేక్షించారు.



మహారాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టి బొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: మహారాష్ట్రలో దళితులపై జరుగుతున్న దాడులకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ఆ రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. నాయకులు కొత్త హరిబాబు, దండు రమేష్, దేవన్, మలయ్య, సమ్మయ్య, పూలమ్మ, తిరుపతమ్మ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ చేసిన రాష్ట్ర పరిశీలకుల బృందం

చిట్యాల: చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలలోని ప్రభుత్వ పాఠశాలల పనితీరును గురువారం పరిశీలించడం జరిగిందని రాష్ట్ర పరిశీలకులు గౌరిశెట్టి రాజన్న, నామాని సాంబయ్య తెలిపారు. మొగుళ్లపల్లి మండలంలోని ఇస్సిపేట, మొగుళ్లపల్లి హైస్కూళ్లను, టేకుమట్ల మండలంలోని వెలిశాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలను, తరువాత చిట్యాలలోని కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, జూకల్లులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించినట్లు వారు పేర్కొన్నారు. సీసీఈ విధానం అమలు, లిప్ అభ్యాసన వృద్ధి కార్యక్రమం అమలుపై పరిశీలించినట్లు వారు తెలిపారు. ఉపాధ్యాయుల పనితీరు మెరుగ్గానే ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట చిట్యాల, టేకుమట్ల మండలాల ఎంఈఓలు కోడెపాక రఘుపతి, ఉప్పు సదాశివరావు ఉన్నారు.

మరుగుదొడ్ల వినియోగంపై కళాజాత

టేకుమట్ల: మరుదొడ్లను నిర్మించుకొని స్వచ్ఛ భారత్ పథకాన్ని విజయవంతం చేయాలని మండలంలోని గుమ్మడవెల్లి గ్రామంలో బుధవారం సాయత్రం ఏర్పాటు చేసిన కళాజాతలో కళాకారులు ప్రజలకు తెలియజేసారు. మరుగుదొడ్ల వినియోగంతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని, ఆరుబయట మల మూత్ర విసర్జన చేయడం వల్ల ఈగలు, దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడుతారనివివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తోడేటి రవిందర్, పంచాయతీ కార్యదర్శి శైలజ, ఫీల్డ్ అసిస్టెంట్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..!!



రేగొండ: మండలంలోని జగ్గయ్యపేట–రేగొండ మధ్య ప్రధాన రహదారిలో ఉన్న మూల మూలమలుపు వద్ద రోడ్డు పక్కనే ఓ బావి ప్రమాదకరంగా ఉంది. వాహనదారు ఆదమరిస్తే ప్రమాదం జరిగి ప్రాణాలు పోయే పరిస్థితి నెలకొంది. ఈ ప్రదేశంలో ఆర్అండ్‌బీ అధికారులు ఎలాంటి హెచరిక బోర్డు పెట్టలేదు. మొదటిసారి ఆ రోడ్డు వెంట వచ్చే వాహనదారులు అప్రమత్తంగా లేకపోతే ప్రమాదం జరిగే అవకాశం ఉందని మండల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మూల మలుపు వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డును పెట్టాలని కోరుతున్నారు.

న్యూస్ బాక్స్

మండల సమావేశం రద్దు

భూపాలపల్లి రూరల్: రేపు(శనివారం) రోజున జరగనున్న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎంపీడివో వెంకటేశ్వర్లు గురువారం ప్రకటనలో తెలిపారు. అదే రోజున జిల్లా ప్రజాపరిషత్ సమావేశం ఉన్నందున సమావేశాన్ని రద్దు చేయడం జరిగిందన్నారు.

ఆరోపణల్లో వాస్తవం లేదు

భూపాలపల్లి అర్బన్: వెంకటాపూరం మండలం లక్ష్మిదేవిపేటకు చెందిన మహిళలు తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని వెంకటాపురం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు సలేంద్రం ఓ ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన గాజర్ల సరోజన, నీలారపు మంజల, చెవుల రమాదేవి డీఈఓ తనపై తప్పుడు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. తన భార్య మాత్రమే ఓ తెలుగు దినపత్రిక (సాక్షిలో కాదు) పనిచేస్తోందని పేర్కొన్నారు.

ఆడబిడ్డలకు సేవ చేయడం నా అదృష్టం

స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి

టేకుమట్ల:

కళ్యాణలక్ష్మి పథకంతో ఆడబిడ్డలకు సేవ చేయడం ఎన్నో జన్మల అదృష్టంగా భావిస్తున్నాని స్పీకర్ మధుసూధనాచారి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళ్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. 'కళ్యాణ లక్ష్మి'తో ఆడపిల్ల పెళ్ళికి భరోసా ఏర్పడిందన్నారు.

ఎంపేడులో డబుల్ బెడ్రూం ఇళ్లకు శంకుస్థాపన

ఎంపేడు గ్రామంలో ప్రభుత్వం కేటాయించిన 30 డబుల్ బెడ్రూం ఇండ్ల నిర్మాణానికి స్పీకర్ శంకుస్థాపన చేసారు. సర్పంచ్ కొలిపాక రాజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో బస్సు గ్రామానికి రావడం లేదన్న గ్రామ ప్రజల అభ్యర్థనకు స్పందించి వెంటనే ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడి వారంలో బస్సు సౌకర్యాన్ని కల్పించాలని ఆదేశించారు. కరీంనగర్ నుంచి నేషనల్ హైవేతో పాటు, రైతుల సాగు, తాగు నీటి సౌకర్యార్థం మానేరులో బారీ బడ్జెత్‌తో డ్యాం నిర్మిస్తానని హామీ ఇచ్చారు.

ఎస్సీ కమ్యూనిటీ హాలకు గ్రీన్ సిగ్నల్

గ్రామంలో రూ.12.50లక్షలతో నెల వ్యవధిలోగా ఎస్సీ కమ్యూనిటీ హాలుకు నిధులు మంజూరు చేయిస్తానని స్పీకర్ హామీ ఇచ్చారు.



కళ్యాణలక్ష్మి లబ్ధిదారులతో స్పీకర్ సిరికొండ

ఆడియో ఆవిష్కరణ

స్పీకర్ సిరికొండ మధుసూధనాచారిపై అభిమానంతో రచయిత పాల మహేశ్, గాయకుడు మిట్టపెల్లి బాలు స్వరపరిచిన ఆడియో క్యాసెట్‌ను స్పీకర్, నాయకులు ఆవిష్కరించారు.

శంకుస్థాపనను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు

ఎంపేడు గ్రామంలో నిర్మించతలపెట్టిన స్థలం ప్రభుత్వ భూమి కాదని అది పట్టా భూములని ఇక్కడ డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించడం నిలిపివేయాలని కాంగ్రెస్ నాయకులు అశోక్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ సట్ల కొంరయ్య తదితరులు డిమాండ్ చేశారు.

టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తి సంపత్, రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ కూర సురేందర్ రెడ్డి, కొలిపాక రాజయ్య, కమురోద్దిన్, ఆకునూరి తిరుపతి, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీపతి రవి, రాంరెడ్డి, సతీష్, శ్యాంసుందర్‌రెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

గణపురం: టీఆర్ఎస్ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని శాసనసభాపతి సిరికొండ మధుసూదనాచారి అన్నారు. మండలకేంద్రంలోని గణపురం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సాయంత్రం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి సహకార సంఘం చైర్మెన్ తాళ్లపెల్లి భాస్కర్ రావు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. గణపురం సహకార సంఘం అబివృద్ధికి చైర్మెన్ భాస్కర్ రావు అహర్నిశలు కృషి చేస్తున్నాడని అభినందించారు. సహకార సంఘం భవనం శిథిలావస్థలో ఉందని నూతన భవనం నిర్మించడానికి నిధులు మంజూరు చేయాలని చైర్మెన్ భాస్కర్ రావు కోరడంతో నిధులు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. జెడ్పీటీసీ మోటపోతుల శివశంకర్ గౌడ్, గుజ్జ లక్ష్మణ్ రావు, దివి ప్రసాద్ నాయుడుతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ



గట్టు అన్వేష్
వ్యవసాయ విస్తరణాధికారి
మొగుళ్లపల్లి
అంశం:వ్యవసాయ పనులు

మొగుళ్లపల్లి:

ప్రశ్న: మీ పరిధిలో ఏయే గ్రామాలున్నాయి?

జవాబు: ముల్కలపల్లి, కొర్కిశాల, పోతుగల్లు, మొట్లపల్లి గ్రామాలలో విధులు నిర్వహిస్తున్నాను.

ప్రశ్న: రైతులకు ఎలాంటి సేవలు అందిస్తున్నారు ?

జవాబు: ప్రతి రెండు వేల హెక్టార్లకు ఒక విస్తరణాధికారి ఉంటూ రైతుల వద్దకు వెళ్లి సూచనలు అందిస్తున్నాం.

ప్రశ్న: భూసార పరీక్షలు నిర్వహిస్తున్నారా?

జవాబు: భూసార పరీక్షలను నిర్వహించి ఫలితాలను రైతులకు అందిస్తున్నాం.

ప్రశ్న: మీ పరిధిలోని గ్రామాల్లో రైతులకు గుర్తింపు కార్డులు అందించారా?

జవాబు: నా పరిధిలోని గ్రామాల్లోని రైతులకు పత్తికార్డులను అందజేశాను.

ప్రజల చూపు.. అభివృద్ధి వైపు

టీఆర్ఎస్ యూత్ రాష్ట్ర నాయకుడు క్రాంత్‌కుమార్

రేగొండ: టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూపాలపల్లి నియోజక వర్గంలో చేస్తున్న అభివృద్ధిని చూసి ఆయా గ్రామాల ప్రజలు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని టీఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకుడు సిరికొండ క్రాంత్‌కుమార్ అన్నారు. సుల్తాన్‌పురం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు గంధం కృష్ణారావు, ఓరుగంటి సారయ్య, సారంగం,రాజు, రవితో పాటు సుమారు 50 మంది టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోడెం ఉమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఆవరణంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి క్రాంత్‌కుమార్ పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. సుల్తాన్‌పురం ఎంపీటీసీ సభ్యులు బండి సాయిలు, మైస భిక్షపతి, నాయకులు మటిక సంతోష్, అయిలి శ్రీధర్‌గౌడ్, పగుడాల అయిలయ్య, లెంకల రాజిరెడ్డి, చందుగౌడ్, నీలాంబ్రం, వావిలాల రమేష్, గండి తిరుపతి పాల్గొన్నారు.



నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న క్రాంత్‌కుమార్

మృతుల కుటుంబాలకు పరామర్శ

రేగొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన కొడెపాక రాజయ్య, ఇతర మృతుల కుటుంబాలను టీఆర్ఎస్, రాష్ట్ర నాయకుడు గండ్ర సత్యనారాయణరావు, టీఆర్ఎస్ రాష్ట్ర యూత్ నాయకుడు క్రాంత్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి గండ్ర జ్యోతి, కొండా యువసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వేల్పుల నగేష్ గురువారం వేర్వేరుగా పరామర్శించారు.

రాజ్‌మహ్మాద్‌కు 'పూలే అవార్డు'



పురస్కారం అందుకుంటున్న రాజ్‌మహ్మాద్

చిట్యాల: మండల కేంద్రంలోని కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ ఎం.డీ రాజ్‌మహ్మాద్ సావిత్రిభాయి పూలే అవార్డు అందుకున్నారు. పూలే జయంతి ఉత్సవాలను పురష్కరించుకొని బుధవారం హన్మకొండలోని అంబేద్కర్ భవనంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహి ంచారు. గత 28 ఏళ్ల నుంచి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్‌ను అందించిన రాజ్‌మహ్మాద్‌ను ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసి శాలువాతో, పూలమాలతో ఘనంగా సన్మానించి, మెమోంటో అందజేశారు. మారుమూల ప్రాంతంలోని పేద విద్యార్థులకు మరింత ఉత్తమ విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతానని రాజ్‌మహ్మాద్ పేర్కొన్నారు.

Sakshi Vidya Online Edition www.sakshieducation.com/Vidya.aspx
Send your Feedback to v

What can you say about their slope?



యార్లగడ్డ వనరాజు
స్కూల్ అసిస్టెంట్,
ప్రభుత్వ ఉన్నత పాఠశాల




CO-ORDINATE GEOMETRY

Section Formula


The coordinates of the point P(x, y) which divides the line segment joining the points A (x_1, y_1) and B (x_2, y_2) internally in the ratio $m_1 : m_2$ are:

$$\left(\frac{m_1x_2+m_2x_1}{m_1+m_2}, \frac{m_1y_2+m_2y_1}{m_1+m_2}\right)$$

- This is known as the section formula.
- If the ratio in which P divides AB is k : 1 then the coordinates of the point P are $\left(\frac{kx_2+x_1}{k+1}, \frac{ky_2+y_1}{k+1}\right)$
- The coordinates of mid point P of the line segment joining the points A(x_1, y_1) and B (x_2, y_2) are: $\left(\frac{x_1+x_2}{2}, \frac{y_1+y_2}{2}\right)$
- The coordinates of centroid of triangle ABC with vertices A(x_1, y_1), B(x_2, y_2) and C(x_3, y_3) are $\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$
- The point of concurrence of medians of a triangle is called its centroid.
- Centroid divides each median in the ratio 2 : 1.
- The points which divide a line segment into 3 equal parts are said to be the trisectional points.
- If P and Q be the points of trisecion of AB line segment then AP = PQ = QB.



- If P, Q are the points of trisection of AB line segment, then P divides AB in the ratio 1:2 and Q divides AB in the ratio 2:1.
- Area of a triangle = ½ (Base × Height)
- Area of ΔABC with vertices A (x_1, y_1), B (x_2, y_2) and C (x_3, y_3) is the numerical value of expression $=\frac{1}{2}\left|x_1(y_2-y_3)+x_2(y_3-y_1)+x_3(y_1-y_2)\right|$
- Area of ΔAOB with vertices A(x_1, y_1), B (x_2, y_2) and O (0, 0) is the numerical value of the expression $=\frac{1}{2}\left|x_1y_2-x_2y_1\right|$
- If the vertices of triangle O(0, 0), A (a, 0) and B (0, b) then the area of ΔOAB $=\frac{1}{2}\left|ab\right|$
- Area of quadrilateral ABCD = Area of ΔABC + Area of ΔACD



Heron's Formula

- If a, b, c are three sides of ΔABC then the area of ΔABC = $\sqrt{s(s-a)(s-b)(s-c)}$ where $s=\frac{a+b+c}{2}$

Slope:

- If a straight line makes the angle θ with X-axis then the slope of that straight line is m = tanθ.
- Slope of the line passing through the points (x_1, y_1) and (x_2, y_2) is $m=\frac{y_2-y_1}{x_2-x_1}$
- Slope of X-axis is '0'
- Slope of Y-axis is not defined.

Model Problems

1. Find the coordinates of the point which divides the join of (–1,7), (4,–3) in the ratio 2 : 3.

Sol: Given points (–1, 7), (4, –3)
given ratio 2 : 3 = $m_1 : m_2$
Let P(x, y) be the required point
Using the section formula

$$P(x, y) = \left(\frac{m_1x_2+m_2x_1}{m_1+m_2}, \frac{m_1y_2+m_2y_1}{m_1+m_2}\right)$$

$$\Rightarrow \left(\frac{2(4)+3(-1)}{2+3}, \frac{2(-3)+3(7)}{2+3}\right)$$

$$\Rightarrow \left(\frac{8-3}{5}, \frac{-6+21}{5}\right) \Rightarrow \left(\frac{5}{5}, \frac{15}{5}\right) \Rightarrow (1,3)$$

2. If A and B are (–2, –2) and (2, –4) respectively. Find the coordinates of P such that $AP=\frac{3}{7}AB$, P lies on the segment AB.

A. We have $AP=\frac{3}{7}AB \Rightarrow \frac{AP}{AB}=\frac{3}{7}$

$\frac{AP}{AP+PB}=\frac{3}{7}$ (∵ AB= AP+AB)

7AP = 3(AP+PB) ⇒ 7AP–3AP = 3PB

⇒ 4AP = 3PB ⇒ $\frac{AP}{PB}=\frac{3}{4}$

So P divides AB in the ratio = 3 : 4
A= (–2, –2); B = (2, –4)
∴ Coordinates of P are

$$\left(\frac{3(2)+4(-2)}{3+4}, \frac{3(-4)+4(-2)}{3+4}\right)$$

$$P(x,y)=\left(\frac{6-8}{7}, \frac{-12-8}{7}\right) \Rightarrow \left(\frac{-2}{7}, \frac{-20}{7}\right)$$

3. If the mid point of the line segment joining $A\left(\frac{x}{2}, \frac{y+1}{2}\right)$ and B (x+1, y–3) is C (5, –2), then find x, y.

A. Midpoint of the line segment joining A (x_1, y_1), B (x_2, y_2) is $\left(\frac{x_1+x_2}{2}, \frac{y_1+y_2}{2}\right)$

Given that midpoint of $A\left(\frac{x}{2}, \frac{y+1}{2}\right)$ and B (x+1, y–3) is C (5, –2)

$$\therefore (5,-2)=\left(\frac{\frac{x}{2}+x+1}{2}, \frac{\frac{y+1}{2}+y-3}{2}\right)$$

$$\Rightarrow \left(\frac{\frac{x}{2}+x+1}{2}\right)=5 \Rightarrow \frac{x+2x+2}{4}=5$$

⇒ 3x+2 = 20 ⇒ x = 6

$$\left(\frac{\frac{y+1}{2}+y-3}{2}\right)=-2 \Rightarrow \frac{y+1+2y-6}{4}=-2$$

⇒ 3y–5 = –8 ⇒ 3y = –8+5 ⇒ y = –1.

4. The points (2, 3), (x, y), (3, –2) are vertices of a triangle. If the centroid of the triangle is origin, then find (x, y).

A. Centroid of (x_1, y_1), (x_2, y_2) and (x_3, y_3) = $\left(\frac{x_1+x_2+x_3}{3}, \frac{y_1+y_2+y_3}{3}\right)$

Given that centroid of (2, 3), (x, y), (3, –2) is (0, 0)

i.e. $(0,0)=\left(\frac{2+x+3}{3}, \frac{3+y-2}{3}\right)$

$(0,0)=\left(\frac{5+x}{3}, \frac{y+1}{3}\right) \Rightarrow \frac{5+x}{3}=0 \Rightarrow x=-5$

$\frac{y+1}{3}=0 \Rightarrow y=-1$ ∴ (x, y) = (–5, –1)

5. If the points A (6, 1), B (8, 2), C (9, 4) and D(p, 3) are the vertices of a parallelogram, taken in order find the value of p.

A. We know that diagonals of parallelogram bisect each other.
Given A (6, 1), B (8, 2), C (9, 4), D (p, 3)
So, the coordinates of the midpoint of AC = Coordinates of the midpoint of BD.

i.e. $\left(\frac{6+9}{2}, \frac{1+4}{2}\right)=\left(\frac{8+p}{2}, \frac{2+3}{2}\right)$

$\Rightarrow \left(\frac{15}{2}, \frac{5}{2}\right)=\left(\frac{8+p}{2}, \frac{5}{2}\right) \Rightarrow \frac{8+p}{2}=\frac{15}{2}$

⇒ p = 15 – 8 = 7 ∴ p = 7

7. Find the slope of the line joining the two points A (–1.4, –3.7) and B (–2.4, 1.3)

A. Given points A (–1.4, –3.7), B (–2.4, 1.3)
slope of AB =

$$\frac{y_2-y_1}{x_2-x_1}=\frac{(1.3)-(-3.7)}{-2.4-(-1.4)}=\frac{1.3+3.7}{-2.4+1.4}=-5$$

8. Justify that the line $\overline{AB}$ line segment formed by(–2,8), (–2,–2) is parallel to Y–axis. What can you say about their slope? Why?

A. Slope of AB = $\frac{y_2-y_1}{x_2-x_1}=\frac{-2-8}{(-2)-(-2)}=\frac{-10}{0}$ = underfined.

∴The slope of AB cannot defined, because the line segment $\overline{AB}$ is parallel to Y–axis.

6. Find the area of the triangle whose vertices are (0, 0), (3, 0) and (0, 2).

A. Area of triangle

$$=\frac{1}{2}\left|x_1(y_2-y_3)+x_2(y_3-y_1)+x_3(y_1-y_2)\right|$$

$$=\frac{1}{2}\left|0(0-2)+3(2-0)+0(0-0)\right|$$

$=\frac{1}{2}\left|6\right|$ = 3 sq.units

Note: Area of the triangle whose vertices are(0,0), (x_1,y_1), (x_2,y_2) is: $=\frac{1}{2}\left|x_1y_2-x_2y_1\right|$

9. If x–2y +k = 0 is a median of the triangle whose vertices are at points A (–1, 3), B (0, 4) and C (–5, 2), find the value of K.

A. The coordinates of the centroid G of ΔABC $\left(\frac{(-1)+0+(-5)}{3}, \frac{3+4+2}{3}\right)=(-2,3)$

Since G lies on the median x–2y + k = 0,
⇒ Coordinates of G satisfy its equation
∴ – 2– 2(3) + k = 0 ⇒ k = 8.

10. Determine x so that 2 is the slope of the line through P (2, 5) and Q (x, 3)

A. Given points P (2, 5) and Q (x, 3)
Slope of $\overline{PQ}$ is 2

i.e. $2=\frac{y_2-y_1}{x_2-x_1} \Rightarrow 2=\frac{3-5}{x-2} \Rightarrow 2=\frac{-2}{x-2}$

⇒ – 2 = 2(x–2) ⇒2x = 2 ⇒ x = 1.

11. The coordinates of one end point of a diameter of a circle are (4, –1) and the coordinates of the centre of the circle are (1, –3). Find the other end point.

A. Let AB be a diameter of the circle having its centre at C (1,–3) such that the coordinates of one end A are (4, –1)
Let the coordinates of other end be B (x, y) since C is the mid point of AB.

∴The coordinates of C are $\left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right)$

But, the coordinates of C are given to be (1, –3)

$\therefore \left(\frac{x+4}{2}, \frac{y-1}{2}\right)=(1,-3) \Rightarrow \frac{x+4}{2}=1$

$\Rightarrow \frac{x+4}{2}=1 \Rightarrow x+4=2 \Rightarrow x=-2$

$\Rightarrow \frac{y-1}{2}=-3 \Rightarrow y=-5$

∴Other end point of daimeter is (–2, –5)

'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?



జి. శ్రీనివాస్
స్కూల్ అసిస్టెంట్, బయోసైన్స్, జెడ్‌పీహెచ్‌ఎస్, పెర్కకొండారం, నల్గొండ జిల్లా.

టీఎస్‌పీఎస్సీ
టీఆర్‌టీ
ఎస్‌జీటీ/ఎస్‌ఏ-బయాలజీ
ప్రత్యేకం

మాదిరి ప్రశ్నలు

1. జంతు రాజ్యంలో మొదటి త్రిస్తరిత(Triploblastic) జీవులు ఏ వర్గానికి చెందినవి?
1) అనెలిడ 2) మొలస్కా 3) ప్లాటీహెల్మింథిస్ 4) ఆర్థ్రోపొడ

2. జంతు రాజ్యంలో మొదటి నిజ శరీర కుహర జీవులు ఏవి?
1) ప్లాటీహెల్మింథిస్ 2) నెమటోడ 3) అనెలిడ 4) పొరిఫెర

3. ద్విపార్శ్వ సౌష్ఠవం మొదటిసారిగా ఏ వర్గపు జీవుల్లో కనిపించింది?
1) గుండ్రటి పురుగులు 2) బద్దె పురుగులు 3) వానపాములు 4) కీటకాలు

4. నాలుగు రాజ్యాల వర్గీకరణను ప్రతిపాదించిన శాస్త్రవేత్త ఎవరు?
1) హెకెల్ 2) విట్టేకర్ 3) కోప్‌లాండ్ 4) లిన్నియస్

5. కింది వాటిలో విట్టేకర్ వర్గీకరణలో ఉండి, కోప్‌లాండ్ వర్గీకరణలో లేని రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) ఎనిమేలియా 3) ఫంజై 4) మొనీరా

6. కింది వాటిలో హెకెల్ తన వర్గీకరణలో లిన్నియస్ ప్రతిపాదించిన రెండు రాజ్యాలకు దేన్ని కలిపాడు?
1) ఫంజై 2) మొనీరా 3) ప్రొటిస్టా 4) ప్లాంటే

7. 'ద్వినామీకరణం'లో మొదటి పదం దేన్ని సూచిస్తుంది?
1) ప్రజాతి 2) జాతి 3) ఉపజాతి 4) కుటుంబం

8. 'జాతి' అనే పదాన్ని తొలిసారిగా వర్ణించిన శాస్త్రవేత్త ఎవరు?
1) లిన్నియస్ 2) హెకెల్ 3) జాన్‌రే 4) హుకర్

9. పరాశరుడు భూచర మొక్కలను ఏ లక్షణం ఆధారంగా వర్గీకరించాడు?
1) ఆయుర్వేద గుణం 2) పుష్ప లక్షణం 3) ఆవాసం 4) ఏదీకాదు

10. వర్గీకరణ అంతస్తుల్లో పెద్దది ఏది?
1) రాజ్యం 2) వర్గం 3) కుటుంబం 4) రంగం

11. కింది వాటిలో ఏ రాజ్యానికి చెందిన జీవులు అతి పురాతనమైనవి?
1) ప్రొటిస్టా 2) ఫంజై 3) మొనీరా 4) ప్లాంటే

12. ఏక కణ నిజకేంద్రక జీవుల రాజ్యం ఏది?
1) ప్రొటిస్టా 2) మొనీరా 3) మెటాఫైటా 4) మెటాజోవా

13. ఏక కణ కేంద్రక పూర్వ జీవుల రాజ్యం ఏది?
1) మొనీరా 2) ప్రొటిస్టా 3) ఫంజై 4) ఎనిమేలియా

14. ఫంజై రాజ్యానికి సంబంధించి కింది వాటిలో సరికాని వాక్యం ఏది?
1) అన్నీ బహుకణ జీవులు
2) ఎక్కువ బహుకణ జీవులు, కొన్ని ఏకకణ జీవులు
3) ఎక్కువ శాతం సిద్ధబీజాలను ఉత్పత్తి చేస్తాయి
4) పైవన్నీ సరైనవే

15. జంతు రాజ్యంలో మొదటిసారిగా సంవృత రక్త ప్రసరణ వ్యవస్థ ఏ జీవుల్లో కనిపించింది?
1) మొలస్కా 2) ఆర్థ్రోపొడ 3) అనెలిడ 4) పొరిఫెరా

16. వివృత రక్త ప్రసరణ మొదటిసారిగా ఏ జీవుల్లో కనిపించింది?
1) ఇఖైనోడర్మట 2) మొలస్కా 3) అనెలిడ 4) ఆర్థ్రోపొడ

17. కింది వాటిలో ఏ జీవుల్లో మొదటిసారిగా తల, వక్షం, ఉదరం అనే భాగాలు కనిపించాయి?
1) అనెలిడ 2) మొలస్కా 3) ఆర్థ్రోపొడ 4) ఇఖైనోడర్మట

18. కింది వాటిలో ఏ వర్గం జీవులు మంచి నీటిలో, భూమి మీద నివసించలేవు?
1) అనెలిడ 2) ఇఖైనోడర్మట 3) మొలస్కా 4) ఆర్థ్రోపొడ

19. నవీన జీవుల కంటే పురాతనమైన జీవులు..?
1) సరళమైనవి 2) సంక్లిష్టమైనవి 3) చెప్పలేం 4) అభివృద్ధి చెందినవి

20. 'ద్వినామీకరణం'ను ఏ సంవత్సరంలో ప్రతిపాదించారు?
1) 1856 2) 1758 3) 1859 4) 1885

21. పట్టుపురుగు గుడ్లను సూక్ష్మజీవులు పాడు చేస్తాయని కనుగొని, వాటిని నిర్మూలించే పద్ధతిని కూడా కనిపెట్టిన శాస్త్రవేత్త? *(DSC - 2004)*
1) లూయిస్ పాశ్చర్
2) ఆంటోనీ వాన్ లివెన్ హుక్
3) ఆచార్య మహేశ్వరి
4) టి.ఎస్. వెంకట్రామన్

22. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ షుగర్‌కేన్ రీసెర్చ్' అనే సంస్థ ఏ నగరంలో ఉంది? *(DSC-2004)*
1) నాగ్‌పూర్ 2) పుణె 3) లక్నో 4) కటక్

23. పిండోత్పత్తి శాస్త్రానికి నాంది పలికిన శాస్త్రవేత్త?
1) అరిస్టాటిల్ 2) లూయిస్ పాశ్చర్ 3) విలియమ్ హార్వే 4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్

24. భూమి మీద ఉన్న మొక్కలు, జంతువుల విస్తరణను తెలిపే జీవశాస్త్ర శాఖ ఏది?
1) జంతు భౌగోళిక శాస్త్రం 2) జంతు భూ విజ్ఞాన శాస్త్రం 3) ఆర్నిథాలజీ 4) ఫైకాలజీ

25. 'ఫాదర్ ఆఫ్ ఇండియన్ ఫైకాలజీ' అని ఎవరిని పేర్కొంటారు?
1) వెంకట్రామన్ 2) స్వామినాథన్ 3) అయ్యంగార్ 4) బీర్బల్ సహానీ

26. కింది వాటిలో పెంటా వాలెంట్ వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు తోడ్పడదు?
1) ధనుర్వాతం 2) హెపటైటిస్ 3) కోరింత దగ్గు 4) టైఫాయిడ్

27. MMR (Measles, Mumps, and Rubella) వ్యాక్సిన్ ఏ వ్యాధి నివారణకు ఉపయోగిస్తారు?
1) బాక్టీరియల్ 2) వైరల్ 3) 1, 2 4) ఫంగల్

28. విద్యార్థి.. జీవశాస్త్రం చదవడం ద్వారా దోమల వల్ల ఏయే వ్యాధులు వ్యాపిస్తాయని తెలుసుకున్నాడు?
ఎ) మలేరియా బి) బోదకాలు సి) డెంగ్యూ డి) మెదడువాపు
1) ఎ, బి 2) ఎ, సి, డి 3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

29. పాశ్చరైజేషన్ ప్రక్రియ వల్ల సూక్ష్మజీవులు ఏ పరిస్థితుల్లో మనుగడ సాగించలేవని విద్యార్థి అర్థం చేసుకుంటాడు?
1) అతి శీతల 2) అతి ఉష్ణ 3) సాధారణ 4) 1, 2

30. మార్షల్, వారెన్ కింది వాటిలో దేనిపై పరిశోధనలు జరిపారు?
1) కలరా బాక్టీరియా 2) క్షయ బాక్టీరియా 3) అల్సర్ బాక్టీరియా 4) ప్లేగు బాక్టీరియా

31. అలెగ్జాండర్ ఫ్లెమింగ్ నోబెల్ బహుమతిని కింది వారిలో ఎవరితో కలిసి పంచుకున్నారు?
1) విల్కిన్సన్, మేయర్ 2) ఫ్లోరీ, చైన్ 3) హార్వే, ఫలాడే 4) మాల్పిజీ, హార్వే

32. నెఫ్రాన్ నిర్మాణాన్ని అంతర్నిర్మాణ శాస్త్రంలో చదివితే, మూత్రం ఏర్పడే విధానాన్ని గురించి ఏ శాస్త్రంలో చదవాలి?
1) సూక్ష్మ అంతర్నిర్మాణ శాస్త్రం 2) శరీర ధర్మ శాస్త్రం 3) అణుజీవ శాస్త్రం 4) జీవరసాయన శాస్త్రం

33. కింది వాటిలో లక్నోలో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
1) NBRI(National Botanical Research Institute), IARI(Indian Agricultural Research Institute)
2) CICR(Central Institute for Cotton Research), CRRI(Central Rice Research Institute)
3) NBRI, IISR(Indian Institute of Sugarcane Research)
4) IARI, IISR

34. కింది వాటిలో హైదరాబాద్‌లో ఉన్న జాతీయ పరిశోధనా సంస్థలు ఏవి?
ఎ) NIN(National Institute of Nutrition)
బి) NIO(National Institute of Oceanography)
సి) ICRISAT(International Crops Research Institute for the Semi-Arid Tropics)
డి) NIV(National Institute of Virology)
1) ఎ, డి 2) బి, సి 3) బి, డి 4) ఎ, సి

35. కింది వాటిలో ద్వినామీకరణంలో దేన్ని తిరిగి ఉపయోగించవచ్చు?
1) కుటుంబం 2) ప్రజాతి 3) జాతి 4) తరగతి

36. కింది వాటిలో 'జాతి'కి సంబంధించి సరికాని వాక్యం ఏది?
1) అంతర ప్రజననం జరుపుకొనే జీవుల సమూహం
2) గతిశీలమైంది 3) స్థిరమైంది
4) ఒకే కేంద్రక నిర్మాణాన్ని కలిగి ఉండే జీవుల సమూహం

37. జతపరచండి.
శాస్త్రవేత్త
a) ఎడ్వర్డ్ జెన్నర్ b) లూయిస్ పాశ్చర్ c) ఎల్లాప్రగడ సుబ్బారావు d) జోనస్ సాల్క్
ఆవిష్కరణ
i) టెట్రాసైక్లిన్ ii) రేబిస్ వ్యాక్సిన్ iii) పోలియో వ్యాక్సిన్ iv) మశూచి వ్యాక్సిన్
1) a-ii, b-iii, c-iv, d-i
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

38. కేంద్రకాన్ని 'సైటో బ్లాస్ట్' అంటారని ఊహించిన వారెవరు?
1) రాబర్ట్ బ్రౌన్ 2) ష్లీడన్ 3) గాల్జీ 4) అరిస్టాటిల్

39. 'అనాటమీ ఆఫ్ ప్లాంట్స్' గ్రంథ రచయిత?
1) నెహేమియా గ్రూ 2) రాబర్ట్ బ్రౌన్ 3) ష్వాన్ 4) స్టీఫెన్ హేల్స్

40. జతపరచండి.
శాస్త్రవేత్త
a) సర్ రొనాల్డ్ రాస్ b) వాట్సన్, క్రిక్ c) అలెగ్జాండర్ ఫ్లెమింగ్ d) హరగోవింద్ ఖొరానా
నోబెల్ బహుమతి పొందిన సంవత్సరం
i) 1902 ii) 1968 iii) 1945 iv) 1962
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-iv, b-iii, c-i, d-ii
4) a-iii, b-ii, c-i, d-iv

41. జతపరచండి.
శాస్త్రవేత్త
a) డార్విన్ b) చార్లెస్ లయెల్ c) మాల్థస్ d) రుడాల్ఫ్ విర్చోవ్
గ్రంథం
i) అమ్నిస్ సెల్యూలా డే సెల్యులే
ii) ఆరిజిన్ ఆఫ్ స్పీసిస్
iii) ప్రిన్సిపుల్స్ ఆఫ్ జియాలజీ
iv) ఆన్ ది ప్రిన్సిపుల్స్ ఆఫ్ పాపులేషన్
1) a-i, b-iv c-iii, d-ii
2) a-iv, b-ii, c-i, d-iii
3) a-ii, b-iii, c-iv, d-i
4) a-iii, b-ii, c-i, d-iv

42. జోనాస్ సాల్క్, అల్బర్ట్ సాబిన్ అనే శాస్త్రవేత్తలు ఏ వ్యాధి నివారణకు కృషి చేశారు?
1) కేన్సర్ 2) టైఫాయిడ్ 3) పోలియో 4) డెంగ్యూ

43. జీవ పరిణామానికి ఉపయోగపడే, భూమి మీద వదిలిన గతించిన జీవుల అవశేష నిదర్శనాలు? *(TET - 2011)*
1) ఇంధనాలు 2) ఎముకలు 3) పాదముద్రలు 4) శిలాజాలు

44. వృక్షాల ఫలదీకరణను పరీక్ష నాళికల్లో జరిపే పద్ధతిని కనుగొన్న భారతీయ శాస్త్రవేత్త? *(DSC- 2008)*
1) పంచానన్ మహేశ్వరి 2) టి.ఎస్. వెంకట్రామన్ 3) బీర్బల్ సహానీ 4) ఎం.ఎస్. స్వామినాథన్

45. జంతు కణాలకు కణకవచం ఉండదని కనుగొన్న వారెవరు? *(DSC- 2008)*
1) రుడాల్ఫ్ విర్చోవ్ 2) థియోడర్ ష్వాన్ 3) లివెన్ హుక్ 4) లూయిస్ పాశ్చర్

46. ఒక శాస్త్రవేత్త తన పరిశోధనల కోసం HCl లాంటి ఆమ్ల మాధ్యమంలో కూడా నివసించగలిగే ఏకకణ జీవులను కనుగొన్నాడు. అవి ఏ రాజ్యానికి చెందినవి? *(TET- 2011)*
1) ప్రొటిస్టా 2) మొనీరా 3) ప్లాంటే 4) ఫంజై

47. పృష్ఠవంశం లేకుండా ఉండి అనేక వ్యాధులను వ్యాప్తి చేసే జంతువులు ఎక్కువగా ఏ వర్గానికి చెందుతాయి? *(TET- 2011)*
1) మమ్మేలియా 2) ఆర్థ్రోపొడ 3) ప్రోటోజోవా 4) నెమటోడ

48. జీవశాస్త్ర పరిశీలనలో శాస్త్రీయ విధానాన్ని అవలంబించిన వారెవరు? *(DSC- 2006)*
1) సర్ రోనాల్డ్ రాస్ 2) లూయిస్ పాశ్చర్ 3) అరిస్టాటిల్ 4) ఆంటోనీ వాన్ లివెన్ హుక్

49. 'మున్‌జెల్లి' ఏ వర్గానికి చెందింది? *(DSC- 2004)*
1) పొరిఫెర 2) టినోఫొర 3) ఇఖైనోడర్మట 4) నెమటోడ

50. 'స్లైమ్‌మోల్డ్స్' ఏ రాజ్యానికి చెందినవి? *(DSC- 2004)*
1) ఎనిమేలియా 2) ప్రొటిస్టా 3) ఫంజై 4) మొనీరా

సమాధానాలు

1) 3	2) 3	3) 2	4) 3	5) 3
6) 3	7) 1	8) 3	9) 2	10) 4
11) 3	12) 1	13) 1	14) 1	15) 3
16) 4	17) 3	18) 2	19) 1	20) 2
21) 1	22) 3	23) 1	24) 1	25) 3
26) 4	27) 3	28) 4	29) 4	30) 3
31) 2	32) 2	33) 3	34) 4	35) 3
36) 3	37) 2	38) 2	39) 1	40) 1
41) 3	42) 3	43) 4	44) 1	45) 2
46) 2	47) 2	48) 3	49) 2	50) 3



నాన్నా చెప్పవా

నీటిలో వేస్తే పేలే పదార్థాలు కూడా ఉంటాయా?



నీరు అన్ని రకాల మంటల్ని ఆర్పగల్గుతుందని చాలామంది అనుకుంటుంటారు. అలాగే నీటిలో ఏ పదార్థమూ మండదని కూడా భావిస్తుంటారు. కాని, ఇవి రెండూ నిజాలు కాదు.

నీటికి సంబంధించిన ఒక చిత్రమైన విషయమేమిటంటే ప్రతినీటి అణువు (H_2O)...ఒక ఆక్సిజన్, రెండు హైడ్రోజన్ పరమాణువులతో కలిసి రూపొందుతుంది. ఈ రెండు పదా ర్థాలూ వాయురూపంలో ఉన్నప్పుడు (విడివిడిగా) ఒకటి భగ్గున మండే స్వభావాన్ని (హైడ్రోజన్), మరొకటి భగ్గున మండించే స్వభావాన్ని చూపిస్తాయి. కాని, ఇవి రెండూ కలిసి నీటి అణువులుగా రూపొందినప్పుడు మాత్రం అలాంటి ధర్మాన్ని చూపించవు సరికదా, వివిధ రకాల మంటలను ఆర్పేందుకు కూడా ఉపయోగపడతాయి. మంటలను ఆర్పడం కోసం మనం వుపయోగించే నీరు ఆ మంటల నుంచి వేడిని లేక ఉష్ణశక్తిని గ్రహించి నీటి ఆవిరిగా మారిపోతుంది. దీని వల్ల మంటలు చల్లారి తగ్గుముఖం పడతాయి.


పెట్రోలు, కిరోసిన్ లాంటి కొన్ని పదార్థాలు నీటిలో ఉన్నప్పటికీ మండుతాయన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాంటి పదార్థాలు నీటిలో కలవకుండా, దానిపై తేలుతూ ఉండ టం వల్లనే ఇలాంటిది సాధ్యమవుతుంది. ఇకపోతే సోడియం, పొటాషియం, రుబీడియం, క్యాసియం వంటి కొన్ని క్షారలోహాలు నీటితో చాలా వేగంగా రసాయనిక చర్య జరుపుతాయి. దాని ఫలితంగా అలాంటి పదార్థాలను నీటిలో వేయగానే పేలుడు సంభవిస్తుంది. అందుకే, ఇలాంటిది జరగకుండా చూసేందుకై సోడియం, పొటాషియం లాంటి పదార్థాలని ఏదైనా తైలంలో భద్రపరుస్తారు.

అంకెలు కలపండి రంగులు వేయండి





ఈ రెండు బొమ్మల మధ్య 5 తేడాలు ఉన్నాయి. గుర్తించండి.



→ నుండి లోపలికి వెళ్లి → నుండి బయటకు రావాలి. దారి కనుక్కోండి.

మీకు తెలుసా?

సూర్యునికన్న మిగతా గ్రహాలు బాగా చిన్నవా?




ప్రస్తుతం మనం నివసిస్తున్న మన సౌరమండలానికి సంబంధించిన చాలా చాలా ఆశ్చర్యం కలిగించే అంశాలలో ఒకటేమిటంటే..... ఇందులో ఉన్న గ్రహాలు, ఉపగ్రహాలు, ఆస్టరాయిడ్లు (గ్రహశకలాలు), తోకచుక్కలు, నక్షత్ర ధూళి, ఇంకా ఇతర ఖగోళ పదార్థాలు–వీటన్నిటి ద్రవ్యరాశి కలిపి మొత్తం సౌర మండలం ద్రవ్యరాశిలో 1 శాతం కూడా లేదు. చాలా ఆశ్చర్యంగా అన్పిస్తుంది కదూ? అయినా ఇది నిజం.


సౌర మండలంలోని మొత్తం ఖగోళ నిర్మాణాల ద్రవ్యరాశిలో 99.86 శాతం కేవలం ఒక్క సూర్యుడిలోనే వుంది. అందుకే సూర్యుడి గురుత్వాకర్షణ శక్తి కొన్ని వేల కిలోమీటర్ల దాకా తన ప్రభావాన్ని చూపించగల్గుతోంది. మొత్తానికి మిగిలిన 0.14 శాతం ద్రవ్య రాశి మాత్రమే మిగిలిన అన్ని ఖగోళ పదార్థాలకు పంచబడింది.

సౌరమండలంలో సూర్యుడి ద్రవ్యరాశి పోగా మిగిలిన దాంట్లో మళ్లీ 71 శాతం ఒక్క గురుగ్రహంలోను, 21 శాతం ఒక్క శని గ్రహంలోనూ వుంది. అంటే సూర్యుణ్ణి పక్కన పెట్టగా మిగిలిన దాంట్లో 92 శాతాన్ని ఈ రెండు గ్రహాలే కైవసం చేసుకున్నాయన్న మాట. ఇదిపోగా మిగిలిన 8 శాతం ద్రవ్య రాశి...ఇతర గ్రహాలు, ఉపగ్రహాలు, తోకచుక్కలు, క్యూపర్‌బెల్ట్ వస్తువులు తదితర అన్ని ఖగోళ నిర్మాణాలకు పంచబడిందన్నమాట! బుధుడు, కుజుడు – ఈ రెండు గ్రహాల్లో ఉన్న పదార్థం కేవలం 0.1 శాతం మాత్రమే. భూమి ద్రవ్యరాశి దీనికి మరో 6 రెట్లు ఎక్కువ (0.6 శాతం). ఈ లెక్కన మన గ్రహాలు, ఉపగ్రహాలు వంటి వాటిని సూర్యుడితో పోలిస్తే అవి ఎంత చిన్నగా వుంటాయో, వాటిలో ఎంత తక్కువ పదార్థం వుంటుందో మీరే ఊహించుకోవచ్చు.

ఎడమవైపున ఉన్న బొమ్మను చూస్తూ కుడివైపున బొమ్మ గీయండి



పూరించండి





పైన కొన్ని బాక్స్‌లు, వాటి కింద కొన్ని బొమ్మలున్నాయి. ప్రతి బొమ్మ ఇంగ్లీషు పేరును మొదటి అక్షరంతో పజిల్‌ను పూర్తిచేయండి. పూర్తయ్యాక వచ్చే పదం మనకు ఎడమవైపున కనిపించే బొమ్మ ఇంగ్లీష్ పదం అవుతుంది. ట్రై చేయండి చూద్దాం!

జయశంకర్ భూపాలపల్లి
శుక్రవారం | జనవరి | 5 | 2018
సాక్షి

భూనిర్వాసితులతో చర్చలు సఫలం

- గజానికి రూ.1000 చెల్లించేందుకు ఆర్డీఓ అంగీకారం
- త్వరలో అవార్డు ప్రకటిస్తామని వెల్లడి

మల్హర్:

జెన్‌కో ప్రాజెక్టులో ఇళ్లు, ఇంటి స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు సంబంధించి ఇంటి స్థలానికి ధర నిర్ణయించడానికి ఆర్డీఓ వీరబ్రహ్మాచారి గురువారం కాపురం నిర్వాసితులతో జరిపిన చర్చలు సఫలమయ్యాయి. మండలంలోని తాడిచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కాపురం గ్రామంలో జెన్‌కో ప్రాజెక్టులో ఇళ్లు, స్థలాలు సేకరించిన నిర్వాసితులకు తీసుకున్న స్థలానికి ధర నిర్ణయించడానికి ఆర్డీఓ వీరబ్రహ్మాచారి నిర్వాసితులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ తాము సర్వం కోల్పోతున్నామని, తమకు న్యాయం చేయాలని ఆర్డీఓను కోరారు. అటవీ ఉత్పత్తులే తమ జీవనాధారమని వారు వాపోయారు. గజానికి రూ.2000 చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. కాగా ఆర్డీఓ మాట్లాడుతూ మార్కెట్ విలువ ప్రకారం రూ.300 చెల్లిస్తామని పేర్కొనడంతో నిర్వాసితులు అంగీకరించలేదు. అనంతరం రూ.600 చెల్లిస్తామని మరోమారు ప్రకటించిన ఒప్పుకోకపోవడంతో చివరిగా రూ.900 చెల్లిస్తామని ప్రకటించారు. రూ.100 కలిపి మొత్తం రూ.1000 చెల్లించాలని నిర్వాసితులు ఆర్డీను కోరగా ఆయన అంగీకరించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ త్వరలోనే అవార్డును ప్రకటిస్తామని స్పష్టం చేశారు. అలాగే అర్హులైన వారికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి ఆర్ అండ్ ఆర్ ప్రకటిస్తామన్నారు. ప్రాజెక్టు కింద 125 ఇళ్లను సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఆర్ఐ ప్రదీప్‌కుమార్, జెన్‌కో ఈఈ శ్రీధర్, ఏఈ అనిల్, ఎంఆర్ కంపెనీ సీపీఆర్ఓ వెంకట్, వీఆర్ఓ రాములు, వీఆర్ఏ ఆనంద్, మాజీ జెడ్పీటీసీ శీలం లక్ష్మయ్య, నిర్వాసితులు నారాయణ, మహాంకాళి, బడిది మల్లేష్, కేసారపు రాజ య్య, గుమ్మడి రవీందర్, సాంబయ్య, గట్ల సత్యనారాయణ పాల్గొన్నారు.


ఆర్డీఓతో మాట్లాడుతున్న నిర్వాసితులు


సమావేశంలో పాల్గొన్న నిర్వాసితులు

రాష్ట్ర 4వ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయ దంపతుల ప్రతిభ



మెడల్స్ గెలిచిన దంపతులు

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న కే.సారంగపాణి, పద్మ దంపతులు మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్‌లో జరుగుతున్న రాష్ట్ర 4వ మాస్టర్స్ అథ్లెటిక్ పోటీల్లో మెడల్స్ సాధించారు. గురువారం అండర్–35 విభాగంలో కే. పద్మ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో బంగారు పతకం, 100 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో సిల్వర్ పతకాలు సాధించారు. సారంగపాణి అండర్–40 విభాగంలో 800 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో సిల్వర్, 400 మీటర్ల పరుగులో ద్వితీయ స్థానంలో సిల్వర్ మెడల్స్ సాధించారు.

శానిటేషన్ పనులను పరిశీలించిన అధికారులు


మేడారంలో పనులను పరిశీలిస్తున్న మునిసిపల్ అధికారులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర సందర్భంగా భక్తుల సౌకర్యార్థం చేపడుతన్న పారిశుద్ధ్య పనులను మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. కార్పొరేషన్ ఏఎండీ వందనకుమార్, ఏడీఎం అనురాధ, రీజినల్ డైరెక్టర్ జాన్‌శాంసన్, భూపాలపల్లి మునిసిపల్ కమిషనర్ రవీందర్‌యాదవ్ కలిసి మేడారం సందర్శించారు. ఈ సందర్భంగా మేడారంలోని జంపన్నవాగు, చిలుకలగుట్ట, అమ్మవార్ల గద్దెల ప్రాంగణం పరిసరాల్లో, రోడ్ల వెంట చేపట్టనున్న శానిటేషన్ పనుల ఏర్పాట్లను పరిశీలించారు.

షాపుల నిర్వహణకు ఆరుగురితో కమిటీ

పీఓ చక్రధర్‌రావు

ఏటూరునాగారం: మేడారం జాతరలో ఆదివాసీ నాయకులకు కేటాయించే షాపుల నిర్వహణకు ఆరుగురితో కమిటీ ఏర్పాటు చేసినట్లు ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం సమావేశ మందిరంలో పూజారులు, తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులతో గురువారం పీఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. జాతరలో బెల్లం, కొబ్బరి, మద్యం, కోళ్ల షాపుల కోసం సంఘాలకు అప్పగించేందుకు అన్నిసంఘాల నాయకులు ఐక్యంగా ఏకాభిప్రాయానికి రావాలన్నారు. అలా వచ్చి జాబితాను తమకు అందించాలన్నారు. తుదిజాబితాను అందించిన వారికి లైసెన్స్‌లను మంజూరు చేస్తామన్నారు. జాతరలో అన్ని సంఘాల నాయకులు సమన్వయంతో అధికారులకు సహకరించి జాతరను విజయవంతం చేయాలన్నారు. కమిటీలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, పొడెం రత్నం, మడి సాయిబాబు, కొర్నిబెల్లి రాఘవరావు, పులిశె బాలకృష్ణ, కోడి సతీష్‌ను ఎన్నుకున్నారు. వారి ఆధ్వర్యంలో షాపుల కేటాయింపు, జాతరలో సంఘాల ద్వారా నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ కాక లింగయ్య కమిటీ గౌరవ సలహాదారుడిగా వ్యవహరించనున్నారు. జాతర విజయవంతంలో అంతా భాగస్వామ్యం కావాలని పీఓ కోరారు. సమావేశంలో ములుగు డీఎస్పీ రాఘవేందర్‌రెడ్డి, సంఘాల నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పీఓ చక్రధర్‌రావు

కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



ఎమ్మెల్సీ, టీఆర్ఎస్ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు శంభీపూర్‌రాజు జన్మదినం సందర్భంగా ఆయన గురువారం మంత్రి కేటీఆర్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయన వెంట ఎంపీ బాల్క సుమన్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

అభినందించిన ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు


దుబాయ్‌కి ఎంపికైన గిరిజన విద్యార్థులు

ఏటూరు నాగారం: మండలంలోని తెలంగాణ గురుకుల బాలుర పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముగ్గురు గిరిజన విద్యార్థులు దుబాయిలో జరగబోయే అంతర్జాతీయ కరాటే పోటీలకు ఎంపికయ్యారు. దీంతో వారిని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో పీఓ చక్రధర్‌రావు అభినందించారు. వీరు ముగ్గురు ఖండాలలో కరాటేలో శిక్షణ పొందినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ గట్ల సురేందర్ తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో పదో తరగతి చదువుతున్న భూక్య గణేష్, పొడెం హర్షిత్, భూక్య రమేష్ ఉన్నారురు. వారు దుబాయ్ వెళ్లడానికి, ఇతర ఖర్చుల మొత్తం తెలంగాణ గురుకులం నిధులు కేటాయిస్తామని గురుకులం సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సురేందర్ వెల్లడించారు. ఏజెన్సీ ప్రాంతం నుంచి విదేశాలకు వెళ్లడం గర్వంగా ఉందని పీఓ అన్నారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అబ్బు, వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అనాథ బాలలకు బర్త్ డే

- బాల్య వివాహాలను అడ్డుకోవాలి
- బాలవికాస ప్రోగ్రాం ఆఫీసర్ లత

ఆత్మకూరు(పరకాల): గీసుకొండ మండలం జాతీయ ఆదర్శ గ్రామం గంగదేవిపల్లిలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న మహిళా సంఘాల వారు అనాథ బాలలకు బర్త్ డే నిర్వహించారు. ఆరు మండలాల నుంచి వచ్చిన మహిళలతో గురువారం గ్రామంలో సానుభూతి దినోత్సంగా మహిళా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖులతో పాటు మహిళా సంఘాల్లోని పలువురు సభ్యులు అనాథ బాలల చదువులు, పెంపకానికి అవసరమైన ఖర్చు భరించడానికి ముందుకు వచ్చారు. అనంతరం కేక్ కట్ చేసి పిల్లల పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలవికాస ప్రోగ్రాం ఆఫీసర్ లత మాట్లాడుతూ మహిళలు శక్తిగా ఎదిగి బాల్య వివాహాలను అడ్డుకోవాలని, వితంతువులను ఆదరించాలని, వృద్ధులను ఆదుకోవాలని కోరారు. సంరక్ష ఆస్పత్రి డాక్టర్ మోహన్‌రావు, కళ్యాణి ఆస్పత్రి ప్రతినిధి స్వామి, గంగదేవిపల్లి సర్పంచ్ ఇట్ల శాంతి, ఉప సర్పంచ్ కూసం రాజమౌళి, మేం సైతం ప్రోగ్రాం ఫౌండర్ రాజు, దామెదర్, బాలవికాస ప్రతినిధులు భాగ్య, శ్రీదేవి, రమ, రాజ్‌కుమార్, లింగమూర్తి, బ్యాంకు మేనేజర్లు పాల్గొన్నారు.


బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న చిన్నారులు

కాళ్లకు కర్రలతో నడక

చెన్నారావుపేట(నర్సంపేట): 'కూటి కోసం కోటి విద్యలు' అన్నట్లు ఓ వ్యక్తి రెండు పొడవాటి కర్రలను కాళ్లకు కుట్టుకుని నడుస్తుండగా అందరూ ఆశ్చర్యంగా చూస్తున్నారు. మహారాష్ట్రకు చెందిన సంబీర్ అనే యువకుడు ఇలా గురువారం మండల కేంద్రంలో ప్రదర్శన ఇచ్చాడు. స్థానికులు తోచిన సాయం అందజేశారు.



ఇంకెన్నాళ్లకు కమిటీ..?

- పదవుల కోసం ఎదురుచూస్తున్న టీబీజీకేఎస్ శ్రేణులు
- ఎన్నికలు జరిగి మూడు నెలలు గడిచినా నాయకత్వాన్ని ప్రకటించని వైనం
- నియామకం కోసం సీఎం ఇంటెలిజెన్స్, విజిలెన్స్ నివేదికలు తెప్పించుకున్నారని ప్రచారం



రామకృష్ణాపూర్(మంచిర్యాల జిల్లా): సింగరేణిలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు మూడు నెలలు గడిచాయి. ఇంకా టీబీజీకేఎస్ కమిటీని నియమించలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి, టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇటీవల టీబీజీకేఎస్ బాధ్యులను హైదరాబాద్‌కు పిలిపించారు. దీంతో నాయకత్వం ఖరారైనట్టేనని అందరూ భావించారు. కానీ రాష్ట్ర రాజధానిలో పది రోజులు పడిగాపులు కాసిన టీబీజీకేస్ నాయకులను సీఎం కలువలేదు. దీంతో నిరాశతో ఇంటిబాట పట్టారు. గత నెలలో తెలుగు మహాసభల కారణంగా సీఎం కలువలేకపోతున్నారని, సభల అనంతరం కలుస్తారని కొందరు నాయకులు పేర్కొన్నారు.మహాసభలు ముగిసి పదిహేను రోజులు గడిచాయి. కానీ ఇంకా అధినేత నుంచి పిలుపు రావడంలేదు. దీంతో టీబీజీకేఎస్ శ్రేణుల్లో ఒకింత అసహనం కలుగుతోంది.

కమిటీలో కొత్త వారికి అవకాశం...?

తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం నూతన కమిటీలో కొత్త వారికి స్థానం కల్పించే సూచనలు ఉన్నాయని సీనియర్ నేతలు చెబుతున్నారు. రాష్ట్ర కమిటీలో పెద్దగా మార్పులు ఉండకపోయిన ఏరియా ఉపాధ్యక్ష పదవుల్లో భారీ మార్పులు ఉంటాయని అంటున్నారు. ఎమ్మెల్సీ పదవిలో ఉన్న వెంకట్రావ్ టీఆర్ఎస్‌లో చేరడంతో ఆయనకు యూనియన్ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు. ఇతర కీలక నేతలు కెంగర్ల మల్లయ్య, రాజిరెడ్డిలను మార్చే పరిస్థితులు కనిపించడం లేదని తెలుస్తోంది. కీలకమైన వీరిని పక్కన పెడితే ప్రత్యామ్నాయ నేతలెవరూ లేరు. ఈ నేపథ్యంలో రాష్ట్ర కమిటీలోని ప్రధాన నాయకుల్ని గాకుండా ఏరియా ఉపాధ్యక్షులనే మార్చే యోచనలో అధినేత ఉన్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు ముందు చోటు చేసుకున్న పరిణామాలు, నాయకుల మధ్య పొడసూపిన విబేధాల కారణంగా ఏరియా ఉపాధ్యక్షుల ఎంపికను ప్రతిష్టాత్మకంగా తీసుకోనున్నట్లు సమాచారం. ఉపాధ్యక్ష పదవుల్లో కొత్త తరానికి అంటే యువకులకు ప్రాధాన్యత ఇచ్చే సూచనలు ఉన్నాయని అంటున్నారు.

రాజకీయ కారణాలు కూడా..?

మాజీ ఎంపీ జి.వివేక్ తన అనుచర వర్గానికి టీబీజీకేఎస్‌లో పెద్దపీట వేసేందుకు యత్నిస్తున్నారని తెలుస్తోంది. సముచిత స్థానాలు లభించేలా పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఎంపీ బాల్క సుమన్ కూడా అదే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో శ్రీరాంపూర్ ఏరియాలో బాల్క సుమన్, రామగుండంలో వివేక్ ప్రత్యేకంగా దృష్టి పెట్టి టీబీజీకేఎస్ విజయానికి కృషి చేశారు. ఈ క్రమంలోనే తమ అనుచరులకు పదవులు ఇప్పించేందుకు కృషి చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. ఇటీవల ఇతర యూనియన్ల నుంచి టీబీజీకేఎస్‌లో చేరిన వారికి సముచిత ప్రాదాన్యం ఇవ్వాలని సీఎం భావిస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాల క్రమంలోనే పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ జాప్యం జరుగుతోందని యూనియన్ నేతలు పేర్కొంటున్నారు.

మందమర్రి నుంచి ఫిర్యాదు...

టీబీజీకేఎస్ సంస్థలోని 9 ఏరియాల్లో గెలవగా, మందమర్రి, భూపాలపల్లిలో మాత్రం ఓడిపోయింది. దీనిపై కొందరు నాయకులు సీఎంకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. మొన్నటి వరకు ఉపాధ్యక్షులుగా ఉన్న నాయకుడితో పాటు గతంలో ఈ పదవికి పోటీ పడిన పార్టీ నాయకుడి పరస్పర విభేదాల వల్లే యూనియన్ ఓటమికి దారితీసిందన్నది ఫిర్యాదులో పేర్కొనట్లు సమాచారం. ఏదేమైనా టీబీజీకేఎస్ కమిటీ నియామకంలో జాప్యం చేయకుండా సీఎం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంటెలిజెన్స్, విజిలెన్స్ నివేదికల ఆధారంగా..

టీబీజీకేఎస్ కమిటీ కూర్పు కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పటికే ఇంటెలిజెన్స్, విజిలెన్స్ శాఖల నివేదికలు తెప్పించుకున్నట్లు సమాచారం. ఎన్నికల నాటి నుంచి ఇప్పటి వరకు అన్ని ఏరియాల్లో ఉన్న వాస్తవ పరిస్థితిని నివేదికల ఆధారంగా పరిగణనలోకి తీసుకుంటారని సీనియర్లు చెబుతున్నారు. పైరవీలు చేసే నాయకులు, పనుల కోసం కార్మికుల నుంచి డబ్బులు తీసుకున్న నేతలపై సీఎం కేసీఆర్ ఆగ్రహంగా ఉన్నవిషయం తెలిసిందే.

లక్ష్యసాధనకు సమష్టిగా సాగాలి

డైరెక్టర్లు భాస్కర్‌రావు, చంద్రశేఖర్



ప్రణాళిక మ్యాప్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్లు

యైటింక్లయిన్‌కాలనీ(పెద్దపల్లి జిల్లా): వార్షిక బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలని సింగరేణి డైరెక్టర్లు భాస్కర్‌రావు, చంద్రశేఖర్ సూచించారు. గురువారం ఆర్జీ–2 ఏరియా జీఎం కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియాలో ప్రస్తుతం చేరుకున్న లక్ష్యాలు, ఇంకా చేరుకోవాల్సిన లక్ష్యాలను వారు అధికారులతో చర్చించారు. ఆర్థిక సంవత్సరం చివరినాటికి వంద శాతం ఉత్పత్తి సాధించేలా ముందుకు సాగాలన్నారు. ఓసీపీ–3లో నూతనంగా వచ్చిన భారీ యంత్రాల పనితీరు, భూగర్భగనుల్లో ఇటీవల కొనుగోలు చేసిన ఎస్‌డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల పనితీరు తెలుసుకున్నారు. సంస్థలోనే మెగా ఓసీపీగా రూపాంతరం చెందిన ఓసీపీ–3 ప్రాజెక్టులో అదేస్థాయిలో ఉత్పత్తి సాధించాలన్నారు. ఈసమావేశంలో ఆర్జీ–2 జీఎం విజయబాబు, అధికారులు పాల్గొన్నారు.

ఉత్పత్తి సామర్థ్యం పెంచాలి


కోల్‌బెల్ట్ (భూపాలపల్లి జిల్లా): ఏరియాలోని భూగర్భగనుల్లో ఉత్పత్తి సామర్థం పెంచాలని సింగరేణి డైరెక్టర్‌లు భాస్కర్‌రావు(ప్లానింగ్ అండ్ ప్రాజెక్టు), చంద్రశేఖర్(ఆపరేషన్స్) ఆదేశించారు. భూపాలపల్లి జీఎం కార్యాలయంలో గురువారం జనరల్ మేనేజర్ పి కొండయ్య అధ్యక్షతన నిర్వహించిన ఏరియాస్థాయి సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. గత నెలలో కేటీకే–1లో 71 శాతం, కేటీకే –5లో 64 శాతం, కేటీకే–6లో 63 శాతం, కేఎల్‌పీలో 56 శాతం మాత్రమే ఉత్పిత్తి సాధించారంటూ అసంతృప్తి వ్యక్తం చేశారు. 2016 డిసెంబర్‌తో పోల్చితే తక్కువగా నమోదు చేయటం సరికాదన్నారు. మార్చి, ఏప్రిల్ నాటికి కొత్తవి 20 ఎస్‌డీఎల్ యంత్రాలను అందించేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. సింగరేణి యాజమాన్యం ఈ ఆర్థిక సంవత్సరంలో గడచిన 9 మాసాల్లో బొగ్గు ఉత్పత్తి శాతంను దృష్టిలో ఉంచుకొని కార్మికులకు ప్రత్యేక ఇన్సెంటీవ్‌ను అమలు చేస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్‌లు సూచించారు. ఈసమీక్షలో ఎస్ఓటుజీఎం పద్మనాభరెడ్డి, గ్రూపు ఆఫ్ ఏజంట్‌లు వెంకట్రామిరెడ్డి, రఘుపతి, టీవిరావు, గనుల మేనేజర్‌లు డానీల్ కుమార్, విజయప్రసాద్, గోపాల్‌సింగ్, రవీంద్రనాథ్ ఠాకూర్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



కేటీకే 5 మ్యాప్‌ను పరిశీలిస్తున్న అధికారులు

అలరించిన బొమ్మల కొలువు

కోల్‌బెల్ట్(భూపాలపల్లి జిల్లా): త్వరలో జరగనున్న మేడారం జాతరను పురస్కరించుకుని భూపాలపల్లి సింగరేణి లేడీస్ క్లబ్ ఆద్వర్యంలో గురువారం సాయంత్రం మంజూర్ నగర్ బంగ్లాస్ ఏరియాలో బొమ్మల కొలువు నిర్వహించారు. వనదేవతలు కొలువుదీరినట్లుగా తీర్చిదిద్దారు. సేవా అధ్యక్షురాలు పి క్రిష్ణవేణి కొండయ్య, లేడీస్ క్లబ్ కార్యదర్శి సుజాత రఘుపతి, ఉమా భాస్కర్‌రావు, పద్మ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సమ్మక్క-సారలమ్మ గద్దెలు



దేవతల విగ్రహాల వద్ద అతిథులు



బొమ్మల కొలువులో ఏర్పాటు చేసిన బొమ్మలు

ఇల్లెందు సీహెచ్‌పీకి రూ. లక్ష ప్రోత్సాహకం

ఇల్లెందుఅర్బన్(భద్రాద్రి కొత్తగూడెం): సింగరేణి ఇల్లెందు ఏరియా సీహెచ్‌పీ వార్ఫ్‌లోడింగ్ కార్మికులు డిసెంబర్ నెలలో 100 రేక్‌ల బొగ్గును రవాణా చేసి సింగరేణి చరిత్రలోనే రికార్డు సృష్టించారు. సుమారు 4 లక్షలకు పైగా టన్నుల బొగ్గును రైల్వే మార్గం ద్వారా రవాణా చేశారు. సీహెచ్‌పీ కార్మికుల కష్టాన్ని గుర్తించిన సంస్థ సీఎండీ శ్రీధర్ సీహెచ్‌పీ కార్మికులకు రూ.లక్ష నగదు ప్రోత్సాహాన్ని ప్రకటించారు. ఏరియా జీఎం కందుకూరి లక్ష్మీనారాయణ, ఎస్వోటుజీఎం మల్లెల సుబ్బారావు, సీహెచ్‌పీ డీఈ క్రిష్టఫర్, క్వాలీటీ అధికారి పాషా కార్మికులను అభినందించారు.

హలో సాక్షి..
కాటారం : 9494784542,
కాళేశ్వరం : 9885896986,
మల్హర్ : 9885388383,
మహాముత్తారం : 9666929757,
పలిమెల : 9441731235,
మహదేవపూర్: 8008252171
9440660202

సాక్షి జయశంకర్
శుక్రవారం | జనవరి | 5 | 2018

మన కాటారం


కోతుల బెడదను అరికట్టాలి



కాళేశ్వరం: గ్రామంలో కోతులు బీభత్సం చేస్తున్నాయి. భక్తుల చేతుల్లోంచి ఆహార పదార్థాలు లాక్కొని తింటున్నాయి. ఇండ్లపై పెంకులు పీకేస్తున్నాయి. చిన్నారులను,మహిళలను గాయపరుస్తున్నాయి. గ్రామంలో కోతులను పంచాయతీ అధికారులు నివారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సప్ చేయండి..



మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు ప్రచురిస్తాం.

మా నంబర్ : 9963302807

లోకల్ వాయిస్

ఏటీఎం ఏర్పాటు చేయాలి



కాళేశ్వరం: కాళేశ్వరం పరిధిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకులో ఏటీఎంను ఏర్పాటు చేయాలి. ఏటీఎం లేక భక్తులు, స్థానికులు, కాళేశ్వరం ప్రాజెక్టు ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంకు అధికారులు ఏటిఎం ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. త్వరగా ఏటిఎం ఏర్పాటు చేసి వినియోగదారులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– షకీల్, కాళేశ్వరం

రికార్డుల అప్‌లోడింగ్ త్వరగా పూర్తి చేయాలి

ఆర్డీఓ వీరబ్రహ్మచారి

కాటారం: భూ రికార్డులకు సంబంధించి ఆన్‌లైన్‌లో అప్‌డేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని భూపాలపల్లి ఆర్డీఓ వీరబ్రహ్మచారి రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎల్ఆర్‌యూపీపై తహసీల్దార్ శ్రీనివాసాచార్యతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పహాణీల నమోదును వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, ఆర్ఐ ప్రవీణ్ ఉన్నారు.

కొనసాగుతున్న ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

కాటారం: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన రిలే దీక్షలు గురువారం రెండో రోజుకు చేరుకున్నాయి. ఎమ్మార్పీఎస్ నాయకుల దీక్షకు తుడుందెబ్బ నాయకులు సంఘీభావం తెలిపారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొడ్డు ఆశయ్య, జిల్లా కార్యదర్శి బొడ్డు రాజబాబు, మాజీ అధ్యక్షుడు అక్కపాక మలయ్య, ఆత్మూరి బాలరాజు, ముత్తయ్య, తుడుందెబ్బ నాయకులు బీసుల లక్ష్మయ్య, సుంకరి మల్లేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అంతరిస్తున్న పశుసంపద

- తీవ్రమైన పశుగ్రాసం కొరత
- వెలవెలబోతున్న పశువుల కొట్టాలు
- ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం వైపు రైతుల మొగ్గు

మహాముత్తారం:

గ్రామాల్లో పశుసంపద కనుమరుగైపోతుంది. గతంలో ఒక్కో రైతు ఇంట్లో ఆవులు, ఎద్దులు, లేగదూడలు పదుల సంఖ్యలో ఉండేవి. ఇవికాక పాడిగేదెలు కూడా ఉండేవి. ఒకప్పుడు అరక దున్నడానికే సామాన్య రైతుల కుటుంబంలో ఆరు శాల్తీల ఎద్దులు ఉండేవి. అదే పెద్ద మోతుబరి రైతు అయితే పది అరకల వ్యవసాయం చేసేవాడు. అంటే ఇరవై శాల్తీల ఎద్దులు ఉండేవి. అరకలు దున్నడానికి ఎద్దులను మేపడానికి పది మంది జీతగాళ్లు ఉండేవారు.

ఏవీ ఆనాటి కోటేరు చప్పుళ్లు..

ఉదయం నాలుగు గంటల నుంచి అరకలు, కోటేరులు వేసుకొని గ్రామాల్లోని వీధుల వెంట వెళ్లుంటే ఆ అరకలు, ఎద్దుల గజ్జెల చప్పుళ్లకు మహిళలు నిద్రలేచి వాకిలి ఊడ్చి కల్లాపి చల్లేవారు. అలాంటి వాతవరణం ప్రస్తుతం మచ్చుకైనా కనిపించటం లేదని, అప్పటి అనుభవాలు నెమరు వేసుకుంటున్నారు పల్లె ప్రజలు. గ్రామాల్లో మోతుబరి రైతు కుటుంబాల్లో పాడిగేదెలు పది నుంచి ఇరవై వరకు ఉండేవి. పొద్దున్నే లేచి పాలు పితకడం, కవ్వంతో మజ్జిగ చిలకడం లాంటి పనులు ఉండేవి. గేదెలు ఈనినప్పుడు వరుసగా పది రోజులవరకు జున్న దొరికేది. అప్పట్లో పెరుగు, జున్నుల్లో ఉన్న మజానే వేరని ప్రజలుఅంటున్నారు. యాంత్రీకరణ వల్ల అలాంటి సన్నివేశాలు గ్రామాల్లో కన్పించడం లేదు.



పశువులు లేక ఖాళీగా ఉన్నకొట్టం

యంత్రాలతో వ్యవసాయం

క్రమ క్రమంగా రైతులు ఎద్దుల అరకలతో దున్నడం మానివేసి యంత్రాల సాయంతో వ్యయసాయం మొదలు పెట్టారు. దీంతో పశుపోషణకు ఆదరణ కరువైంది. దీనికితోడు పశుగ్రాసం దొరకక పోవడం కూడా పశుసంపద తగ్గడానికి కారణమైంది.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు(ఫైల్)

యాంత్రీకరణ వల్లే..



గతంలో ఎద్దులతో అరకలు కట్టి వ్యవసాయం చేసేవాళ్లం. ఇంట్లో ఎప్పుడు పాడి గేదెలు ఉండేవి. ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ట్రాక్టర్లతో వ్యవసాయం చేయక తప్పడం లేదు.

–ఓలపు శంకర్‌పటేల్, రైతు, మీనాజీపేట

అభివృద్ధిని చూసే పార్టీలో చేరికలు

మంథని ఎమ్మెల్యే పుట్ట మధు

కాటారం/మహాముత్తారం: టీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఆయా పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నట్లు మంథని ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. మహాముత్తారం మండలం రేగులగూడెంకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు భూస దేవేందర్‌రెడ్డితో పాటు మరి కొంత మంది కాంగ్రెస్ నాయకులు కాటారం జెడ్పీటీసీ సభ్యుడు చల్ల నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పుట్ట మధు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. నూతనంగా చేరిన వారికి ఎమ్మెల్యే కండువాను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మహాముత్తారం పీఏసీఎస్ చైర్మన్ లక్కిరెడ్డి నర్సింహారెడ్డి, కుడుదుల రాజబాబు, భూపెల్లి రాజు, లక్కిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గుడిపాటి రమేశ్‌రెడ్డి, బానయ్య పాల్గొన్నారు.



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

మండలంలోని దేవరాంపల్లిలో ఇటీవల విద్యుత్ షాక్‌తో గుడిపాటి లోకేశ్వర్‌రెడ్డి మృతి చెందగా ఆయన కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వంటావార్పు

మహదేవపూర్: పార్లమెంట్‌లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ నాయకులు గురువారం మహదేవపూర్‌లో వంటావార్పు కార్యక్రమం చేపట్టి నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు తూడిచర్ల దుర్గయ్య ఆధ్వర్యంలో 363 జాతీయ రహదారిపై మహదేవపూర్‌లోని కాళేశ్వరం ఆర్చిగేటు క్రింద వంటలు చేశారు. నాయకులు రోడ్డుపైనే బోజనాలు చేయడంతో వాహనాలు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. దీంతో ఎస్సై ఉదయ్‌కుమార్ అక్కడికి చేరుకొని వారితో చర్చించి నిరసన కార్యక్రమాన్ని విరమింపజేశారు. దర్మయ్య, బానయ్య, సమ్మయ్య, రవితేజా, మధుకర్, పవన్, ప్రశాంత్‌కుమార్, గట్టయ్య తదితరులు పాల్గొన్నారు



రోడ్డుపైనే భోజనాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

న్యూస్ బాక్స్

కొనసాగుతున్న గ్రామ సభలు

మల్హర్: మండలంలోని తాడిచర్ల, చిన్నతూండ్ల, కొండంపేట గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో ఆయా శాఖల అధికారుల అధ్వర్యంలో గురువారం గ్రామ సభలు నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన, చేపట్టాల్సిన పనులను గ్రామస్తులకు వివరించారు. తహీల్దార్ సురేష్, ఏపీఎం కమల, సర్పంచ్‌లు మోహన్‌రావు, పోటు ప్రభాకర్, కోట లావణ్య, ఎంపీటీసీ తిర్రి సమ్మయ్య, ఈఓఆర్డీ శంకర్‌రావు, కార్యదర్శి రాము, ఐకేపీ సీసీ రవి, ఆశాలు పాల్గొన్నారు.

కలెక్టర్ బదిలీని నిలిపివేయాలి

మల్హర్: కలెక్టర్ ఆకునూరి మరళి బదిలీని ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని మంథని నియోజకవర్గం యువజన సంఘం ఉపాధ్యక్షుడు మండల రాహుల్ ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. ఈ మేరకు రాహుల్ మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మురళి అటవీ ప్రాతంలో ఇంటి, ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించే వారన్నారు. కొత్త జిల్లాను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన కలెక్టర్‌ను ప్రభుత్వం అనతికాలంలో బదిలీ చేయడం సరైనది కాదన్నారు.

9న మండల సర్వసభ్య సమావేశం

కాటారం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 9న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించలపెట్టినట్లు ఎంపీపీ తైనేని స్వప్న, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ మల్లిఖార్జున్‌రెడ్డి తెలిపారు. మండలంలో గత మూడు నెలలుగా చేపట్టిన అభివృద్ధి పనులు, నిధుల మంజూరు, చేపట్టాల్సిన పనులపై ఈ సమావేశంలో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సంబంధించిన అధికారులు తమ శాఖల వారిగా నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.



మన కాటారం
సాక్షి జయశంకర్
శుక్రవారం | జనవరి | 5 | 2018

న్యూస్ బాక్స్

ప్రతి ఆదివారం సిరొంచ నుంచి మేడారం బస్సులు

కాళేశ్వరం: మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు సిరొంచ నుంచి మేడారం వరకు ప్రతి ఆదివారం భూపాలపల్లి డిపో బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ రఘు తెలిపారు. గురువారం ఆయన మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో విలేకర్లతో మాట్లాడారు. భక్తుల సౌకర్యార్థం జాతర ముందు అమ్మవార్లను దర్శించుకునే భక్తుల కోసం ప్రతి ఆదివారం ఉదయం సిరొంచ లో 10గంటలకు బస్సు ప్రారంభం అవుతుందని తెలిపారు.

ఆర్థిక సాయం

కాటారం: మండలంలోని దేవరాంపల్లిలో ఇటీవల విద్యుత్ షాక్‌తో గడిపాటి లోకేశ్వర్ రెడ్డి మృతి చెందగా.. అతడి కుటుంబాన్ని గురువారం గోదావరిఖని వ్యాన్ ఓనర్స్, డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు రూ.36, 200 ఆర్థిక సాయం అందజేశారు. కాటారం లారీ అండ్ వ్యాన్ అసోసియేషన్ తరుపున రూ.1500 ఆర్థిక సాయం అందజేశారు. దాసరి సత్యనందం, నేరెళ్ల రవీందర్, ఆనంద్, జనార్దన్, రాజుబాయ్, మురళి, సంపత్, రమేశ్, సత్తి, శంకర్ పాల్గొన్నారు.

శరవేగంగా గ్రావిటీ కాల్వ నిర్మాణ పనులు



కాళేశ్వరం: మహదేవపూర్ మండలంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు లోని గ్రావిటి కాల్వ పనులు శరవేగంగా నడుస్తున్నాయి. కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి అన్నారం బ్యారేజీ వరకు అడవి మార్గంలో 13.2 కిలోమీటర్ల దూరం 330 హెక్టార్లలో గ్రావిటీ కాల్వ పనులను సంబంధిత కాంట్రాక్టర్ చేయిస్తున్నారు. గత నెలలో మంత్రి హరీష్‌రావు కాల్వ పనులను పరిశీలించి వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. దీంతో పనులు రాత్రి, పగలు తేడా లేకుండా నడుస్తున్నాయి. కాల్వ పనుల దృశ్యాలు సింగరేణి ఓపెన్ కాస్టులను తలపిస్తున్నాయి.

'మన ఊరు- మన ఎమ్మెల్యే' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్

మహాముత్తారం: ఈనెల 7 నుంచి మండలంలో 'మన ఊరు–మన ఎమ్మెల్యే' కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మార్క రాముగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన టీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో విడత 'మన ఊరు మన ఎమ్మెల్యే' కార్యక్రమం ఈ నెల 7న మండలంలోని నిమ్మగూడెం గ్రామంలో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు ప్రారంభించి మహాముత్తారంలో ముగించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీఆర్ఎస్ నాయకులు అందరు కలిసికట్టుగా పనిచేసి విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండ వెంకటస్వామి, జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి, టీఆర్ఎస్ నాయకులు బొబ్బిలి వెంకటయ్య, మాదరి మహేష్, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన టీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

కాటారం: లారీ ఢీ కొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలపాలైన సంఘటన గురువారం 353(సీ) జాతీయ రహదారిపై మండలంలోని మద్దులపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రంలోని దుబ్బగూడెంకు చెందిన గంట రాజబాబు భూపాలపల్లి నుంచి కాటారం వైపు వస్తుండగా వెనకాలే వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో రాజబాబు వాహనంపై నుంచి ఎగిరి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రాజబాబు కాలు విరగడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇది గమనించిన స్థానికులు 108 ద్వారా చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై–2 జహీర్‌ఖాన్ సందర్శించి వివరాలు సేకరించారు.

గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

కాటారం: అఖిల గాండ్ల తెలికుల సంక్షేమ సంఘం కాటారం డివిజన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2018 నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం సుద్దికల్లో మంథని ఎమ్మెల్యే పుట్ట మధు చేతులమీదుగా ఆవిష్కరించినట్లు ఆ సంఘం డివిజన్ గౌరవ అధ్యక్షుడు నిడిగొండ సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు నిడిగొండ మైసర్‌బాబు, ప్రధాన కార్యదర్శి వెన్నంపల్లి మహేశ్, ఉపాధ్యక్షుడు సర్వ అంజయ్య, కోశాధికారి వెన్నంపల్లి సుధాకర్, కార్యదర్శులు నిడిగొండ చెన్నకేశవ్, పిలుమరి సంపత్, నిడిగొండ దేవేందర్, సలహాదారులు నిడిగొండ రాజు, శంకరయ్య, మల్లయ్య, పాల్గొన్నారు.

ఎస్టీ ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయొద్దు

తహసీల్దార్‌కు 'తుడుందెబ్బ' నాయకుల వినతి

కాటారం: లంబాడాలు, సుగాలీలు, బంజారాలకు ఎస్టీ ధృవీకరణ పత్రాల మంజూరు నిలిపి వేయాలని కోరుతూ గురువారం ఆదివాసీ హక్కుల పోరాట సమితి(తుడుందెబ్బ) నాయకులు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాసాచార్యకు వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ జాబితాలో లంబాడాల తొలిగింపు వివరణకు సంబంధించిన ఆర్డర్ పత్రాన్ని అందజేశారు. లంబాడా కులస్తులకు ఎస్టీ గుర్తింపు హోదాని రద్దు చేసి గతంలో ఇచ్చిన కుల ధృవీకరణ పత్రాలతో పాటు ఏజెన్సీ ధృవీకరణ పత్రాలను వెంటనే రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి మల్లేశ్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 342 ప్రకారం గుర్తించిన ఎస్టీ జాబితా గెజిట్‌లోని 9 ఆదిమ తెగలకు మాత్రమే ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఒక కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చే అధికారం ఒక రాష్ట్ర ప్రభుత్వానికి ఉండదని అలా దొడ్డిదారిన వెలువడిన జీఓ నెం.149ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చడం ద్వారా ఆదివాసీలకు సామాజిక, ఆర్థిక, రాజకీయ, ఉద్యోగాల పరంగా ఎనలేని అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్లు లంబాడీలకు ఎస్టీ ధృవీకరణ పత్రాలు ఇవ్వవద్దని కోరారు ఆదివాసీ ఐక్య వేదిక రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు కుడిమెత సమ్మయ్యదొర, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీసుల లక్ష్మయ్య, బెల్లంకొండ పోశయ్య, పోలం రాజేందర్ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కువినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పలిమెలలో..

పలిమెల: లంబాడీలకు ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలను మంజూరుచేయవద్దని ఆదివాసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మార్వోకు వినతి పత్రం అందించారు. ఆదివాసీ విద్యార్థి సంఘం మండల అధ్యక్షుడు మడే సత్యనారాయణ, మండల నాయకులు మట్టి రమేశ్, కోడె రాంబాబు, అమిలి సుధాకర్, మట్టి శ్రీకాంత్, రమేష్, మట్టి మల్లయ్య, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

మహాముత్తారంలో..

మహాముత్తారం: లంబాడీలను ఎస్టీ జాబితాలో నుంచి తొలగించాలని కోరుతూ గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిషోర్‌కుమార్‌కు తుడుందెబ్బ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ విద్యార్థి సంఘం అధ్యక్షులు పోడెం దామోదర్, నాయకులు శ్రీనివాస్, మారబోయిన ప్రశాంత్, రేగ భూషణం, సట్ల అంజిబాబు, కొమురంభీం యువజన సంఘం కన్వీనర్ పేర సంజిత్, నాయకులు లక్ష్మణ్, పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ





కిరణ్, పీఆర్ ఏఈ, మల్హర్
అంశం: పంచాయతీరాజ్ సేవలు

మల్హర్:

ప్రశ్న: ప్రజలకు పంచాయతీ రాజ్ ద్వారా ఎటువంటి సేవలు అందిస్తున్నారు?

జవాబు: ప్రభుత్వ భవన నిర్మాణాల పర్యవేక్షణ, హరితహారం, ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న: అంతర్గత రోడ్లు, డ్రెయినేజీల పరిస్థితి ఎలా ఉంది?

జవాబు: కొత్తగా రుద్రారం గ్రామంలో పంచాయతీ నిధుల ద్వారా డ్రెయినేజీలను వేయిస్తున్నాం. అలాగే అన్ని గ్రామాల్లో వేయిస్తాం. సీసీ రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థను మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

ప్రశ్న: గ్రామ పంచాయతీలకు కొత్త భవనాలు నిర్మిస్తున్నారా...?

జవాబు: మండలంలో 10 గ్రామ పంచాయతీల్లో తాడిచర్ల, కొండంపేట, రుద్రారం గ్రామ పంచాయతీ భవనాలు కొత్తగా నిర్మించాలి. భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపించాం.

కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలి

ఎంపీపీ వసంత



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వసంత

మహదేవపూర్: అటవీ మండలాలైన మహదేవపూర్, పలిమెల మండలాల్లోని ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలని ఎంపీపీ వసంత అన్నారు. మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీలో గురువారం ఏర్పాటు చేసిన ఆస్పత్రి అభివృద్ది కమిటీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉండి వైద్యం అందించాలని కోరారు. పల్లెల్లో గర్భిణులు నేటికీ ప్రభుత్వ ఆస్పత్రులకు రావడం లేదని, గ్రామాల్లో మంత్రసానులపై ఆధారపడి ప్రసవాలు చేస్తుండటంతో మాతశిశు మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. ఏఎంలు, ఆశావర్కర్లు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించి గర్భిణులు నెలనెలా ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించుకునేలా చూడాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దారు సాంబమూర్తి, ఎంపీడీఓ చందర్, డాక్టర్ శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధుల నిర్ధారణ పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

కాటారం: సంపూర్ణ స్వస్థత కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని కొత్తపల్లిలో వైద్య ఆరోగ్య సిబ్బంది బీపీ, షుగర్, క్యాన్సర్ ఇతరత్రా వ్యాధుల తో బాధపడుతున్నవారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గతంలో వైద్య సిబ్బంది ఆయా గ్రామాల్లో సర్వే నిర్వహించి గుర్తించిన వారికి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు నెల నెలా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. సర్పంచ్ ఉప్పుల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

అసంక్రమిత వ్యాధులపై అవగాహన

మహాముత్తారం: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్య సిబ్బందికి వైద్యాధికారి సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో అసంక్రమిత వ్యాధుల నిర్ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకముందు కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను జెడ్పీటీసీ మందల రాజిరెడ్డి, ఎంపీపీ మెండ వెంకటస్వామితో కలిసి విడుదల చేశారు. ఈ కార్యక్రమం ఈ నెల 18 నుంచి మండలంలో కొనసాగుతుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ తాటి అనసూర్య, సీహెచ్‌వో తిరుపతయ్య, సూపర్‌వైజర్లు ఎలిజబెత్‌రాణి, సత్యవేదం, రమేష్ పాల్గొన్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



ములుగురూరల్: మంగపేట మండలం రాజుపేటలో శ్రీనివాస్‌రెడ్డి ఇంటి సమీపంలో ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. 11 కేవీ విద్యుత్ సరఫరా అయ్యే స్తంభంపై భాగం విరిగడంతో అది ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలి.

– నిహారిక, రాజుపేట

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 9705074445

న్యూస్‌బాక్స్

మద్యం షాపును తనిఖీ చేసిన తహసీల్దార్



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నాగరాజు

మంగపేట: మండల కేంద్రంలోని మద్యంషాపును తహసీల్దార్ అంటి నాగరాజు గురువారం తనిఖీ చేశారు. క్రయవిక్రయాలను పరిశీలించారు. ఎమ్మార్పీ ధరకు మించి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. నిబంధనల మేరకు విక్రయాలు కొనసాగుతున్నాయో లేదనోనని పరిశీలించారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల మేరకు విక్రయాలు జరపాలని, లేనిపక్షంలో సీజ్ చేస్తామని హెచ్చరించారు.

సమాచారం

ములుగు: మండల కేంద్రంలోని వంద పడకల ఏరియా ఆస్పత్రిలో ఉదయం 9గంటల నుంచి మధ్నాహ్నం 2గంటల వరకు ఓపీ సేవలుంటాయి. ప్రసూతి, ఎమర్జెన్సీ 24గంటల సదుపాయం ఉంటుంది. వార్డు డ్యూటీలో ఒకరు. ఓపీలో ముగ్గురు వైద్యులు ఉంటారు.

గ్యాస్ సమాచారం

హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ పరిధిలో గురువారం వరకు బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు శుక్రవారం ములుగు, వెంకటాపురం, గణపురం, గోవిందరావుపేట, తాడ్వాయి మండలాల్లోని పలు గ్రామాలకు సరఫరా ఉంటుంది. ఆన్‌లైన్ బుకింగ్ సెల్ 9666602345కి సంప్రదించాలి. ఇతర సమస్యలకు కార్యాలయంలో సంప్రదించాలి.

మరిన్ని జోన్ వార్తలు 12వ పేజీలో

పథకంపై అవగాహన కరువు

- ఉపాధిహామీలో పశువుల పాకల నిర్మాణం
- వందశాతం సబ్సిడీ
- ప్రచార లేమితో నిర్వీర్యం
- మూగజీవాలకు కరువైన రక్షణ

వెంకటాపురం(కె):

మూగజీవాలకు రక్షణ కల్పించాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో భాగంగా పశువుల పాకలు నిర్మించేందుకు రైతులకు అవకాశం కల్పించింది. ఈ పథకం ద్వారా పశువులు, గొర్రెలు, మేకలకు పాకలు (షెడ్లు) వేసుకునేందుకు కేంద్రం ప్రభుత్వం అవకాశం కల్పించింది. కాని దీనిపై రైతులకు అవగాహన కల్పించడంలో మాత్రం అధికారులు విఫలమయ్యారు. దీంతో పథకం అర్హులకు ఉపయోగపడకుండా పోతోంది. అవగాహన లేకపోవడంతో ఈ పథకం ప్రగతిలో లేకుండా పోతోంది. ఉపాధి హామీ పథకంలో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ అనుబంధంగా రైతులకు లబ్ధి చేకూర్చేందుకు పలు పథకాలను అనుసంధానం చేసింది. అవగాహన లేమితో పథకాల అమలు సరిగా జరగడం లేదు.

ఎండకు ఎండుతూ..వానకు తడుస్తూ

పశువులను ఆరుబయట కట్టేయడంతో అవి ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయి. దీంతో మూగజీవాలు వ్యాధుల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి. దీంతో పాడి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఉపాధిహామీ అధికారులు గ్రామాల్లో ఈ పథకంపై పాడిరైతులకు, సరైన అవగాహన కల్పించకపోవడం కారణంగానే వారి దీనిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు.



పాకలు లేకపోవడంతో ఆరుబయట కట్టేసిన పశువులు

వలసలు నివారించే ఉద్దేశంతో...

గ్రామాల్లో కూలీలు వలసలను నివారించి వారికి పనులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకంలో భాగంగా చిన్న సన్నకారు రైతులను, పలు వృత్తి పనులు చేసుకునే వారిని ఆదుకోవాలని సంకల్పించి ఈ పథకాన్ని ప్రారంభించింది. మూగజీవాల రక్షణ కొట్టలు నిర్మించి వందశాతం రాయితీపై నిధులను మంజూరు చేయాలని నిర్ణయించింది.

పశువుల షెడ్లు నిర్మాణాలు ఇలా..

నాలుగున్నర మీటర్ల పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు, 8.5 అడుగుల ఎత్తు కొట్టం(పాక) నిర్మించుకోవాలి. గొర్రెలు, మేకలకు మూడున్నర మీటర్ల పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు 8.5 అడుగుల ఎత్తు నిర్మించుకోవాలి. పశువులు కనీసం 5 గొర్రెలు 10 ఉన్న వారు ఈ పథకానికి అర్హులు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ఉపాధిహామీ పథకం కింద వందశాతం సబ్సిడీయ వస్తుంది.

కులాల వారీగా ప్రాధాన్యం

లబ్ధిదారుల ఎంపికలో ఎస్సీ, ఎస్టీ వారికి మొదటి ప్రాధాన్యం, తర్వాత బీసీ, ఓసీలను పరిగణిస్తారు. పాకలు నిర్మించుకునేవారు ఈజీఎస్ జాబ్ కార్డు కలిగి ఉండి కనీసం 20 పనిదినాలు చేసి ఉండాలి.

సబ్సిడీ ఇలా

పశు పాకల నిర్మాణాలకు గరిష్టంగా రూ. 50, 630 వేలు గొర్రెలు, మేకల కొట్టాల నిర్మాణానికి రూ. 48,480 వేలు మంజూరు చేయనున్నారు.

30 దరఖాస్తులు వచ్చాయి



ఈ పథకం ప్రారంభం నాటి నుంచి ఇప్పటి వరకు సూమారు 30 దరఖాస్తులు వచ్చాయి. కొట్టాల పనులు ఇంకా ప్రారంభం కాలేదు. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

– ఏపీఓ చరణ్‌రాజ్

15 రోజుల్లో టీబీ నిర్ధారణ మిషన్లు

- సిబ్బందికి అవగాహన కల్పించిన డబ్ల్యూహెచ్‌ఓ ప్రతినిధి

ములుగు: టీబీ నిర్ధారణను సులభతరం చేసే టీబీ నాట్ (ఎన్‌ఏఏటీ) మిషన్ మరో 15 రోజుల్లో ములుగు ఏరియా ఆస్పత్రిలో అందుబాటులోకి వస్తాయని వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ప్రతినిధి జయకృష్ణ అన్నారు. డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య, జిల్లా టీబీ ప్రోగ్రాం అధికారి పోరిక రవీందర్‌తో కలిసి జిల్లాలోని టీబీ సూపర్‌వైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్లకు అవగాహన కల్పించారు. టీబీ నాట్ మిషన్ల విలువ సుమారు రూ.35 నుంచి 40 లక్షలు ఉంటుందన్నారు. మిషన్ అందుబాటులోకి వస్తే టీబీని ఆస్పత్రిలోనే గుర్తించి చికిత్స అందిస్తారన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ప్రోగ్రాం అధికారి రవీందర్ తెలిపారు. టీబీ వ్యాధి గ్రస్తులను నిత్యం మోటివేషన్ చేస్తూ ఉండాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న జయకృష్ణ

గట్టమ్మకు భక్తుల మొక్కులు



గట్టమ్మ వద్ద మొక్కులు పెడుతున్న భక్తులు

ములుగు: మండలంలోని ప్రేమ్‌నగర్ సమీపంలో కొలువుదీరిన గట్టమ్మ తల్లికి భక్తులు మొక్కులు చెల్లించారు. మేడారం జాతరకు వస్తున్న భక్తులు గట్టమ్మ వద్ద ఆగి పూజలు చేశారు.

బస్సు, కరెంట్ సౌకర్యం కల్పించాలి

ఏటూరునాగారం: మండలకేంద్రం నుంచి 26 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఐలాపురానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం, త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యం కల్పించాలని గ్రామ పెద్ద మల్లెల లక్ష్మయ్య, కొమురం భీం యువజన సంఘం అధ్యక్షుడు పీర్ల సురేష్ అన్నారు. గురువారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అటవి ప్రాంతం ఐలాపురంలో జీవిస్తున్న ప్రజలను ఐటీడీఏ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తాత్కాలిక రోడ్డు సౌకర్యం ఉన్నా బస్సు నడవడం లేదన్నారు. త్రీఫేజ్ సౌకర్యం లేకపోవడంతో పంటలకు నీళ్లు అందడం లేదన్నారు. ఇందిరజల ప్రభ కింద బోర్లు మంజూరైనా కరెంటు లేక అవి నిరుపయోగంగా ఉన్నాయన్నారు. మేడారం జాతరకు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చే భక్తులు ఐలాపురంలోని సమ్మక్క, సారలమ్మ గద్దలను దర్శించుకోనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. సతీష్, వినోద్, సమ్మయ్య, శ్రీను, మధు, సమ్మయ్య, రవీందర్, చిట్టిబాబు, సమ్మయ్య, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గ్రామ పెద్ద మల్లెల లక్ష్మయ్య


సాక్షి
జయశంకర్
శుక్రవారం | జనవరి | 5 | 2018

న్యూస్ బాక్స్

పాఠశాలలను పరిశీలించిన మానిటరింగ్ అధికారులు

వెంకటాపురం(కె): మండలంలోని ఓంటి మామిడి, కస్తూర్బా గాంధీ పాఠశాలలను రాష్ట్ర మానీటరింగ్ అధికారుల బృందం గురువారం పరిశీలించింది. పాఠశాల ల్లోని సీఈసీ రికార్డులు, ప్రోగ్రస్ కార్డులు పరిశీలించారు. విద్యార్థుల సామార్థ్యా లను పరీక్షించారు. వివేక్, మధుసుధన్, ఎంఈఓ వీరభద్రరావు ఉన్నారు.

33శాతం వాటా సాధనే లక్ష్యం

ములుగు: మేడారం మహాజాతరలో తల నీలాల సేకరణతో వచ్చే ఆదాయంలో 33 శాతం వాటా సాధనే లక్ష్యంగా ఉద్య మించాలని నాయిబ్రాహ్మణ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుగొండ శర బందం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం జరిగిన సమావే శంలో ఆయన మాట్లాడారు. 2004 ఒప్పందాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వాటా సాధనకు గతం లో రెండు సార్లు దీక్షలు చేపట్టగా అధికారులు హామీ ఇచ్చి విస్మరించార న్నారు. దేవేందర్, ప్రకాశ్, వెంకటస్వా మి, శ్రీనివాస్, విక్రం, రవి, నాగరాజు, రాంబాబు, రమేశ్, చిక్కుల రమేశ్, వీర స్వామి, సతీశ్ పాల్గొన్నారు.

ఆటోలు, మేకలు పంపిణీ

వెంకటాపురం(కె): మండలపరిధిలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం గుడుంబా పునరావాస పథకంలో భాగాంగా లబ్ధిదారులకు ఆటోలు, మేక లను ఎంపీపీ ఎట్టి ఝాన్సీలక్ష్మీబాయి అందజేశారు. ఎంపీడీఓ ఫణిచంద్ర మాట్లాడుతూ పునరవాస పథకం కింద లబ్ధిదారులకు ఒక్కొక్కరికీ రెండు లక్షల చొప్పున యూనిట్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. నలుగురికి ఆటోలు, ఇద్ద రికి 40 మేకల చొప్పన 80 మేకలు అంద జేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐ ఫకీ రా,ఎస్సై రాజన్న పాల్గొన్నారు.

27వ రోజుకు చేరుకున్న 'బిల్ట్' దీక్షలు

మంగపేట: మండలంలోని కమలాపురం బిల్ట్ ఫ్యాక్టరీ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 27వ రోజుకు చేరుకున్నాయి. ములుగు జిల్లా సాధన సమితి వ్యవస్థాపక అధ్య క్షుడు ముంజాల భిక్షపతి, నాయకులు గురువారం దీక్షలకు సంఘీబావం తెలిపారు. పాలకుల నిర్లక్ష్యంతోనే కార్మికులు రోడ్డునపడ్డారని విమర్శిం చారు. కురెందుల విజయ్, తలగాని జగన్ గౌడ్, మంగపేట మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు



వాజేడు: మండలంలో రబీ వరి నాట్లు మమ్మరంగా ప్రారంభించారు. వ్యవసాయ బోర్ల కింద రైతులు నాట్లు వేస్తున్నారు. మండలంలో వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో చెరువులు, కుంటల నిండక పోవ డంతో వ్యవసాయ బోర్ల కింద మాత్రమే దుక్కులు దున్ని నాట్లు వేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు పదిహేను వందల ఎకరాల్లో సాగు ప్రారంభించారు.

రిజర్వేషన్ తొలగించాలి

- తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆదివాసీల ఆందోళన
- లంబాడీల రిజర్వేషన్ రద్దు చేయాలని వినతి

వెంకటాపురం(కె): లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్ తొలగిం చాలని ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ నాయకులు పూనెం రామచందర్, యాసం రాజు పూనెం సాయి అన్నారు. గురువారం మండలకేంద్రంలో ఆదివాసీ సంఘాల జేఏసీ సమావేశం నిర్వహించారు. లంబాడీల కారణంగా ఆదివాసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. అర్హత లేని లంబాడీ లు ఆదివాసీ ఉద్యోగాలను కొల్లగోడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఖమ్మం ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మినారాయణకు వినతిపత్రం అందజేశారు.

ఎస్‌ఎస్‌తాడ్వాయి: లంబాడీలకు ఎస్టీ రిజర్వేషన్‌ను రద్దు చేయాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు బంగారు సాంబయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తు గురు వారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు మెమోరడం అందించారు.



ఎమ్మెల్సీ బాలసానికి వినతిపత్రం ఇస్తున్న ఆదివాసీలు

మంగపేట: లబండీలను ఎస్టీ జాభితా నుంచి తొలిగిం చాలని డిమాండ్ చేస్తూ తుడుందెబ్బ ఆధ్వర్యంలో తహీ ల్దార్ కార్యలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్‌కు గురు వారం వినతి పత్రాన్ని అందచేశారు.

గోవిందరావుపేట: లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొల గించాలని, వారికి ఇచ్చిన ఏజన్సీ ధృవీకరణ పత్రాలను రద్దు చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటి హన్మంతరావు డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వ హించి తహసీల్దార్ రవిరాజ్‌కుమార్‌రావుకు వినతి పత్రం సమర్పించారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి

ములుగు: ఎస్సీ వర్గీకరణ బిల్లును శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో ప్రవేశపెట్టాలని అఖిలభారత యాదవ మహాసభ డివిజన్ అధ్యక్షుడు వంగ రవియాదవ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని గాంధీ విగ్రహం ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షకు గురువారం ఆయన సంఘీభావం తెలిపారు.

ఉద్యమ కారులను అణచి వేయడం సరికాదు: సీతక్క

ఏటూరునాగారం: న్యాయబద్ధంగా ఉద్యమాలు చేస్తున్న వారిని అరెస్టు చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలకేంద్రంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. సీతక్క వారికి మద్దతిచ్చారు. ఆమె మాట్లా డుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఎస్సీ వర్గీకర ణ కోసం అఖిలపక్షాని ఢిల్లీకి పంపించాలన్నారు.

గోవిందరావుపేట: ఎస్సీ వర్గీకరణ అంశంలో ప్రభుత్వం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సీతక్క

దళితులను మోసం చేస్తూ కాలం గడుపుతుందని ఎమ్మా ర్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి నెమలి నర్సయ్య మాదిగ అన్నారు. మండలంలోని గోవిందరావుపేట, చల్వాయి గ్రామాలలో గురువారం నాయకులు ఉపవాసదీక్షలు చేయగా, చల్వా యిలో వార్డు సభ్యుడు తెల్ల హరిప్రసాద్ దీక్షలను ప్రారం భించారు.

గొడవలకు తావివ్వొద్దు

వాజేడు: క్రీడాకారులు గొడువలకు తావులేకుండా పేరూరు ఎస్సై కాగితోజు శివప్రసాద్, జెడ్పీటీసీ ధనలక్ష్మి, సర్పంచ్ సరస్వతి అన్నారు. మండలపరిధిలోని పేరూరు లో సంక్రాంతి సందర్భంగా యూత్ ఆధ్వర్యంలో నిర్వహి స్తున్న క్రికెట్ పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. మండలస్థాయి పోటీల్లో క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని చాటాలన్నారు.

పోటీలు ప్రారంభిస్తున్న ఎస్సై



అమృతతండా రోడ్డు వేయిస్తా : మంత్రి చందూలాల్

గోవిందరావుపేట: మండలం లోని కర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని అమృతండాకు రోడ్డు వేయించి, గుండ్లవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేస్తానని గిరిజనాభివృద్ధి, పర్యాటక, సాంస్కృతికశాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ ఆ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఎంపీటీసీ లకావత్ చందూలాల్, టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు సంసోతు రాజన్న నాయక్ ఆధ్వర్యంలో అమృతండా గ్రామస్తులు గురువారం ఉదయం మంత్రి చందూలాల్‌ను హైద్రాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సమస్యలు వివరించారు.



మంత్రిని కలిసిన అమృతండా వాసులు

గుండెపోటుతో గ్రామ అధ్యక్షుడు మృతి

ఏటూరునాగారం: మండలంలోని చెల్పాక టీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు మడప శ్రీనివాస్(35) గురువారం గుండెపోటుతో మృతి చెందాడు. శ్రీనివాస్ గుండెనొప్పిగా ఉందని కుటుంబసభ్యులకు తెలపడంతో చికిత్స నిమిత్తం వారు ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు విలపించారు. మృతుడికి భార్య స్వర్ణలత, కుమారుడు ప్రణయ్, ప్రణిత ఉన్నారు.

పలువురు పరామర్శ:

మడప శ్రీనివాస్ కుటుంబ సభ్యులను టీఆర్‌ఎస్ నాయకులు పరామర్శిం చారు. సర్దార్‌పాషా, ఏటూరునాగారం టౌన్ అధ్యక్షుడు ఖాజాపాషా, మైనార్టీ మండల కమిటీ అధ్యక్షుడు ఎండీ అక్బర్, లొటపెటల రాజేష్, చంద్రబాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే సీతక్క ఆ కుటుంబాన్ని పరామ ర్శించి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె వెంట కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

సీఐని కలిసిన వైఎస్సార్ సీపీ నాయకులు

ఏటూరునాగారం: ఏటూరునాగారం సీఐగా బాధ్యతలు చేపట్టిన బత్తుల సత్యనారాయణను వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం కలుసుకొని పుష్ప గుచ్చం అందజేశారు. కార్యక్ర మంలో వైఎస్సార్ సీపీ మండల అధ్య క్షుడు ఖైసర్‌పాషా. మనోజ్, ప్రణయ్, రాజేష్ పాల్గొన్నారు.



సీఐకి పుష్పగుచ్ఛం ఇస్తున్న దృశ్యం

ఎన్‌సీడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ములుగురూరల్: అసంక్రమిత వ్యాధి నిర్ధారణకు ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు డిప్యూటీ డీఎం హెచ్ఓ అజ్మీరా చందూనాయక్ సూచించారు. పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో కార్యక్రమాన్ని ప్రారంభించిన సిబ్బంది గ్రామస్తులకు వైద్య పరీక్ష లు నిర్వహించారు. రాయిగూడెం పీహెచ్‌సీ వైద్యాధికారి పోరిక జ్యోత్స్నతో కలిసి గురువారం ఆయన మల్లంపల్లి సబ్ సెంటర్‌ను తనిఖీ చేశారు. సిబ్బంది నిర్లక్ష్యం చేయొద్దని ఆదేశించారు.

ఇంటర్వ్యూ

పంచాయతీ ఈఓ సామెల్

అంశం: పన్నుల వసూళ్ల అమలు



వెంకటాపురం(కె):

ప్రశ్న: పంచాయతీలో పన్నుల వసూళ్లు ఎలా కొనసా గుతున్నాయి?

జవాబు: ఇంటి పన్నులు, నల్లా పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. కొంత మంది స్వచ్ఛందంగా కార్యాలయానికి వచ్చి పన్నులు చెల్లిస్తున్నారు.

ప్రశ్న: గత సంవత్సరం ఎంత శాతం మేర పన్నుల వసూళ్లు చేశారు?

జవాబు: గతేడాది పన్నుల వసూళ్లకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, 95 శాతం మేర పన్నులు వసూళ్లు చేశాం.

ప్రశ్న: తాగునీటి సరఫరా ఎలా ఉంది?

జవాబు: ప్రస్తుతం తాగునీటి సరఫరాలో సమస్యలేదు. వేసవి కోసం ఇప్పటి నుంచే తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: పంచాయతీ అభివృద్ధి కోసం ఏలాంటి ప్రణాళికలు చేపట్టారు?

జవాబు: పంచాయతీ పరిధిలో వెనుకబడిన ప్రాంతాలను గుర్తించివాటి అభివృద్ధికి కృషి చేస్తాం.

శుక్రవారం | జనవరి | 5 | 2018
సాక్షి

జాతీయ రహదారికి మరమ్మతు

- ఆత్మకూరు నుంచి చల్వాయి వరకు పనులు
- రోలింగ్ చేయకుండా తూతూ మంత్రంగా బీటీ


జాతీయ రహదారిపై మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

ములుగు: మేడారం మహాజాతర ఈనెల 31వ తేదీ నుంచి ప్రారంభంకానున్నందున జాతీయ రహదారి 163పై సంబంధిత అధికారులు మరమ్మతు పనులు చేపడుతున్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని ఆత్మకూరు నుంచి గోవిందరావుపేట మండలం చల్వాయి వరకు సుమారు 40 కిలో మీటర్ల పరిధి మేర ఏర్పడిన గుంతల్లో బీటీ వేసి పూడ్చుతున్నారు. దీంతో పాటు నాణ్యత దెబ్బతిన్న ప్రాంతాల్లోనూ పై పూతగా బీటీ వేస్తున్నారు. ఇంతకు ముందే చల్వాయి నుంచి పస్రా వరకు మరమ్మతు చేశారు. గత ఐదు రోజులు పనులు జరుగుతున్నాయి.

తూతూ మంత్రంగా..

వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చే భక్తులకు అనుగుణంగా సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నామని అధికారులు చెప్పుకుంటున్నారు. అయితే వేలాది వచ్చే వాహనాల రాకపోకలను తట్టుకోవడానికి వీలుగా గుంతలను తవ్వి బీటీ నింపాల్సిన కాంట్రాక్టర్ అవేమీ పాటించకుండా రోడ్డుపై పూతగా బీటీని పరుస్తూ తూతూ మంత్రంగా పనులు చేపడుతున్నాడని ఆరోపణలు వినవస్తున్నాయి. పైగా వేస్తున్న బీటీపై రోలింగ్ చేయకుండా కేవలం దిమ్మెలతో అంటీముట్టనట్లు సరిచేస్తున్నారు.

10 లోగా పూర్తిచేయాలి

- ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు
- గిరిజన మ్యూజియంపై అధికారులతో సమావేశం


మేడారం మ్యూజియంపై డీడీ, అసిస్టెంట్ డైరెక్టర్లతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు

ఏటూరునాగారం: గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ఒకేచోట నిలిపే గిరిజన మ్యూజియం పనులు ఈనెల 10లోగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ చక్రధర్‌రావు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రం లోని ఐటీడీఏ పీఓ చాంబర్‌లో గురువారం గిరిజన మ్యూ జియం డిప్యూటీ డైరెక్టర్ డి. సత్యనారాయణ, అసిస్టెంట్ డైరెక్టర్లు రామకృష్ణ, శంకర్, మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ కాక లింగయ్య, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావుతో పీఓ సమావేశమయ్యారు. మేడారం జాతర లోపు మ్యూజియాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. గిరిజన మ్యూజియం పైన కోయకులస్తులు నృత్యాల సమయంలో తలపై ఉపయోగించే కొమ్ములను సుమారు 12 ఫీట్ల ఎత్తులో అమర్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మ్యూజియంకు రంగును గిరిజనులు ఎక్కువగా ఇళ్లకు ఉపయోగించే పుట్టమన్ను కలర్, పేడ కలర్‌ను వేయాలన్నారు. చినుకుల ముగ్గులను మహిళలతోనే వేయించాలని సూచించారు. శ్రీ సమ్మక్క–సారలమ్మ గిరిజన మ్యూజియం అనే పేరును స్టీల్‌తో తయారు చేయించి బోర్డును అమర్చాలన్నారు. గోడకు అమర్చే షోకేజ్‌లు 20, ఫ్లోరింగ్‌పై అమర్చే బీరువాలు 17 తయారు చేసేందుకు ప్రత్యేక కార్పెంటర్‌ను పిలిపించి కొలతను తీయించినట్లు డీడీ సత్యనారాయణ పీఓకు వెల్లడించారు. మ్యూజియంలో అమర్చే వస్తువులను సేకరించేందుకు పూర్తిస్థాయిలో నిమగ్నమై ఉండాలని పీఓ అన్నారు. లఘు చిత్రాల నమూనాలను హైదరాబాద్ నుంచి తెప్పించి వాటిని పరిశీలించిన తర్వాత ఎంపిక చేయడం జరుగుతుందని పీఓ అన్నారు. సేకరించిన వస్తువులను జాగ్రత్తగా భద్రపరచాలని ఆదేశించారు. పెసా జిల్లా కన్వీనర్ కొమురం ప్రభాకర్, ఆర్‌ఓఎఫ్‌ఆర్ ప్రభాకర్, ఫొటోగ్రాఫర్ రాజేష్ పాల్గొన్నారు.

ఇసుక బస్తాల కట్టల పనులు షురూ

ఎస్ఎస్‌తాడ్వాయి: జంపన్నవాగులో ఇసుక కట్టల ఏర్పాట్ల పనులను ప్రారంభించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగులో నీటి లభ్యత కోసం నాలుగు చోట్ల శాశ్వత చెక్ డ్యాం నిర్మాణాల కోసం నిధులు కేటాయించారు. కాని ఆ పనులు జాతర వరకు పూర్తయ్యే పరిస్థితి లేదనే ఉద్దేశంతోనే ఆ శాఖ అధికారులు తాత్కాలిక ఇసుక బస్తాల అడ్డుకట్టల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపారు.అందుకు స్పందించిన ప్రభుత్వం రూ కోటిపైగా నిధులు మంజూరు చేసింది. వాగులో మునిగి స్నానమాచరించే భక్తులకు నీటి లభ్యం కోసం జంపన్నవాగులో 12 చోట్ల ఇసుక బస్తాల అడ్డు కట్టలు ఏర్పాటు చేస్తున్నారు. నీటి నిల్వతోపాటు ఇసుక బస్తాలపై నుంచి నీళ్లు సమాంతరంగా వెళ్లనున్నాయి.


జంపన్నవాగులో ఇసుక బస్తాలు వేస్తున్న కూలీలు

జాతరలో జేబుదొంగలు..!


బాధితుడు వీరభద్రం

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో జేబు దొంగల బెడద మొదలైంది. జాతరకు ముందుగానే మేడారంలో జేబు దొంగలు ప్రవేశించారు. ఇప్పటికే నాలుగైదుసార్లు భక్తుల జేబులను కొట్టేసిన దొంగలను పోలీసులు పట్టుకున్నారు. తాజాగా గురువారం ఓ భక్తుడి జేబులోని డబ్బులను కొట్టేసిన బాలికను భక్తులు పట్టుకున్నారు. అంతేగాకుండా ఖమ్మం జిల్లాకు చెందిన వీరభద్రం కుటుంబ సమేతంగా మేడారం వచ్చారు. సమ్మక్క గద్దె వద్ద మొక్కులు చెల్లిస్తున్న క్రమంలో ఆయన ప్యాంట్ జేబులోని డబ్బులను కొట్టేశారు. తన జేబులో రెండు వేల నోట్లు రూ. 40 వేలకు పైగా ఉన్నాయని సమ్మక్క గద్దె వద్ద భక్తుల రద్దీ ఎక్కువగా ఉండడంతో దొంగలు తన డబ్బులు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశాడు. సీసీ కెమెరాల ద్వా రా దొంగలను కనుక్కొనేందుకు ఎండోమెంట్ కార్యాలయంలోని సీసీ ఫుటేజీలను బాధిత భక్తులు పరిశీలించారు. ఈ విషయంపై భక్తులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పోలీసులు దృష్టి సారించాల్సి ఉంది.

మేడారం ముచ్చట్లు

తరలివచ్చి.. మొక్కులు తీర్చి..


యాటతో మొక్కుతున్న భక్తులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర సమయం దగ్గర పడుతున్న కొద్దీ భక్తుల రాక ఊపందుకుంది. వనదేవతలను దర్శించుకునేందుకు గురువారం వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తల్లుల గద్దెల వద్ద పసుపు, కుంకుమ, ఎత్తు బెల్లం, కొబ్బరికాయలు, ఒడిబియ్యం, కానుకలు, తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం చెట్ల కింద వంటావార్పుతో మేడారం పరిసరాలు సందడిగా మారాయి.


తల్లులకు ఎత్తు బంగారం సమర్పించేందుకు వెళ్తున్న భక్తులు


కల్యాణకట్ట వద్ద తలనీలాలు సమర్పించుకుంటున్న భక్తులు


నృత్యం చేస్తున్న భక్తులు




బొమ్మలు, లడ్డు ప్రసాదాన్ని కొనుగోలు చేస్తున్న భక్తులు

మరుగున పడ్డ మరుగుదొడ్ల పనులు

మేడారంలో మరుగుదొడ్ల నిర్మాణం పనులు నత్తనడకన సాగుతున్నాయి. జాతరకు వచ్చే భక్తు ల సౌకర్యార్థం 4వేల సెమీ పర్మనెంట్ , 1350 తాత్కాలిక, 60 పర్మనెంట్, 60 వీఐపీ టాయిలెట్లు జాతర జరిగే పరిసర ప్రాంతాల్లో నిర్మించాల్సి ఉంది. ఇప్పటివరకు వందల సంఖ్యలో కూడా మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కాలేదు. జాతర కోసం ఆధునిక మొబైల్ టాయిలెట్లను తెప్పించినా వాటిని వీఐపీ భక్తులకే అని పక్కన పెట్టారు. బేస్‌మెంట్ లెవల్ లోనే మరుగుదొడ్ల నిర్మాణాలు ఉన్నాయి.

మరుగుదొడ్ల కోసం కడుతున్న బేస్‌మెంట్లు


నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకు


గోదావరి జలాలు అందేనా?

మిషన్ భగీరథ పథకం కింద జాతర భక్తులకు గోదావరి జలాలను అందించేందుకు మేడారంలో వాటర్ ట్యాంకు నిర్మిస్తున్నారు. ట్యాంకు ద్వారా జాతరలోని నల్లాలకు పైపులైన్ కనెక్షన్ పనులు చేయాల్సి ఉంది. నిర్మాణ పనులను బట్టి చూస్తే జాతర వరకు కూడా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. జాతరలో 50శాతం మేరకేనా గోదావరి జలాలను భక్తులు అందిస్తామని చెబుతున్న అధికారులు ఆ దిశగా పనులు వేగవంతం చేయడంలో అశ్రద్ధ చూపుతున్నారు.

మహాజాతర.. పనులు పాతర

సమీపిస్తున్న మేడారం జాతర

- నేటికీ పూర్తికాని అభివృద్ధి పనులు
- పదిరోజులే డెడ్‌లైన్
- జాడలేని తాగునీటి పైపులైన్
- నత్తనడకన మరుగుదొడ్ల నిర్మాణం
- జాతర భక్తులకు 'మిషన్ భగీరథ' నీళ్లు అనుమానమే
- వైద్య సేవలు అంతంతమాత్రమే..

మేడారం జాతర సమీపిస్తున్నా అధికారుల అలసత్వం, పాలకుల పట్టించుకోని తనంతో భక్తులకు ఇక్కట్లు తప్పేటట్లు లేవు. ఎప్పటిపనులు అప్పుడే చేయడం అలవాటు చేసుకున్న అధికారులు ఈ సారి జాతరకు కూడా పది రోజుల ముందు హడావుడి చేసి చేతులు దులుపుకునేలా ఉన్నారు. కొత్త రాష్ట్రం, కొత్త జిల్లా ఏర్పడినా జాతర లో శాశ్వత పనుల ఊసే లేదు. తాత్కాలిక పనులు చేయడం తోనే అధిక లాభాలున్నాయని పాలకులు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు

-ఎస్ఎస్ తాడ్వాయి

మేడారం సమ్మక్క సారలమ్మ జాతర మహాజాతర సమయం ఇంకా 25 రోజులే ఉంది. జాతర సమీపిస్తున్న తరుణంలో భక్తుల భక్తుల తాకిడి మేడారానికి రోజురోజుకు పెరుగుతూనే ఉంది. కానీ.. జాతర అభివృద్ధి పనులు నత్తేనయం అన్నట్లుగా సాగుతున్నాయి. ఈనెల 15కల్లా పనులన్నింటినీ పూర్తి చేయాలని విధించిన డెడ్‌లైన్ పట్టుమని పది రోజుల కూడా లేదు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణం పనుల్లో వేగం పుంజుకోవడం లేదు. కొత్త తాగునీటి పైపులైన్ నిర్మా ణం పనులు సైతం ప్రారంభించలేదు. డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి హైదరాబాద్‌లో జాతర అభివృద్ధి పనులపై కొద్ది రోజుల క్రింత నిర్వహించిన సమీక్ష సమావేశంలో కూడా జనవరి 15కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించినా పూర్తయ్యేది అనుమానంగా ఉంది. అధికారుల తీరును పరిశీలిస్తే జాతర నాటికి కూడా పనులు సాగేలా కనిపిస్తున్నాయి.

ఆలయానికి రంగులు ఎప్పుడు..?



దేవాదాయశాఖ ఆధ్వర్యంలో రూ. 2.60 కోట్ల రంగుల పనులు జరుగుతున్నాయి. వీటితో కల్యాణ కట్టల నిర్మాణం, క్యూలైన్లకు మరమ్మతు, సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణంలో పెయింటింగ్, లైటింగ్ తదితర ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ పనులు నామినేషన్ పద్ధతిలో ఇవ్వాలంటూ ఆదివాసీలు, టెండర్లు నిర్వహిస్తామంటూ దేవాదాయశాఖ అధికారులు తెలుపడంతో పనులు ఆగిపోయాయి. ఇటీవల కొలిక్కి వచ్చినప్పటికీ రంగుల పనులు మాత్రం ప్రారంభం కాలేదు. తడుకలు వేయడంతో క్యూలైన్ల బారికేడ్లకు వేసిన రంగులు ఆరక భక్తుల చేతులకు అంటే అవకాశాలున్నాయి.

వైద్య సేవలు అంతంతమాత్రమే..



జాతరకు నెలరోజుల ముందు నుంచే దేవతలను దర్శించుకునేందుకు మేడారానికి భక్తులు వేల సంఖ్యలో వచ్చిపోతున్నారు. కల్యాణ మండపం ఫస్ట్ ఫ్లోర్ భవన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో వైద్యశాలను నేటికి ఏర్పాటు చేయలేదు. దీంతో భక్తులు వైద్య సేవల కోసం ఆస్పత్రి లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.మూడు రోజుల క్రితం మేడారంలోని సబ్‌సెంటర్‌లో వైద్యశాల సేవలు ప్రారంభించినప్పటికీ గద్దెలకు కిలోమీటర్ల దూరం ఉండడంతో భక్తులకు సేవలకు ఏమాత్రం వినియోగంలోకి రావడం లేదు. భక్తుల సౌకర్యార్థం వైద్య సేవలు అందుబాటులో ఉంచాల్సి ఉంది.

క్యూలైన్లలోనే సాగుతున్న ఆర్టీసీ పనులు



దేశం నలుమూలల నుంచి జాతరకు రికార్డు స్థాయిలో 4,000 బస్సులు నడిపించాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఏర్పాట్లు మాత్రం కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. ఆర్టీసీ సిబ్బంది కోసం తడుకలతో తాత్కాలిక గదులు ఏర్పాటు చేశారు. క్యూలైన్ల పనులు మాత్రం ఇంకా సాగదీస్తున్నారు. టికెట్ బుకింగ్ కౌంటర్ల గదుల ఏర్పాట్లు పనులు చేపట్టలేదు. పనులు ఊపందుకోలేదు.

తాగునీటి పైపులైన్ పనులు


జాడలేని తాగునీటి పైపులైన్ పనులు

జాతరలో భక్తులకు తాగునీటి సౌకర్యం చాలా ప్రధానమైనది. తాగునీటి కోసం కాంట్రాక్టర్లు బోరుబావుల్లో మోటార్లు బిగించడం, జాతర పరిసరాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ నల్లాలను ఏర్పాటు చేస్తున్నారు. బోరుమోటార్ల ద్వారా నల్లాలకు తాగునీటి సరఫరా చేయాలి. కొత్త పైపులైన్ నిర్మాణం పనుల కోసం అధికారులు హైదరాబాద్‌లో వారు చెప్పిన పైపుల కంపెనీలోనే పైపులకు కాంట్రాక్టర్లు ఆర్డర్ చేశారు. సంబంధిత అధి కారులు అక్కడికి వెళ్లి పైపులను పరిశీలించి వారి ఒకే అంటే కాంట్రాక్టర్లు తీసుకురావాలనే నిబంధనలు ఉన్నాయి. పైపులకు కాంట్రాక్టర్లకు ఆర్డర్ చేసి రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో పైపులైన్ నిర్మాణం పనులు ప్రారంభానికి నోచుకోవడం లేదు.

'ఐనవోలు' ఏర్పాట్లు పూర్తి చేయాలి


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీ సునీత

ఐనవోలు(వర్ధన్నపేట): ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి జాతర బ్రహ్మోత్సవాలు దగ్గర పడుతున్నందున ఏర్పాట్లను పూర్తి స్థాయిలో త్వరితగతిన పూర్తి చేయాలని దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సునీత అన్నారు. మండల కేంద్రంలోని ఐనవోలు మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను గురువారం ఆమె పరిశీలించారు. స్నానాల కోసం కల్యాణకట్ట వద్ద ఏర్పాటు చేసిన అధునాతన షవర్లు, దుస్తులు మార్చుకునే గది, క్యూ ఏర్పాటు, టికెట్ కౌంటర్లు, నూతనంగా ఉత్తర, దక్షిణ దిశల్లో ఏర్పాటు చేసిన ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎంపీపీ మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు పాలక వర్గం బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విజయవంతమయ్యే విధంగా చూడాలని కోరారు. వీరి వెంట ఆలయ చైర్మన్ గజ్జెల్లి శ్రీరాములు, ఈఓ సదానందం, సర్పంచ్ పల్లకొండ సురేష్, ఎంపీటీసీ బోళ్లపెల్లి మధు, దర్మకర్తలు తక్కళ్లపెల్లి చందర్‌రావు, యాకూబ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొత్తకొండ జాతరకు స్పెషల్ బస్సులు

హుజూరాబాద్ డీఎం ధరంసింగ్


డీఎం ధరంసింగ్

భీమదేవరపల్లి(హుస్నాబాద్): భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి జాతర నేపథ్యంలో మూడు రోజుల పాటు 250 ప్రత్యేక ఆర్టీసీ బస్సు ట్రిప్పులను నడపనున్నట్లు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ డీఎం ధరంసింగ్ వెల్లడించారు. మండలంలోని కొత్తకొండ వీరభద్రస్వామిని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులకు పలు వివరాలు తెలిపారు. జాతరలో ప్రధాన ఘ ట్టాలైన 14, 15, 16 తేదీల్లో హుజూరాబాద్ నుంచి వయా మాణిక్యాపూర్, గోపాల్‌పూర్, జీల్గుల మీదుగా 250 బస్ ట్రిప్పులను నడపనున్నట్లు తెలిపారు. హుజూరాబాద్ నుంచి కొత్తకొండకు పెద్దలకు రూ. 42, చిన్నలకు రూ. 21 టిక్కెట్ ధర నిర్ణయించామన్నారు. మూడు రోజుల పాటు కొత్తకొండ, హుజూ రాబాద్ నుంచి ప్రతి అరగంటకోమారు ఆర్టీసీ బస్సులను నడపనున్నట్లు వివరించారు. ఇందులో ఈఓ హరిప్రకాశ్‌రావు, టీఎంయూ అధ్యక్షులు పీఎ ల్.రావు, జనరల్ సెక్రటరీ ఉపేందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల భద్రయ్య ఉన్నారు.